శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు: గవర్నర్

సాక్షి, అమరావతి: సామరస్య పూర్వక జీవనమే సమాజ నిర్మాణానికి పునాదనే సందేశాన్ని శ్రీకృష్ణ జన్మాష్టమి మనకు అందిస్తోందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ రాష్ట్రంలో శాంతి, ప్రగతి, శ్రేయస్సుకు నాంది పలకాలని గవర్నర్ ఆకాంక్షించినట్టుగా రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి.

ప్రత్యేకాధికారుల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పది మునిసిపాలిటీలకు ప్రత్యేకాధికారుల పదవీ కాలాన్ని పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్న వీటికి గత జూన్, జూలై నెలల్లో గడువు ముగిసింది. దీంతో మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

హెచ్‌ఆర్‌సీ ఆదేశాలపై హైకోర్టు విస్మయం

జల వనరుల శాఖకు ఊరట.. అలాంటి అధికారం హెచ్‌ఆర్‌సీకి ఎక్కడ ఉందన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి: భూ సేకరణ పరిహారం చెల్లింపులో జాప్యం చేసినందుకుగాను బాధితుడికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశిస్తూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (ఎస్‌హెచ్‌ఆర్‌సీ) ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. భూ సేకరణ వ్యవహారాల్లో పరిహారం చెల్లింపునకు ఆదేశాలు జారీచేసే అధికారం హెచ్‌ఆర్‌సీకి ఎక్కడ ఉందని ప్రశ్నించింది. రూ.10 లక్షల పరిహారం చెల్లించాలన్న హెచ్‌ఆర్‌సీ ఆదేశాలను హైకోర్టు నిలిపేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని హెచ్‌ఆర్‌సీ రిజిస్ట్రార్, ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కర్నూలు కలెక్టర్, నంద్యాల ఆర్‌డీవోలను ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 1వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

10 లక్షల పరిహారం ఇవ్వాలన్న హెచ్‌ఆర్‌సీ

నంద్యాలలోని వీరాపురం చెరువును పునరుద్ధరించాలని 1993లో అధికారులు నిర్ణయించారు. అందుకు కొంత భూమిని సేకరించాలని నిర్ణయించి ముసాయిదా భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. అయితే, సేకరించదలచిన భూములు పట్టా భూములు కాదని, ప్రభుత్వ భూములని తెలుసుకున్న అధికారులు ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. దీనిపై కొందరు వ్యక్తులు 2003లో హైకోర్టును ఆశ్రయించి పరిహారం చెల్లించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఆ భూములు పట్టా భూములు కాకపోవడం, ఆ భూములను సేకరించకపోవడం వల్ల వాటికి ఎలాంటి పరిహారం ఇవ్వాల్సిన అవసరం లేదంటూ హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టేసింది. ఆ తరువాత మరికొందరు ఇదే అంశంపై 2013లో హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్ పెండింగ్‌లో ఉంది. ఈ పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తుల్లో ఒకరైన ఎంజేఎస్ రాజు 2021లో హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. పరిహారం చెల్లించకుండా అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. విచారణ జరిపిన హెచ్‌ఆర్‌సీ రాజుకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని జల వనరుల శాఖ అధికారులను ఆదేశిస్తూ ఈ ఏడాది మే 5న ఉత్తర్వులిచ్చింది.

హెచ్‌ఆర్‌సీకి ఆ అధికారం లేదన్న హైకోర్టు

ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి, నీటి పారుదల శాఖ అధికారులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున ప్రభుత్వ న్యాయవాది (నీటి పారుదలశాఖ) శీలం శివకుమారి వాదనలు వినిపిస్తూ.. హెచ్‌ఆర్‌సీ ముందు వాస్తవాలను ఉంచలేదన్నారు. ఈ మొత్తం వ్యవహారాన్ని హెచ్‌ఆర్‌సీ సరైన దృష్టి కోణంలో చూడలేదన్నారు. భూ సేకరణ, పరిహారం తదితర అంశాలు హెచ్‌ఆర్‌సీ పరిధిలోకి రావని తెలిపారు. వివాదం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా, ఆ అంశంపై హెచ్‌ఆర్‌సీ జోక్యం తగదన్నారు. ఈ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. భూ సేకరణ, పరిహారం వ్యవహారాల్లో హెచ్‌ఆర్‌సీ ఎలా జోక్యం చేసుకుంటుందని ధర్మాసనం ప్రశ్నించింది. పరిహారం చెల్లింపు అధికారం ఎక్కడ ఉందని నిలదీసింది. రూ.10 లక్షల పరిహారం చెల్లించాలంటూ హెచ్‌ఆర్‌సీ ఇచ్చిన ఆదేశాలను నిలుపుదల చేసి.. కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో 'స్పోకెన్ ఇంగ్లిష్' క్లాసులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడేలా విద్యాశాఖ మరో ముందడుగు వేసింది. 26 జిల్లాల్లో తొలి దశలో భాగంగా జిల్లాకు 5 హైస్కూళ్లను ఎంపిక చేసి ప్రత్యేక 'స్పోకెన్ ఇంగ్లిష్' తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించింది. దశల వారీగా అన్ని పాఠశాలల్లోనూ అమలు చేయనుంది. సాధారణ తరగతులతో పాటే ఆసక్తి కలిగిన విద్యార్థులకు 'స్పోకెన్ ఇంగ్లిష్' నేర్పిస్తారు.

బెండపూడి.. నిడమానూరులో సక్సెస్

తూర్పుగోదావరి జిల్లాలోని బెండపూడి, గన్నవరం సమీపంలోని నిడమానూరు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇచ్చిన స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణతో అద్భుత ఫలితాలొచ్చాయి. దీనిని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తొలుత ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి.. ఆ తర్వాత విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు బోధించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఆరోగ్యశ్రీకి అదనపు బలం

▶ మొదటి పేజీ తరువాయి

తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖపై నిర్వహించిన ఉన్నత సమీక్షలో ముఖ్యమంత్రి జగన్ పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ వైద్య కళాశాల ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీఎం సమీక్షలో ముఖ్యాంశాలు ఇవీ..

వైద్య కళాశాల కేంద్రంగా..

గ్రామ స్థాయిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ మొదలు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులు, అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్ఎస్‌లను ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోకి తేవాలి. వైద్య, పరిపాలన కార్యకలాపాలన్నీ వైద్య కళాశాల నుంచే నిర్వహించాలి. పకడ్బందీగా వైద్య సేవలు అందించడంతోపాటు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయానికే ఈ చర్యలన్నీ. దీనికి సంబంధించి ఎవరెవరు ఏం చేయాలి? విధులు, బాధ్యతలు ఏమిటి? అనే అంశాలపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) రూపొందించాలి. అన్ని జిల్లాల వైద్య కళాశాలల్లో మెడికల్ హబ్స్ ఏర్పాటు చేయాలి. వైద్య కళాశాల నేతృత్వంలోనే హబ్స్ పని చేయాలి. హబ్స్ నుంచి కింది స్థాయి ఆస్పత్రుల్లో చికిత్సలకు అవసరమైన సలహాలు, సూచనలు వైద్యులకు వెళ్లాలి. 6,956 టెలీ మెడిసిన్ స్పోక్స్, 27 హబ్స్ ఏర్పాటు కావాలి.



వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఇకపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్

ప్రతి విలేజ్ క్లినిక్‌లో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్), ఒక ఏఎన్ఎం, ఒకరు లేదా ఇద్దరు ఆశావర్కర్లు ఉంటారు. ఈ లెక్కన ప్రతి విలేజ్ క్లినిక్‌లో ముగ్గురు నుంచి నలుగురు సిబ్బంది సమకూరుతారు. విలేజ్ క్లినిక్‌లో 67 రకాల మందులు, 14 రకాల పరీక్షలు అందుబాటులో ఉంటాయి. ఎంఎల్‌హెచ్‌పీలను ఇకపై కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పిలవాలి.

18 ఏళ్లు నిండిన వారందరికీ ప్రికాషన్ టీకా

కరోనా వైరస్ వ్యాప్తి తగ్గినప్పటికీ నియంత్రణ చర్యల్లో అలసత్వం వహించొద్దు. ప్రికాషన్ డోసు టీకా పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. రెండు డోసులూ టీకా తీసుకుని అర్హులైన 18 ఏళ్లు పైబడిన వారికి ప్రికాషన్ టీకాలు ఇవ్వాలి.

మరో 432 ఎంఎంయూలు..

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలుకు అవసరమైన కసరత్తు పూర్తి చేస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు వివరించారు. కొత్త విధానాన్ని సంక్రాంతి వరకు ప్రయోగాత్మకంగా పరీక్షించనున్నట్లు చెప్పారు. మరోవైపు పీహెచ్‌సీలతో 104 మొబైల్ మెడికల్ యూనిట్ల మ్యాపింగ్ పూర్తైందని వెల్లడించారు. పీహెచ్‌సీలు, సచివాలయాల మ్యాపింగ్ కూడా పూర్తి చేస్తామన్నారు. 104 ఎంఎంయూలు ఇప్పటికే 656 పని చేస్తున్నాయని, మరో 432 వాహనాలను సమకూరుస్తున్నట్లు చెప్పారు. సమీక్షలో మంత్రి విడదల రజని, సీఎస్ సమీర్‌శర్మ, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ జె.నివాస్, ప్రత్యేక కార్యదర్శి జి.ఎస్.నవీన్‌కుమార్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎండీ మురళీధర్‌రెడ్డి, వైద్య విధానపరిషత్ కమిషనర్ డాక్టర్ వినోద్‌కుమార్, డ్రగ్ కంట్రోల్ డీజీ రవిశంకర్, ఆరోగ్యశ్రీ సీఈవో హరీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

> డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా మరో 754 ప్రొసీజర్లను పథకంలో చేరుస్తున్నాం. కొత్తగా చేర్చే వాటితో కలిపి మొత్తం 3,118 ప్రొసీజర్లకు పథకం ద్వారా ప్రజలకు ఉచితంగా వైద్యం అందుతుంది. సెప్టెంబరు 5వతేదీ నుంచి కొత్త ప్రొసీజర్లను అందుబాటులోకి తేవాలి.
> \- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

గంజి నాగప్రసాద్ కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం

- ఇప్పటివరకు ఏ రాజకీయ పార్టీ అందించని విధంగా చేయూత
- సీఎం జగన్‌ను ప్రశంసిస్తున్న బాధిత కుటుంబం



నాగప్రసాద్ కుటుంబానికి నగదు చెక్కును అందజేస్తున్న ఎంపీ మార్గాని, ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ఏ ఒక్క నాయకుడిని, అతడి కుటుంబాన్ని ఆ పార్టీ విడిచిపెట్టదని చెప్పడానికి గంజి నాగప్రసాద్ కుటుంబానికి అందించిన చేయూతే ఒక ఉదాహరణ. ఏలూరు జిల్లాలోని ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లిలో మూడునెలల కిందట వైఎస్సార్‌సీపీ నేత గంజి నాగప్రసాద్ హత్యకు గురైన విషయం తెలిసిందే. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆ ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఈ ఏడాది జూలై 3వ తేదీన కొవ్వూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్లీనరీలో నాగప్రసాద్ కుమారుడు ఉదయఫణికుమార్‌కు ఆయన రూ.15 లక్షల చెక్కు అందించారు. అలాగే మరో రూ.10 లక్షల చెక్కును మిథున్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 16న రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాగప్రసాద్ కుమారుడు ఉదయఫణికుమార్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ భరత్‌రామ్, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మిథున్‌రెడ్డి, రాజీవ్‌కృష్ణ, జీవీ, చెలికాని రాజబాబు, ప్రతాపనేని వాసు తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న వైఎస్సార్‌సీపీకి తాము రుణపడి ఉంటామని చెప్పారు.

బతుకులు మార్చే పథకాలు పప్పుబెల్లాలా?

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల అసలు ఉద్దేశాలను తెలుసుకోకుండా... వీటన్నిటినీ ఉచితాలంటూ విమర్శించటం తగదని స్పష్టంచేసింది. ఉచితాలను... సామాజిక-ఆర్థిక ప్రయోజనాలతో అమలు చేసే పథకాలను ఒకేగాటన కట్టి మాట్లాడటమంటే అది రాజ్యాంగ స్ఫూర్తిని అవమానించటమేనని స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో పార్టీ బుధవారంనాడు ఇంటర్వెన్షన్ పిటిషన్ దాఖలు చేసింది. ఉచిత పథకాల అమలుపై అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ వేసిన పిటిషన్లో జోక్యం చేసుకుంటూ... తన వాదనలు కూడా వినాలంటూ వైఎస్సార్ సీపీ తరఫున పార్టీ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి ఈ పిటిషన్ దాఖలు వేశారు. పథకాల ఉద్దేశాలు తెలుసుకోకుండానే వాటిని ఉచితాలనటాన్ని తప్పుబడుతూ... 'మనదేశం సంక్షేమ రాజ్యం కూడా. రాజ్యాంగ నిర్మాతలు నిర్దేశించిన సమానత్వ లక్ష్యాలను సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్రరాష్ట్రాల్లోని ప్రభుత్వాలపై ఉంది'' అని పేర్కొన్నారు. పిటిషన్లోని ముఖ్యాంశాలివీ...

అలాంటి పార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాలి...

'నిష్ప్రయోజనమైన, నిరర్థకమైన, ఓటర్లను మభ్యపెట్టేందుకు ఉద్దేశించిన పథకాలను ఉచితాలుగా అభివర్ణించడంలో ఎలాంటి తప్పులేదు. కానీ విస్తృత సామాజిక-ఆర్థిక ప్రాముఖ్యత కలిగిన, సమాజంలో నిస్పృహలను తొలగించేందుకు అమలు చేస్తున్న పథకాలకు ఉచితాలనే రంగు పులమడం రాజ్యాంగాన్ని అవమానించడమే. కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయ లబ్ధిని పొందేందుకు పథకాలను అమలు చేస్తున్న మాట వాస్తవం. అధికారంలో ఉన్న పార్టీలు ఎన్నికల్లో ఓటర్లు తమకు అనుకూలంగా ఓట్లు వేసేందుకు వీలుగా ఎన్నికల ముందు హడావుడిగా ఆయా పథకాలను అమలు చేసిన ఘటనలు గతంలో చాలానే ఉన్నాయి. ఓటర్లను ఏమార్చడమే ఆ రాజకీయ పార్టీల ప్రధాన ఉద్దేశం. తద్వారా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అలాంటి రాజకీయ పార్టీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అలా చేస్తే పార్టీలు బాధ్యతారహితంగా వ్యవహరించకుండా అడ్డుకోవడానికి ఆస్కారం ఉంటుంది.

అలాంటి వాటిని కూడా ఉచితాలంటారా?

'మరోవైపు అందరితోనూ చర్చించి, చాలా స్పష్టతతో, పథకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని, ఎన్నికలకు ముందే తమ చిత్తశుద్ధిని ఓటర్లకు తెలియచేసి మరీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న పార్టీలు కూడా ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పథకాలను పలు అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ అంతే చిత్తశుద్ధితో వాటిని ఆ పార్టీలు అమలు చేస్తున్నాయి. ఇలాంటి సంక్షేమ పథకాలను ఉచితాలుగా అభివర్ణించడం ఎంత మాత్రం సహేతుకం కాదు.'

ఆదాయాన్ని సమకూర్చని ఆస్తి కూడా ఆస్తేనా?

'మూలధన వ్యయం కోసం అప్పు చేయడం సమర్థనీయమని, రెవిన్యూ వ్యయం కోసం అప్పు చేయడం వినాశనకరమనే విస్తృతమైన అభిప్రాయం ఒకటి అందరిలోనూ బలంగా ఉంది. ఇది అన్ని సందర్భాల్లోనూ కరెక్టేనా అనేది లోతుగా తరచి చూడాలి. నగదు ఆధారిత ప్రభుత్వ గణాంక వ్యవస్థలో శాశ్వత ప్రాతిపదికన కంటికి కనిపించే ఆస్తిని కూడబెట్టడాన్ని మూలధన వ్యయం అంటున్నాం. ప్రస్తుతం ఉన్న ఆస్తుల వినియోగం పెంచడాన్ని కూడా దీనికిందికే తీసుకొస్తున్నాం. ఈ మూలధన వ్యయం కోసం కంటికి కనిపించే ఆస్తులను సృష్టించడం తప్పని సరి. అయితే విశ్వవ్యాప్త గణాంక సూత్రాల ప్రకారం, ఓ సంస్థకు ఆదాయాన్ని సమకూర్చని ఆస్తిని ఆ సంస్థ ఆస్తిగా ఎంత మాత్రం గుర్తించడానికి వీల్లేదు. భవిష్యత్తు ఆర్థిక ప్రయోజనాల నిమిత్తం ఖర్చుచేసే సామర్థ్యాన్ని కలిగి ఉండటమే ఇక్కడ ప్రధానం.'







విభజన వల్ల రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయింది...

'ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల విషయానికొస్తే, 2014లో రాష్ట్ర విభజన జరిగింది. దీని వల్ల రాష్ట్రం ఆర్థికంగా ఎంతో నష్టపోయింది. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ జనాభా 58 శాతం ఉన్నప్పటికీ, 45 శాతం రెవిన్యూ మాత్రమే కలిగి ఉంది. అంతే కాక 2014–19 కాలంలో అప్పటి ప్రభుత్వ అసమర్థ విధానాల వల్ల విద్య, ఆరోగ్యం, వ్యవసాయం వంటి కీలక రంగాల్లో పురోగతి కుంటుపడింది. నాబార్డ్ ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజివ్ సర్వే 2016–17 ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయ కుటుంబాల రుణభారం అత్యధికంగా ఉంది. ఈ రుణభారం రాష్ట్రంలో 76 శాతం. అదే జాతీయ సగటు చూసుకుంటే కేవలం 47 శాతం. ఇక విద్య విషయానికొస్తే, రాష్ట్రంలో ప్రాథమిక విద్య గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) అతి తక్కువగా 84.48 శాతం ఉంది. జాతీయ సగటు 99 శాతం. స్మాల్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ) అప్పుల విషయానికొస్తే, 1,85,925 ఖాతాలు (23 శాతం ఎస్‌హెచ్‌జీ ఖాతాలు) గడువు దాటినవిగా మారితే, 84,056 ఖాతాలు (11శాతం ఎస్‌హెచ్‌జీ ఖాతాలు) నిరర్థకంగా మారాయి.'

నాడు-నేడుతో సమూల మార్పులు..

'దీన్ని ఇప్పుడు మనబడి-నాడు నేడు పథకం కింద అమలు చేస్తున్నాం. రాష్ట్రంలో 56,555 పాఠశాలలను రూపాంతరీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మంచి మరుగుదొడ్లు, అందుబాటులో నీరు, నాణ్యమైన మంచి నీటి సదుపాయం, రంగులతో సహా పెద్ద, చిన్న రిపేర్లు చేయడం, ఫ్యాన్లు, లైట్లు, విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్, గ్రీన్ చాక్ బోర్డులు, ఇంగ్లిష్ ల్యాబ్, ప్రహరీ గోడ, వంటగది, అదనపు తరగతి వంటి 11 రకాల సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించాం. అవసరమైన చోట డిజిటల్ క్లాసు రూములు కూడా ఏర్పాటు చేశాం. ఈ పథకాన్ని ప్రస్తుతం మూడు దశల్లో అమలు చేస్తున్నాం. గోరుముద్ద పథకం కింద పిల్లల పౌష్టికాహారాన్ని దృష్టిలో పెట్టుకుని అత్యంత నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నాం. పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు బైజూస్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాం. ఈ విద్యా సంవత్సరంలో 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లను సైతం పంపిణీ చేయనున్నాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు సీబీఎస్ఈతో కలిసి పనిచేస్తున్నాం. అంతర్జాతీయ పోటీని తట్టుకునే దిశగా ప్రాథమిక దశలోనే గట్టి పట్టు సాధించేందుకు ఆంగ్ల మాధ్యమం ఆవశ్యకతను గుర్తించాం. భవిష్యత్తు సవాళ్లకు పిల్లలను సిద్ధం చేసేందుకు అందరికీ ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్నాం.

ఇదే సమయంలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచడాన్ని ఎంత మాత్రం విస్మరించడం లేదు.'

ఆ బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది...

'వీటన్నింటినీ ఎదుర్కోవడానికి ప్రభావవంతమైన పథకాలను అమలు చేయాల్సిన బాధ్యత మా కొత్త ప్రభుత్వంపై పడింది. గత ప్రభుత్వ పనితీరు వల్ల నిస్పృహలో కూరుకుపోయిన ప్రజలు మాపై ఎంతో నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూపించి గెలిపించారు. ఉదాహరణకు, విద్యా రంగంలో సరఫరా వైపు, డిమాండ్ వైపు ఉన్న అడ్డంకులను, సమస్యలను తొలగించేందుకు సమగ్ర పరిష్కారం చూపాలన్న నిశ్చితాభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అన్నది ఇప్పుడు సరఫరా వైపు ఉన్న అడ్డంకులను తొలగించేందుకు అత్యవసరం.'

స్వయం సహాయ బృందాల బలోపేతానికి చర్యలు...

'స్వయం సహాయ బృందాలను బలోపేతం చేశాం. వీటిలో నెలకొని ఉన్న నిరాశా, నిస్పృహలను తొలగించేందుకు చర్యలు చేపట్టాం. ఇచ్చిన హామీని గత ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం వల్ల ఈ స్వయం సహాయ బృందాల రుణ క్రమశిక్షణ దారుణంగా దెబ్బతింది. ఈ పరిస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నాలుగు వాయిదాల్లో నిధులను ఈ బృందాలకు అందిస్తున్నాం. ఆదాయ మార్గాలను పెంచేందుకు ఈ బృందాలకు పలు పెట్టుబడి అవకాశాలను చూపుతున్నాం. ఈ చర్యల వల్ల కరోనా వంటి విపత్కర పరిస్థితులను ఈ స్వయం సహాయ బృందాలు తట్టుకుని సమర్థవంతంగా నిలబడ్డాయి. దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, రైతు భరోసా తదితర పథకాలను ఉచితాలుగా అభివర్ణిస్తున్నారు. ఈ పథకాల అవసరం, వాటి ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే వాటిని ఉచితాలుగా పేర్కొంటుండటం తీవ్ర అభ్యంతరకరం.'

ప్రజల ప్రాణాలను కాపాడేందుకు భారీ ఖర్చు చేయాల్సి వచ్చింది...

'పొరుగుదేశమైన శ్రీలంక, ఇతర దేశాలు ఆర్థికంగా కుప్పకూలిన పరిస్థితుల్లో, ఇప్పుడు ఆర్థిక స్థిరత్వానికి చైతన్యం పెరిగింది. రుణభార ఒత్తిడిని తగ్గించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. గత రెండు సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా అప్పు అన్నది పెద్ద భారంగా మారింది. కోవిడ్ వల్ల ఎన్నడూ ఎదురుకాని భయానక పరిస్థితులల వల్ల అన్నీ రంగాలు మూతపడటంతో తీవ్రమైన ఆర్థిక ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఆదాయాలు గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రజల కోసం ఖర్చు పెంచాల్సిన అవసరం వచ్చింది. ఈ ఖర్చు ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అత్యావశ్యకం. 2020–21లో కేంద్ర ప్రభుత్వ అప్పు ఆందోళనకర స్థాయిలో పెరిగింది. అయితే ఇందుకు సంబంధించిన ఖర్చు ప్రజల జీవితాలను, ఆర్థిక వ్యవస్థను కాపాడింది. ఆర్థికపరమైన క్రమశిక్షణ వల్ల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)తో పోలిస్తే ఆ తదుపరి సంవత్సరం కేంద్ర ప్రభుత్వ అప్పు గణనీయంగా తగ్గింది.'

కేంద్రం తీరు వల్ల రాష్ట్రాల పరిస్థితి అలా మారింది...

'ఇక రాష్ట్ర ప్రభుత్వాల విషయానికొస్తే వాటి ఆర్థిక పరిస్థితి కూడా ఒత్తిడిలోనే ఉంది. ఆర్థికపరమైన అడ్డంకులు ఎదురవుతున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద మొత్తంలో ప్రజల కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. అంతేకాక సెస్సుల్లో, స్థూల పన్ను ఆదాయాల్లో వాటాలు పెంచడటం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాలు తగ్గించేయడం వంటి కేంద్ర ప్రభుత్వ చర్యలు కూడా రాష్ట్రాల పరిస్థితిని అధ్వాన్నంగా మార్చాయి.'

జీడీపీలో కేంద్ర ప్రభుత్వ రుణాలు (రూ.కోట్లలో)

ఆర్థిక ఏడాది	ఆర్థిక ఏడాది చివరి నాటికి చెల్లించాల్సినవి	జీడీపీ (నామినల్)	జీడీపీలో రుణాల శాతం
2013-14	56,69,128.48	1,12,33,521.61	50.47
2014-15	62,42,220.92	1,24,67,959.29	50.07
2015-16	69,01,671.27	1,37,71,873.88	50.11
2016-17	74,35,761.31	1,53,91,669.01	48.31
2017-18	82,34,877.19	1,70,90,042.36	48.19
2018-19	90,83,215.03	1,88,99,668.44	48.06
2019-20	1,02,19,067.32	2,00,74,855.79	50.90
2020-21	1,20,79,018.19	1,98,00,913.82	61.00
2021-22	1,35,88,193.16	2,36,64,636.99	57.42

సోర్స్: బడ్జెట్ డాక్యుమెంట్స్, కేంద్ర గణాంకాలు - అమలు మంత్రిత్వ శాఖ

రాష్ట్రాలకు పంపిణీ (రూ.కోట్లలో)

ఆర్థిక ఏడాది	గ్రాస్ ట్యాక్స్ రెవెన్యూ	రాష్ట్రాలకు పంపిణీ	రాష్ట్రాలకు పంపిణీ శాతం	ఏపీ వాటా	దేశ జీటీఆర్‌లో ఏపీ వాటా శాతం
2015-16	14,49,958.11	5,06,192.96	34.91	21,791.61	1.50
2016-17	16,96,792.94	6,08,000.31	35.83	26,174.41	1.54
2017-18	19,42,459.15	6,73,005.29	34.65	28,972.88	1.49
2018-19	20,78,665.31	7,61,454.19	36.63	32,780.60	1.58
2019-20	20,10,059	6,50,678	32.37	28,011.69	1.39
2020-21	20,27,104	5,94,996.76	29.35	24,460.91	1.21
2021-22	27,08,291	8,81,779	32.56	35,685.60	1.32

ఆర్థిక లోటు తక్కువగానే ఉంది...

'పై టేబుల్‌ను పరిశీలిస్తే కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా ఎంత ఉందో అర్థమవుతోంది. 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాల వాటాను 41 శాతం సిఫారసు చేస్తే కేంద్రం కేవలం 29.35 శాతంగా నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విషయానికొస్తే, రాష్ట్రంపై రుణభారాన్ని తగ్గించాలన్న స్ఫూహతోనే ఉన్నాం. 2022 ఆర్థిక సంవత్సరంలో రుణ పరిస్థితి ఆశాజనకంగానే ఉంది. 2021–22 కాగ్ లెక్కల ప్రకారం రాష్ట్ర ఆదాయ లోటు రూ.8370.51 కోట్లు ఉండగా, ఆర్థిక లోటు రూ.25,194 కోట్లుగా ఉంది. దీన్ని జీఎస్‌డీపీ నిష్పత్తిలో పోలిస్తే ఆర్థిక లోటు 2.10 శాతం కన్నా తక్కువగా ఉంది. వాస్తవానికి 2021–22 సంవత్సరానికి 15 వ ఆర్థిక సంఘం ఆర్థిక లోటును 4.5 శాతం గా సిఫారసు చేసింది.'

ఎన్ని అడ్డంకులు ఎదురైనా పథకాలను అమలు చేయాలి

'సామాజిక-ఆర్థిక ప్రగతిలో ప్రభుత్వాలు, అవి అమలు చేసే పథకాలన్నవి కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కూడా ప్రజల పట్ల ఎన్నికైన ప్రభుత్వాలు తమ బాధ్యతను నెరవేర్చాల్సి ఉంటుంది. ప్రజల అంచెంచల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు వారికే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అందుకే వారి అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలను తీసుకొచ్చి, వాటిని సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుంది.' అని సాయిరెడ్డి తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ద్రవ్యలోటు (రూ.కోట్లలో..)

ఆర్థిక ఏడాది	ద్రవ్యలోటు	జీఎస్‌డీపీ	జీఎస్‌డీపీలో ద్రవ్యలోటు శాతం
2014-15	20,745	5,24,975.64	3.95
2015-16	22,059	6,04,228.62	3.65
2016-17	30,908	6,84,415.87	4.52
2017-18	32,380	7,86,135.42	4.12
2018-19	35,467	8,73,721.11	4.06
2019-20	39,687	9,66,099.05	4.11
2020-21	55,168	10,14,373.79	5.44
2021-22	25,194.62	12,01,735.52	2.10

సోర్స్: కాగ్, కేంద్ర గణాంకాలు - కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ

పేదరికం అడ్డుపడకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి...

'అలాగే విద్యార్థుల చదువులకు తల్లిదండ్రుల పేదరికం అడ్డుకాకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న అమ్మ ఒడి పేరుతో పేరుతో ఓ వినూత్న పథకాన్ని తీసుకొచ్చింది. తమ పిల్లలను పాఠశాలకు పంపే ప్రతి తల్లి ఖాతాలో ఏడాదికి రూ.15వేలను జమ చేస్తున్నాం. ఇందుకు విద్యార్థుల కనీస హాజరు 75 శాతంగా నిర్ణయించాం. ఈ అమ్మ ఒడి పథకం విజయవంతం కావడమన్నది బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఎంతో దోహదపడుతుంది. పైన చెప్పిన రాష్ట్ర ప్రభుత్వ చర్యలన్నింటి వల్ల విద్యా రంగంలో గణనీయమైన పురోగతి సాధించాం. ప్రభుత్వ పాఠశాలల్లో 1–9 తరగతుల్లో చేరే విద్యార్థుల సంఖ్య 37.20 లక్షల నుంచి 44.30 లక్షలకు పెరిగింది. పాఠశాల విద్య మాత్రమే కాక, ఉన్నత విద్యలో ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలను అమలు చేస్తున్నాం. వీటన్నింటి అమలు వల్ల మొత్తం విద్యా రంగంలో గణనీయమైన మార్పు సాధించాం.'

రైతుల కోసం రైతు భరోసా...

'వ్యవసాయ రంగం విషయానికొస్తే, రాష్ట్రంలో 60 శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నాబార్డ్ నివేదిక ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో దుర్భర పేదరికం, రుణభారంతో రైతులు అల్లాడుతున్నారు. రైతుల బాధ తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. వ్యవసాయ పెట్టుబడి సాయం అందిస్తోంది. ఇందుకోసం వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని తీసుకొచ్చింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సాయం ఇది. వ్యవసాయ పంట రుణాలపై వడ్డీని మాఫీ చేసేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకాన్ని తీసుకొచ్చాం. రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాం.'

క్లుప్తంగా

కోర్టుల భవనాన్ని సందర్శించిన హైకోర్టు సీజే



విజయవాడ లీగల్: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ సివిల్ కోర్టుల ప్రాంగణంలో నూతనంగా నిర్మితమైన కోర్టుల భవన సముదాయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా బుధవారం సందర్శించారు. ఈ నెల 20వ తేదీ కోర్టుల భవనం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి సీజేఐతో పాటు హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు రానున్నారు. న్యాయస్థాన భవన సముదాయం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు లేకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, డీసీపీ విశాల్‌గున్ని తదితర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సి.ప్రవీణ్ కుమార్, జస్టిస్ శ్యాంసుందర్, కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక, పూర్తి అదనపు నగర మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్ గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గెలిపించండి

ఉద్యోగ సంఘాల మద్దతు కోరిన వెన్నపూస



బండి శ్రీనివాస్, కేవీ శివారెడ్డిలకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న రవీంద్రా రెడ్డి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి ఉద్యోగ సంఘాల నేతలను కలిశారు. విజయవాడలో బుధవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కార్‌లను కలిసి మద్దతు కోరారు.

గోదావరిలో కొనసాగుతున్న వరద ఉద్ధృతి

జలదిగ్బంధంలో గ్రామాలు

- ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగింపు
- కాటన్ బ్యారేజి నుంచి 15,12,848 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- కృష్ణాలో తగ్గుతున్న వరద
- ప్రకాశం బ్యారేజి నుంచి 3,17,250 క్యూసెక్కులు కడలిలోకి..



సాక్షి, అమరావతి/చింతూరు/కూనవరం/పోలవరం రూరల్/ధవళేశ్వరం/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురిసౌత్/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీవర్షాలతో గోదావరిలో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. బుధవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజి నుంచి 15,12,848 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతోంది. బుధవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక, ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నాయి. మరోపక్క కృష్ణానదిలో వరద తగ్గుముఖం పడుతోంది. బుధవారం రాత్రి ఏడుగంటలకు ప్రకాశం బ్యారేజి నుంచి 3,17,250 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. గోదావరి, శబరి నదుల్లో వరద ఉద్ధృతి పెరగడంతో విలీన మండలాల్లోని పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టినా విలీన మండలాల్లోకి నీరు చేరుతోంది. బుధవారం ఉదయం భద్రాచలం వద్ద 54.6 అడుగులున్న గోదావరి నీటిమట్టం రాత్రి ఏడు గంటలకు 54.4 అడుగులకు తగ్గింది. ఎటపాక, కూనవరం, వీఆర్‌పురం, చింతూరు మండలాల్లో బుధవారం రాత్రి వరకు వరద పెరుగుతూనే ఉంది. ఎటపాక మండలంలో ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరడంతో భద్రాచలంతో పాటు ఇతర మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలంలో కూనవరం, టేకులబోరు, శబరి కొత్తగూడెం, చినార్కూరు, కొండ్రాజుపేట, పూసుగూడెం, ముల్లూరు, తాళ్లగూడెం గ్రామాల్లోకి నీరు చేరింది. వీఆర్‌పురం మండలంలో పలు గ్రామాల్లోకి వరదనీరు చేరడంతో ప్రజలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళుతున్నారు. గోదావరి ఎగపోటు కారణంగా శబరినది కూడా క్రమేపీ పెరుగుతోంది. చింతూరు వంతెన వద్ద శబరినది బుధవారం రాత్రి 45 అడుగులకు చేరుకుంది. దీంతో వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశిస్తోంది. చింతూరులోని శబరిఒడ్డు, సంతపాకలు, టోల్‌గేట్, లారీ ఆఫీస్, పంచాయతీ రహదారి, వీఆర్‌పురం రహదారి ప్రాంతాలతో పాటు ఏజీకొడేరులో ఇళ్లల్లోకి వరదనీరు రావడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద నీటిమట్టం 34.200 మీటర్లకు చేరింది. స్పిల్‌వే 48 గేట్ల నుంచి 12,36,429 క్యూసెక్కుల వరద నీరు కిందికి వెళుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో కాటన్ బ్యారేజి వద్ద బుధవారం రాత్రి ఏడుగంటలకు నీటిమట్టం 15.20 అడుగులకు చేరింది. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు 11 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజి నుంచి 15,12,848 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

శ్రీశైలం గేట్ల నుంచి 2,75,700 క్యూసెక్కుల విడుదల

కృష్ణానదిపై ఆల్మట్టి జలాశయంలోకి 2.15 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 1.32 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌లోకి 1.25 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా 1.28 లక్షల క్యూసెక్కులు, జూరాలకు 2.47 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 2.46 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల నుంచి శ్రీశైలం జలాశయానికి 2,96,431 క్యూసెక్కుల వరద వస్తోంది. రిజర్వాయర్ 10 రేడియల్ క్రస్ట్ గేట్లను 15 అడుగులు ఎత్తి నీరు విడుదల చేస్తున్న అధికారులు గేట్లను బుధవారం ఉదయం ఆరుగంటలకు 12 అడుగులకు, మధ్యాహ్నం 12 గంటలకు 10 అడుగులకు దించారు. జలాశయం గేట్ల నుంచి 2,75,700 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్‌కు విడుదల అవుతోంది. రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన చేస్తూ 62,570 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 209.5948 టీఎంసీల నీరు ఉంది. నీటిమట్టం 883.90 అడుగులకు చేరుకుంది. తుంగభద్రకు 51 వేల క్యూసెక్కులు వస్తుండగా అంతే మొత్తంలో విడుదల చేస్తున్నారు. మొత్తం సాగర్ జలాశయానికి 3,39,214 క్యూసెక్కుల నీరు చేరుతోంది. సాగర్ ఆరుగేట్లను ఐదడుగులు, 18 గేట్లను పదడుగులు ఎత్తి 2,98,596 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదనతో 32,927 క్యూసెక్కులు నదిలోకి వదులుతున్నారు. నాగార్జునసాగర్ నీటిమట్టం 585.30 అడుగులు ఉంది. జలాశయంలో 298.3005 టీఎంసీల నీరు ఉంది. పులిచింతలలోకి 3.56 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అంతే మొత్తంలో విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి బుధవారం రాత్రి ఏడు గంటలకు 3,32,636 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. కృష్ణాడెల్టా కాలువలకు 15,386 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజి 30 గేట్లను ఎనిమిదడుగులు, 40 గేట్లను ఏడడుగులు ఎత్తి 3,17,250 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

వరద నీటిలో మునిగి రైతు మృతి

కూనవరం మండలం కరకగూడెంలో కరక జోగయ్య(48) ప్రమాదవశాత్తు గోదావరిలో మునిగి మృతిచెందాడు. తన దుక్కిటెద్దులు కనిపించకపోవడంతో వెదుక్కుంటూ వెళ్లిన ఆయన తిరిగివచ్చే సమయంలో కొండాయిగూడెం-కరకాయిగూడెం మధ్యలో కాజ్‌వేపైన గోదావరి వరద నీటిని దాటుతూ మునిగిపోయాడు.

ప్రకృతి సాగు విస్తరణకు సలహా మండలి

- ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌కు కమిటీలో చోటు

సాక్షి, అమరావతి: ఏపీలో ఉద్యమంలా సాగుతోన్న ప్రకృతి సాగును స్ఫూర్తిగా తీసుకొని జాతీయ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే సంకల్పంతో కేంద్రం జాతీయ సలహా మండలిని ఏర్పాటు చేసింది. ఇందులో ఏపీ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్‌కు స్థానం కల్పించింది. దేశవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలన్న లక్ష్యంతో 14 మంది సభ్యులతో కేంద్రం ఈ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నీతి ఆయోగ్, మేనేజ్, ఎన్ఆర్ఎల్ఎం, ఐకార్ వంటి జాతీయ సంస్థలకు చెందిన ప్రతినిధులు ఉన్నారు. వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖలో ప్రకృతి వ్యవసాయాన్ని పర్యవేక్షిస్తోన్న డైరెక్టర్ స్థాయి అధికారి ఈ కమిటీకి మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. రెండేళ్ల కాల పరిమితితో ఈ కమిటీ కొనసాగనుంది. తొలుత గంగాబేసిన్ పరిధిలో 5 కి.మీ పరిధిలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను ఈ కమిటీ అందించనుంది. ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించే కార్యాచరణలో భాగంగా పలు రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు, ఏజెన్సీలతో కలిసి ఈ కమిటీ పనిచేస్తుంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్రసింగ్‌తోమర్ నాయకత్వంలో పనిచేస్తోన్న స్టీరింగ్ కమిటీకి సలహాలు, సూచనలు అందించనుంది.

అక్కడ విద్యుత్ ఆపకపోతేనే ప్రమాదం

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు



సాక్షి, అమరావతి: గోదావరి నీటిమట్టం 55 అడుగులకు చేరి విద్యుత్ లైన్లు వరద నీటిలో మునిగిపోయినప్పుడు కరెంటు సరఫరా ఆపకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు చెప్పారు. ప్రజల రక్షణ కోసమే రెండు, మూడురోజులుగా విద్యుత్ సరఫరా నిలిపేయాల్సి వచ్చిందిగానీ.. పది రోజులుగా నిలిపేయలేదని స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరా లేక ఎటపాక మండలం మురుమూరు గ్రామస్తులు ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో నిరసన తెలిపారంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో 'చిమ్మచీకట్లలో.. వరదనీటిలో..', 'కొవ్వొత్తులతో నిరసన' అనే శీర్షికలతో బుధవారం ప్రచురితమైన వార్తల వెనుక వాస్తవాలను ఆయన 'సాక్షి'కి వివరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..

ముంపు ప్రాంతాల్లో పొడవు స్తంభాలు

మురుమూరుకు నెల్లిపాక 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నుంచి తోటపల్లి ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. గోదావరి నీటిమట్టం 55 అడుగులకు చేరడంతో మురుమూరు గ్రామానికి వచ్చే విద్యుత్ లైను నీటిలో మునిగిపోయింది. దీంతో భద్రతా కారణాల దృష్ట్యా విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు తోటపల్లి ఫీడర్ నందిగాం వద్ద మురుమూరుకు ఆగస్టు 16న మధ్యాహ్నం 3 గంటలకు విద్యుత్ సరఫరాను ఆపాల్సి వచ్చింది. గోదావరి నీటిమట్టం 50 అడుగులకు తగ్గిన వెంటనే సరఫరా పునరుద్ధరించేందుకు ఏపీఈపీడీసీఎల్ సిద్ధంగా ఉంది. గ్రామస్తుల కోరిక మేరకు పొడవైన స్తంభాలు ఏర్పాటు చేయాలని కూడా భావిస్తోంది.

సీఎం ఆదేశాలతో పూర్తయిన సబ్‌స్టేషన్

గతంలో 132/33 కేవీ ఎటపాక విద్యుత్ ఉపకేంద్రం నుంచి సుమారు 130 కిలోమీటర్ల పొడవున 33 కేవీ లైన్ ద్వారా ఐదు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలతో చింతూరు, ఎటపాక, వరరామచంద్రపురం, కూనవరం ముంపు మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరిగేది. గత నెలలో గోదావరి వరదల్లో 33 కేవీ, 11 కేవీ లైన్లు మునిగిపోవడంతో సుమారు 35 వేల సర్వీసులకు విద్యుత్ నిలిచిపోయింది. ఆ సమయంలో సీఎం జగన్ వరద ప్రాంతాల్లో పర్యటించారు. చింతూరులో నిర్మాణంలో ఉన్న 220/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేసి గోదావరి వరదల సమయంలో కూడా ముంపు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. చింతూరు విద్యుత్ ఉపకేంద్రం పనులను సీఎం ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన పూర్తిచేసి 1న ప్రారంభించారు. దీని ద్వారా 33/11 కేవీ చింతూరు, కూనవరం, సరివెళ్ల, నెల్లిపాక విద్యుత్ ఉపకేంద్రాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నందున వరదనీరు 55 అడుగుల వరకు వచ్చినా అతికొద్ది సర్వీసుకే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఖరీఫ్ సీజన్‌లో 7600 పొలం బడులు

- సెప్టెంబర్‌లో 4255 యంత్ర సేవా కేంద్రాల ఏర్పాటు
- వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్

సాక్షి, అమరావతి: రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గించి ఆదాయం పెంచడమే లక్ష్యంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 7600 పొలం బడులు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరు హరికిరణ్ పేర్కొన్నారు. ఆయన బుధవారం జిల్లా వ్యవసాయాధికారులు, సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయంలో నూతన సాంకేతికతను రైతులకు అలవాటు చేసి వినూత్న సాగు పద్ధతులు పరిచయం చేయడమే ఈ కార్యక్రమం ధ్యేయమన్నారు. రాష్ట్రంలో ప్రాంతాల వారీగా, పంటల వారీగా రైతుకు అవసరమైన అన్ని రకాల ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మిగిలిన 4255 ఆర్బీకేల పరిధిలో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్‌ను సెప్టెంబర్‌లోగా ఏర్పాటు చేయాలని సూచించారు. మండలానికి మూడు చొప్పున రాష్ట్రంలో రెండు వేల కిసాన్ డ్రోన్‌ల ఏర్పాటుకు గ్రామాలను ఎంపిక చేశామని, ఆయా గ్రామాల్లో రైతులతో గ్రూపులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రూపుల్లో కనీసం ఒకరు 10వ తరగతి లేదా ఇంటర్ విద్యార్హత ఉండేలా చూసుకోవాలన్నారు. ఆగస్టు నెలాఖరులోగా గ్రూపులను ఎంపిక పూర్తి చేస్తే వారికి డాక్టర్ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ద్వారా సెప్టెంబర్‌లో డ్రోన్ పైలెట్ శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు.

హైకోర్టులో పన్నీర్‌కు ఊరట

సాక్షి ప్రతినిధి, చెన్నై: అన్నాడీఎంకే బహిష్కృత నేత పన్నీర్ సెల్వంకు మద్రాసు హైకోర్టులో ఊరట లభించింది. జూలై 11వ తేదీన సమన్వయ కమిటీ కన్వీనర్ పన్నీర్ సెల్వం ప్రమేయం లేకుండా ఉప కన్వీనర్ ఎడపాడి పళనిస్వామి నిర్వహించిన అన్నా డీఎంకే సర్వసభ్య సమావేశం చెల్లదని హైకోర్టు బుధవారం తీర్పునిచ్చింది. జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని మళ్లీ నిర్వహించాలని.. పార్టీలో జూన్ 23వ తేదీ నాటికి ఉన్న పరిస్థితులు యథాతథంగా కొనసాగించాలని పేర్కొంది.

వెయిట్ లాస్ ట్రీట్‌మెంట్‌తో లోకేష్‌కు మైండ్ లాస్

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ ధ్వజం
- రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిని చూసి ఓర్వలేక పోతున్నారు
- రూ. వెయ్యి కోట్ల పరిశ్రమల ప్రారంభానికి లోకేష్ తండ్రికి సమయం లేదట
- అన్ని పరిశ్రమలు వచ్చి ఉంటే ఆ జాబితా విడుదల చేయండి
- టీడీపీ హయాంలో పెట్టుబడులన్నీ నోటి మాటలే

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వస్తున్న పెట్టుబడులపై నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిపై వారి కడుపు మంట వారి మాటల్లోనే కనిపించిందని అన్నారు. రాష్ట్రానికి ఏ పరిశ్రమ వచ్చినా అది వారే తెచ్చినట్లు లోకేష్ చెబుతున్నారని, వెయ్యి కోట్లు పెట్టుబడులు పెట్టే సంస్థలను వందల సంఖ్యలో తెచ్చామంటున్నారని, వాళ్ల నాన్న చంద్రబాబుకు వాటికి శంకుస్థాపన చేసే సమయం కూడా లేదని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అదే నిజమైతే.. టీడీపీ హయాంలో వచ్చిన పరిశ్రమలు, పెట్టుబడుల జాబితా విడుదల చేయాలని సవాల్ చేశారు. చంద్రబాబు రోజా మతి తప్పి మాట్లాడుతుంటే.. లోకేష్ వెయిట్ లాస్ కోసం ట్రీట్‌మెంట్ తీసుకుని మైండ్ లాస్ చేసుకుని మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పరిశ్రమలు గ్రౌండ్ అయిన తర్వాతే వివరాలు చెప్పాలని సీఎం జగన్ చెప్పారన్నారు. టీడీపీ హయాంలో పెట్టుబడులన్నీ నోటి మాటలేనని, అనేక అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ఎవరెవరికో సూటు, బూటు తగిలించి ఎంవోయూలు చేసిన ఘనత చంద్రబాబు, లోకేష్‌దని అన్నారు. ఐటీ శాఖ మంత్రిగా లోకేష్ ఏ పరిశ్రమలు తెచ్చాడని నిలదీశారు. లోకేష్ చెప్పే కుంభకోణం మంగళవారం సామెతలా ఉందన్నారు.

పారిశ్రామిక విప్లవానికి మైలు రాయి

రాష్ట్రాన్ని సీఎం జగన్ పారిశ్రామికంగా పరుగులు తీయిస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా అచ్యుతాపురం సెజ్‌లో జపాన్‌కు చెందిన ప్రతిష్టాత్మక యొకహోమా గ్రూపునకు చెందిన ఏటీసీ కంపెనీ టైర్ల ఉత్పత్తి కేంద్రాన్ని సీఎం జగన్ ప్రారంభించారన్నారు. దాదాపు 100 ఎకరాల్లో రూ.1,500 కోట్లతో ఏర్పాటు చేసిన ప్లాంటులో తొలి యూనిట్ సిద్ధమైందని, దీని ద్వారా దాదాపు 2,000 మంది స్థానికులకు ఉపాధి కలుగుతుందని చెప్పారు. యొకహోమా రెండో యూనిట్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేశారని, మరో 8 పరిశ్రమలకు కూడా భూమి పూజ చేశారని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి ఇదొక మైలురాయి అని అభివర్ణించారు. విశాఖలో జపాన్ ప్రతినిధులు చెప్పింది విదేశాల్లో ఇంగ్లిష్ మీడియం చదివిన లోకేష్ బుర్రకు అర్థం కాలేదా అని ప్రశ్నించారు. తమ మాటలు ఎలానూ వీరి బుర్రలకు ఎక్కవని, కనీసం జపాన్ ప్రతినిధులు చెప్పింది వినాలన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు 2020 అక్టోబర్‌లో వచ్చామని, ప్రభుత్వం 2020 డిసెంబర్‌లో జీవో ఇచ్చిందని, 2021 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి, 2022 ఆగస్ట్‌లో తొలి దశ పూర్తి చేసినట్లు ఆ సంస్థ ప్రతినిధులు చెప్పారన్నారు. 30 నెలలు పట్టాల్సిన ఈ పనులను పునాది వేసిన 15 నెలల్లోనే పూర్తి చేసి, ఉత్పత్తి ప్రారంభించామని తెలిపారన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వం సహకారం, పెట్టుబడులకు ఉన్న మంచి వాతావరణం వల్లే సాధ్యమైందని చెప్పారన్నారు. ప్రపంచంలోనే టాప్ ఫైవ్ కంపెనీల్లో ఒకటైన ఆ సంస్థకు ఏపీ ప్రభుత్వం గురించో, సీఎం జగన్ గురించో గొప్పలు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. వారు వాస్తవాలే చెప్పారని అన్నారు.

జగన్ ప్రజల మేలు కోరతారు.. చంద్రబాబు చావు కోరే రకం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో సంక్షేమం, శ్రేయస్సు, అభివృద్ధి, సంతోషం అనే నాలుగు స్తంభాలపై పాలన సాగుతోందని మంత్రి చెప్పారు. ప్రభుత్వాలుగా కేంద్రం, రాష్ట్రాల మధ్య సంబంధాలే ఉంటాయి కానీ, మోదీ దగ్గరకు వెళ్లి చంద్రబాబు లాగా వేషాలు వేయడం చేతకాదని స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల మంచి కోరితే.. చంద్రబాబు చావు కోరే రకం అని తెలిపారు. బ్రాహ్మణితో తగవులు ఉంటే మీ ఇంట్లో పరిష్కరించుకోండి అని లోకేష్‌కి హితవు పలికారు. ఏనాడూ రాజకీయాల్లో జోక్యం చేసుకోని సీఎం జగన్ సతీమణి వైఎస్ భారతమ్మను రాజకీయాల్లోకి లాగి బ్రాహ్మణిని తిట్టించాలన్నదే లోకేష్ ఉద్దేశమా అని ప్రశ్నించారు. లోకేష్‌లా బీచ్, స్విమ్మింగ్ పూల్ చదువులు సీఎం జగన్ చదవలేదన్నారు. సీఎం ఏమి చదివారో అందరికీ తెలుసునన్నారు.

పవన్‌ది కమ్మ జనసేన

దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ నడుపుతున్న పార్టీ కాపు జనసేన కాదని, పక్కాగా కమ్మ జనసేన అని తెలిపారు. దానికి స్క్రిప్టు, ప్రొడక్షన్ బాబు అయితే నాదెండ్ల డైరెక్షన్‌లో నడుస్తున్న పార్టీ అని చెప్పారు. పూటకొకళ్ళతో సంసారం చేస్తూ ఆర్నెల్లకోసారి బయటకొచ్చే పవన్ గురించి మాట్లాడటం టైమ్ వేస్ట్ అని దుయ్యబట్టారు.

పెద్ద పారిశ్రామికవాడల్లో టెక్స్‌టైల్ పార్కులు

రాష్ట్రంలో టెక్స్‌టైల్ రంగం ప్రోత్సాహానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. 100 ఎకరాలకు పైబడి ఉన్న పెద్ద పారిశ్రామికవాడల్లో టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం అమరావతి సచివాలయంలో చేనేత, వస్త్ర పరిశ్రమ, ఆప్కో, లేపాక్షి, ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆప్కో ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం కల్పించేలా మార్కెటింగ్ కన్సల్టెంట్‌ను నియమించాలన్నారు. కొత్త జిల్లా కేంద్రాలు, డిమాండ్ ఉన్న చోట్ల లేపాక్షి షోరూంలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉపాధి హామీ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు.

చిచ్చుపెట్టే వారితో జాగ్రత్త

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ''కొందరు దేశాన్ని కులం, మతం పేరిట విడదీస్తున్నారు. అది మంచి పద్ధతి కాదు. సమాజంలో విద్వేషం పెచ్చరిల్లితే కోలుకోవడం చాలా కష్టం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి' అని సీఎం కె.చంద్రశేఖర్ రావు పేర్కొన్నారు. హైదరాబాద్ శివార్లలో తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలో నిర్మించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు.

అప్పు పథంలో ఐదు రాష్ట్రాలు

▶ మొదటి పేజీ తరువాయి

నివేదిక పేర్కొంది. 2019, 2020, 2021 ఆగస్టు నెలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయాలు, క్యాపిటల్ వ్యయం, బడ్జెట్ అంచనాలు, రెవెన్యూ రాబడులను ప్రపంచ బ్యాంకు విశ్లేషించింది. 2019-20లో ఆర్థిక మందగమనం కారణంగా అన్ని రాష్ట్రాలకు కేంద్రం నుంచి రావాల్సిన వాటా నిధులు తగ్గిపోయాయని నివేదిక పేర్కొంది.

పుంజుకున్న ఆదాయాలు..

ఆంధ్రప్రదేశ్ సహా మిగతా రాష్ట్రాలన్నింటిలో 2019 ఆగస్టుతో పోల్చితే 2020, 2021 ఆగస్టుల్లో రెవెన్యూ రాబడులు పెరిగాయని నివేదిక తెలిపింది. చాలా రాష్ట్రాల్లో క్యాపిటల్ వ్యయం పెరిగిందని, ఏపీలో 2019 ఆగస్టుతో పోల్చి చూస్తే 2020 ఆగస్టులో క్యాపిటల్ వ్యయం బాగా పెరిగిందని స్పష్టం చేసింది. రాష్ట్రంలో 2019 ఆగస్టుతో పోల్చితే 2021 ఆగస్టులో బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా రాబడులు మెరుగుపడ్డాయని, బడ్జెట్ అంచనాల మేరకు వ్యయం కూడా ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇకనైనా తప్పుడు సమాచారంతో రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చే యత్నాలకు ఇకనైనా స్వస్తి పలకాలని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

నివేదికలో ముఖ్యాంశాలు...

- దేశంలో అత్యధికంగా పంజాబ్ అప్పుల్లో ఉంది. జీఎస్‌డీపీలో ఏకంగా 49.5 శాతం అప్పులున్నాయి.
- రాజస్థాన్‌కు జీఎస్‌డీపీలో 39.5 శాతం మేర అప్పులుండగా హిమాచల్ ప్రదేశ్‌కు 39.7 శాతం, బిహార్‌కు 38.6 శాతం, కేరళకు 37 శాతం మేర అప్పులున్నాయి.
- ఆంధ్రప్రదేశ్‌కు జీఎస్‌డీపీలో 32.5 శాతం మాత్రమే అప్పులున్నాయి.
- సొంత రాబడుల్లో పంజాబ్ వడ్డీ చెల్లింపులపై అత్యధికంగా ఖర్చు చేస్తోంది.
- బిహార్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కేరళ, హర్యానా రాష్ట్రాలు వచ్చే ఐదేళ్లలో చెల్లించాల్సిన అప్పుల వాటా అత్యధికంగా ఉంది. ఛత్తీస్‌గఢ్ వచ్చే ఐదేళ్లలో 59.2 శాతం, ఒడిశా 54.7 శాతం, హర్యానా 48.7 శాతం మేర అప్పులు చెల్లించాల్సి ఉంది.

వివిధ రాష్ట్రాల అప్పులు, వడ్డీల చెల్లింపు వివరాలు


రాష్ట్రం	జీఎస్‌డీపీలో అప్పు	రాబడుల్లో వడ్డీ చెల్లింపు	సొంత రాబడిలో వడ్డీ చెల్లింపు	ఐదేళ్లలో తీర్చాల్సిన అప్పు (శాతం)
పంజాబ్	49.5	20.9	50.3	33.4
హిమాచల్ ప్రదేశ్	39.7	14.0	49.2	39.4
రాజస్థాన్	39.5	13.4	34.1	44.8
బిహార్	38.6	8.3	41.4	59.0
కేరళ	37.0	19.3	37.6	48.9
పశ్చిమబెంగాల్	34.4	19.7	49.5	35.7
ఆంధ్రప్రదేశ్	32.5	14.2	29.9	40.2

కేంద్రం అప్పులు రూ.కోట్లలో

సంవత్సరం	అప్పులు	జీడీపీలో అప్పుల శాతం
2019 - 20	1,02,19,067.32	50.90
2020 - 21	1,20,79,018.19	61.00
2021 - 22	1,35,88,193.16	57.42

కేంద్రం అప్పులే ఎక్కువ

కేంద్ర ప్రభుత్వ అప్పులు 2020-21లో ఏకంగా జీడీపీలో 61 శాతానికి చేరుకోవడం గమనార్హం. 2013- 14లో కేంద్రం అప్పులు రూ.56,69,128.48 కోట్లు కాగా 2021-22 నాటికి రూ.1,35,88,193.16 కోట్లకు పెరిగాయి.



మానవ జ్ఞానం ఎంత అల్పమయిందో రుజువు చెయ్యటానికి మాత్రమే శాస్త్రవిజ్ఞానం తోడ్పడింది.
– మసనోబు ఫుకుఓకా

సాక్షి
గురువారం, ఆగస్టు, 18

సిగ్గుచేటు నిర్ణయం

ప్రభుత్వానికి ఉన్న విచక్షణాధికారాలు చట్టబద్ధమైనవే కావచ్చు. కానీ, రాజకీయ కారణాలతో వాటిని విచక్షణా రహితంగా వాడితే? ఇరవై ఏళ్ళ క్రితం గుజరాత్ మారణకాండ వేళ దేశాన్ని కుదిపేసిన బిల్కిస్ బానో కేసులో ఆ రాష్ట్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇప్పుడదే జరిగింది. స్వాతంత్ర్య దినోత్సవ వేళ ఎర్రకోటపై నుంచి ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, 'నారీశక్తి' గురించి గొప్పగా చెప్పారు. 'మహిళల్ని తక్కువగా చూసి, బాధించే మన ప్రవర్తననూ, సంస్కృతినీ, రోజువారీ జీవనవిధానాన్నీ మార్చుకోలేమా' అని అడిగారు. కానీ, సరిగ్గా అదే రోజున సాక్షాత్తూ ప్రధాని మాటల స్ఫూర్తికి పూర్తి విరుద్ధంగా ఆయన స్వరాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరించడం దిగ్భ్రాంతికరం. బిల్కిస్ బానో గ్యాంగ్ రేప్ కేసులో యావజ్జీవ కారాగార వాసం అనుభవించాల్సిన 11 మంది దోషులకు శిక్ష తగ్గించి, విడుదల చేయడం శోచనీయం.

మతఘర్షణల్లో మూడేళ్ళ పసికందు తలను బండకేసి కొట్టి, మరో 13 మంది ముస్లిమ్‌లను చిత్రహింసలు పెట్టి క్రూరంగా చంపి, 5 గ్యాంగ్ రేపులు చేసిన 11 మంది దోషుల అమానుషత్వం ఇప్పటికీ దేశాన్ని నిద్రపోనివ్వని పీడకల. అయినా సరే ఈ ఏడాది చివరలో ఎన్నికలు జరగనున్న గుజరాత్‌లో పాలకులు ఇలా క్షమించి, వదిలేశారంటే – దాని వెనుక కారణాలు ఏమై ఉంటాయో ఊహించడం కష్టమేమీ కాదు. ఈ రాజకీయ నిర్ణయంతో దోషులకు శిక్ష మాటేమో కానీ, బాధితులకు జరగాల్సిన న్యాయం తగ్గిందనే భావన కలుగుతోంది. తక్షణమే ఉన్నత న్యాయస్థానం జోక్యం చేసుకోకుంటే, ఇది ఒక పూర్వోదాహరణగా మారే ప్రమాదం ఉంది. పాలకుల చేతిలోని శిక్షాకాలపు తగ్గింపు అధికారాలు ఎక్కడికక్కడ తరచూ దుర్వినియోగం కావచ్చనే భయమూ కలుగుతోంది.

2002 గుజరాత్ అల్లర్లలో రాష్ట్రం విడిచి పారిపోవడానికి ప్రయత్నించిన వందలాది గుజరాతీ ముస్లిమ్‌లలో బిల్కిస్ బానో ఒకరు. మార్చి 3న ఆమె తన మూడేళ్ళ పాపతో, 15 మంది కుటుంబ సభ్యులతో కలసి గ్రామం విడిచిపోతూ, పొలంలో తలదాచుకున్నారు. కత్తులు, కర్రలు, కొడవళ్ళు పట్టుకొని దాడికి దిగిన దుర్మార్గులు అయిదునెలల గర్భిణి అయిన 21 ఏళ్ళ బానోపై సామూహిక అత్యాచారం జరిపారు. ఆమె కళ్ళెదుటే ఆమె కుటుంబ సభ్యులు ఏడుగుర్ని దారుణంగా చంపారు. ఆమె తల్లినీ, సోదరినీ వదలకుండా హత్యాచారం చేశారు. కొనఊపిరితో మిగిలిన బానో కళ్ళు తెరిచాక, ఓ ఆదివాసీ మహిళ ఇచ్చిన వస్త్రాలతో బయటపడి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫలితం లేక మానవహక్కుల సంఘాన్ని ఆశ్రయించడంతో చివరకు సుప్రీమ్ కోర్ట్ జోక్యం చేసుకుంది. బానోకు ప్రాణహాని బెదిరింపుల మధ్య సరైన న్యాయవిచారణ కోసం కేసు గుజరాత్ నుంచి మహారాష్ట్రకు బదిలీ చేశారు. దోషులకు 2008లో సీబీఐ కోర్ట్ విధించిన శిక్షను 2017లో బొంబాయి హైకోర్ట్, ఆపైన సుప్రీమ్ సమర్థించాయి. తీరా ఇప్పుడు కనీసం 14 ఏళ్ళ జైలుశిక్ష పూర్తయిన ఖైదీలను విడుదల చేసే విచక్షణాధికారాన్ని అడ్డం పెట్టుకొని, దోషులను గుజరాతీ సర్కార్ విడుదల చేసింది.

గోధ్రా జైలు నుంచి బయటకొచ్చిన దోషుల్లో పలువురు విశ్వహిందూ పరిషత్ సభ్యులని వార్త. రేపిస్టు, హంతకులను సమర్థిస్తూ, దండలు వేసి స్వాగతిస్తూ, లడ్డూలు పంచుతున్న దృశ్యాలు తల దించుకొనేలా చేస్తున్నాయి. బాధితురాలు బానో బిక్కుబిక్కుమంటూ 15 ఏళ్ళలో ఇరవై ఇళ్ళు మారి, దీర్ఘకాలం చేసిన పోరాటం వృథాయేనా? బాధితురాలు నివసిస్తున్న అదే గ్రామంలో ఆమె ఎదుటే, ఇప్పుడా 11 మంది దోషులు రొమ్ము విరుచుకు తిరుగుతుంటే, అదెంత మానసిక క్షోభ? కక్ష కట్టిన దోషుల నుంచి ఆమె ప్రాణాలకు ఎవరు రక్ష? కేంద్రాన్ని సంప్రతించకుండా శిక్షాకాలపు తగ్గింపు నిర్ణయం తీసుకోరాదని చట్టం. సంప్రతించడమంటే, అనుమతి అనే తాత్పర్యం. అంటే, హేయమైన నేరం చేసినవారిని వదిలేయాలన్న గుజరాత్ సర్కార్ పాపంలో కేంద్రానికీ వాటా ఉందనేగా!

అదేమంటే, నిందితులకు శిక్షపడిన 2008 నాటికి అమలులో ఉన్న పాత 1992 నాటి విధి విధానాల ప్రకారమే నడుచుకున్నామంటూ సర్కార్ తప్పించుకోజూస్తోంది. నిజానికి ఆ నిబంధనల్ని కొట్టేసి, 2013లో కొత్త నిబంధనలూ వచ్చాయి. సున్నితమైన కేసుల్లో నిబంధనల్లోని లొసుగుల్ని వాడుకొనే కన్నా, సామాన్యులకు జరిగిన అన్యాయంపై పాలకులు కఠినంగా ఉండాలనే ప్రజలు ఆశిస్తారు. గుజరాత్ సర్కార్ ప్రవర్తన అలా లేదు. పైగా, బానో కేసు దోషులకు శిక్షాకాలం తగ్గించమన్న సలహా సంఘంలో ఇద్దరు సభ్యులు బీజేపీ ఎమ్మెల్యేలే. వృందా గ్రోవర్ లాంటి లాయర్లన్నట్టు ఆ 1992 నాటి నిబంధనల కాపీ పబ్లిక్ డొమైన్‌లో కనిపించకుండాపోవడం ఆశ్చర్యకరం.

బానో కేసులో దోషుల్ని జైలు నుంచి విడిచిపెట్టి, గుజరాత్ అల్లర్లపై గళం విప్పిన ఉద్యమకారిణి తీస్తా సెతల్వాడ్, పోలీసు అధికారులు సంజీవ్ భట్, ఆర్బీ శ్రీకుమార్ లాంటివారిని కటకటాల వెనక్కి నెట్టడం వక్రోక్తి. నోరెత్తిన నేరానికి వయోభారం, వైకల్యంతో ఉన్నాసరే కవుల్నీ, ప్రొఫెసర్లనీ విచారణ సాకుతో అక్రమ కేసుల్లో ఏళ్ళ తరబడి జైలులో మగ్గబెడుతున్న మన పాలక, న్యాయవ్యవస్థలకు క్రూరమైన హత్యాచార దోషులపై ఎక్కడలేని జాలి కలగడం విడ్డూరం. 2012లో 'నిర్భయ' తర్వాత దేశంలో కఠిన చట్టాలు చేశామని జబ్బలు చరుచుకుంటున్న పాలకుల చిత్తశుద్ధిని ఇప్పుడేమనాలి? స్త్రీలు సరైన దుస్తులు ధరించకపోతే అత్యాచార వ్యతిరేక చట్టం వర్తించదంటున్న కేరళ కోర్టును చూస్తే మన వ్యవస్థలు ఏం మారినట్టు? ఈ మాటలు, నిర్ణయాలు సమాజానికే సిగ్గుచేటు. బానో కేసులో పాలకుల నిర్ణయం మహిళలెవ్వరూ సహించలేని ఘోరం! క్షమించలేని నేరం!

ప్రగతి ఫలాలు దక్కిందెవరికి?

భారత స్వాతంత్ర్యోద్యమం బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ప్రసిద్ధికెక్కి ఉండవచ్చు గానీ, అది మొత్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ, పీడనలన్నీ రద్దు కావాలని ఆకాంక్షించిన ఉద్యమం. బ్రిటిష్ పాలన తొలగిపోయినంత మాత్రాన ఆ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరినట్టేనా? ఇంతకూ 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలన తొలగిపోయిందా అనే ప్రశ్నలు 75 ఏళ్ళ తర్వాత కూడా ప్రాసంగికంగా ఉన్నాయి. ఏ అభివృద్ధిని ఆశించి వలస పాలకులను వెళ్లగొట్టామో, ఆ అభివృద్ధి సాధించామా, సాధించినట్టు కనబడుతున్న అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కాయి? ఎవరు కోల్పోయారు?

అభిప్రాయం



ఎన్. వేణుగోపాల్

వలస వాదానికి వ్యతిరేకంగా భారత ప్రజలు దాదాపు నూట యాభై ఏళ్ళు సాగించిన మహోజ్జ్వల పోరాటాల ధారలో ఒక మజిలీ 1947 ఆగస్ట్ 15. ఆ విస్తృత పోరాట సంప్రదాయం ఏ ఒక్క పార్టీదో, ఏ ఒక్క ప్రజా సమూహానిదో, ఏ ఒక్క నినాదానిదో, ఏ ఒక్క ప్రాంతానిదో, ఏ ఒక్క ఆశయానిదో కాదు. అది ఈ దేశ ప్రజలందరూ దోపిడీ, పీడనల నుంచి విముక్తి కావాలనే విశాల ఆశయానిది! పద్దెనిమిదో శతాబ్ది చివరి నుంచే ఆదివాసులు ప్రారంభించిన బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలూ; రైతుబిడ్డలైన సైనికులూ, రైతాంగమూ, సంస్థానాధీశులూ, రెండు ప్రధాన మతాలకూ చెందిన ప్రజలందరూ ఐక్యంగా పాల్గొన్న ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటమూ; ఆ తర్వాత ముప్పై సంవత్సరాలకు ప్రారంభమైన మధ్యతరగతి జాతీయోద్యమమూ, ఇరవయ్యో శతాబ్ది తొలి అర్ధభాగంలో సాగిన ఎన్నో విప్లవోద్యమాలూ, భిన్నమైన రాజకీయ ఉద్యమాలూ, ఆ ఉద్యమాలలో పాల్గొన్న అన్ని ప్రజాసమూహాలూ, అన్ని ప్రాంతాలూ... జాతీయోద్యమంలో భాగమే. అది ప్రధానంగా బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంగా ప్రసిద్ధికెక్కి ఉండవచ్చు గానీ, అది మొత్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమం. చాలాచోట్ల అది స్థానిక భూస్వామ్య దోపిడీ, పీడనలను కూడా వ్యతిరేకించిన ఉద్యమం. భారత సమాజం అనుభవిస్తున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక దోపిడీ, పీడనలన్నీ రద్దు కావాలని ఆకాంక్షించిన ఉద్యమం అది.

బ్రిటిష్ పాలన తొలగిపోయినంత మాత్రాన ఆ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరినట్టేనా? ఇంతకూ 1947 ఆగస్ట్ 15న బ్రిటిష్ పాలన తొలగిపోయిందా అనే ప్రశ్నలు 75 ఏళ్ళ తర్వాత కూడా ప్రాసంగికంగా ఉన్నాయి. ఈ ఏడున్నర దశాబ్దాల్లో జరిగిన అభివృద్ధి గణాంకాలు చూపి, ''స్వతంత్ర భారత ప్రగతి'' గురించి చెప్పడానికి అవకాశం ఉంది. భారత ఉపఖండంలోని ఇరుగు పొరుగు దేశాలలో ప్రజాస్వామ్యం అనుభవించిన అవాంతరాలను చూపి, భారతదేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతున్నదనే అవకాశమూ ఉంది. వలసానంతర భారత సమాజ గమనాన్ని అర్థం చేసుకోవడానికీ, విశ్లేషించడానికీ ఎన్నో సూచికలూ ప్రాతిపదికలూ ఉన్నప్పటికీ, ప్రగతి, ప్రజాస్వామ్యం అనే రెండు సూచికలే కీలకమైనవి.

బ్రిటిష్ వలస పాలన తొలగిపోవాలని భారత ప్రజలు కోరుకోవడానికీ, ఉద్యమించడానికీ మూల కారణం వలసవాదం భారత సంపదలను దోచుకుపోతున్నదనే అవగాహన. విస్పష్టమైన గణాంకాల ఆధారంగా దాదాభాయి నౌరోజీ 19వ శతాబ్ది చివరి రోజుల్లో ప్రతిపాదించిన 'వనరుల తరలింపు' సిద్ధాంతాన్ని దాదాపుగా జాతీయోద్యమంలోని అన్ని పాయలూ అంగీకరించాయి. భారత సమాజ వనరులతో స్థానికంగా సంపద పోగుపడడానికీ, తద్వారా సామాజిక ఆర్థికాభివృద్ధి జరగడానికీ వలస పాలన అవకాశం ఇవ్వడం లేదని జాతీయోద్యమ నాయకులందరూ భావించారు. వలస పాలన భారత సమాజ అభివృద్ధిని అడ్డుకుంటున్నదనీ, అందువల్ల దాన్ని తొలగించి స్వరాజ్యం సాధించినప్పుడే స్వతంత్ర, భారత ప్రజా ప్రభుత్వం భారత వనరులను స్థానికాభివృద్ధికి వినియోగించగలుగుతుందనీ జాతీయోద్యమం భావించింది.

75 ఏళ్ళ క్రితం వలస పాలకులు వెళ్లిపోయారు. భారత ప్రజలమైన మనం మన స్వతంత్ర రాజ్యాంగాన్ని రాసుకున్నాం. ప్రణాళికాబద్ధ ఆర్థికాభివృద్ధి వ్యూహాన్ని రచించుకున్నాం. కుంటుతూనో,



నడుస్తూనో, పరుగులతోనో పన్నెండు ప్రణాళికలు అమలయ్యాయి. ప్రణాళిక అంటేనే సోషలిజం చిహ్నమేమో అని భయంతో గంగవెర్రులెత్తే రాజకీయపక్షం అధికారం సాధించి, ప్రణాళికా సంఘాన్నీ, ప్రణాళికలనూ రద్దు చేసి పారేసి ఏడేళ్ళు గడిచాయి. ప్రణాళిక లేకుండానే భారతదేశాన్ని పరివర్తన చెందిస్తానని కొత్త సంస్థను ఏర్పాటు చేసింది. అనేక గ్రంథాలు కాగలిగిన ఈ సుదీర్ఘ చరిత్రలో భారత సమాజం సాధించిన ఆర్థిక, సామాజిక అభివృద్ధి ఎంత?

జాతీయాదాయం 3 లక్షల కోట్ల రూపాయల నుంచి 140 లక్షల కోట్ల రూపాయలకు, ఆహార ధాన్యాల ఉత్పత్తి 5 కోట్ల టన్నుల నుంచి 30 కోట్ల టన్నులకు, ఎగుమతులు ఒక బిలియన్ డాలర్ల నుంచి 38 బిలియన్ డాలర్లకు, రోడ్డు మార్గాలు 4 లక్షల కి.మీ. నుంచి 64 లక్షల కిలోమీటర్లకు పెరిగాయని... అటువంటి గణాంకాలతో మనం సాధించిన ప్రగతి గురించి చెప్పుకోవచ్చు. కానీ నాణానికి ఈ బొమ్మతో పాటే బొరుసు ఉంది. ఇక్కడ ఎన్నో రెట్లు పెరిగినట్టు కనబడుతున్న అంకెల పొట్ట విప్పి చూస్తే ఆ పెరుగుదలలోని ఒడుదొడుకులు బయట పడతాయి. ఉదాహరణకు జాతీయాదాయం లెక్కలో ఒక వంద మందిని మినహాయిస్తే, హఠాత్తుగా మన జాతీయాదాయం సగానికి పడిపోతుంది. ఆ వందమంది ఆదాయం 55 కోట్ల మంది ఆదాయం కన్నా ఎక్కువ. అలాగే ఆహారధాన్యాల ఉత్పత్తిలో ఆరు రెట్లు పెరుగుదల, జనాభా పెరుగుదల నాలుగు రెట్ల కన్న తక్కువే ఉన్నప్పటికీ, ఇప్పటికీ దేశంలో ఆకలిచావులు, అర్ధాకలి కొనసాగుతూనే ఉన్నాయి. ఎగుమతుల్లో 38 రెట్ల పెరుగుదల కనబడుతున్నప్పటికీ, దిగుమతులు ఇదే కాలంలో ఒక బిలియన్ డాలర్ల నుంచి 60 బిలియన్ డాలర్లకు పెరిగి, విదేశీ వాణిజ్య లోటు విపరీతంగా హెచ్చింది. ఎగుమతి దిగుమతుల వ్యత్యాసం 2 కోట్ల రూపాయల నుంచి 20 వేల కోట్ల రూపాయలకు పెరిగిపోయింది. ఈ 75 ఏళ్ళలో ఆర్థిక, సామాజిక అసమానతలు, అవిద్య, అనారోగ్యం, నిరుద్యోగం వంటి మౌలిక సమస్యలు గణనీయంగా మారలేదు. ఏ ఒక్క అభివృద్ధి గణాంకం తీసుకున్నా, ఆ వెలుగు వెనుక పెనుచీకటి కనబడుతూనే ఉన్నది. ఏ అభివృద్ధిని ఆశించి వలస పాలకులను వెళ్లగొట్టామో, ఆ అభివృద్ధి సాధించామా, సాధించినట్టు కనబడుతున్న అభివృద్ధి ఫలాలు ఎవరికి దక్కాయి? ఎవరు కోల్పోయారు?

అంత మాత్రమే కాదు, ఆ నాడు ఒక్క బ్రిటన్‌కు వలసగా ఉన్న భారతదేశం ఇవాళ, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ విధానాల తర్వాత అనేక పెట్టుబడిదారీ దేశాలకు ముడిసరుకులు అందించే వనరుగా, వాళ్ల సరుకులు అమ్ముకునే మార్కెట్‌గా మారిపోయింది. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య సంస్థ షరతులకూ, దిగుమతుల కోసం ఆధారపడిన అన్ని దేశాల అవమానకర ఆదేశాలకూ తలొగ్గి, సార్వభౌమాధికారాన్నే పలుచబరచుకునే స్థితి వచ్చింది. ఆధునికత, విద్య, రవాణా, సమాచార సంబంధాలు, పారిశ్రామికాభివృద్ధి వంటి రంగాలలో అంకెల్లో మాత్రమే చూస్తే బ్రిటిష్ వలస పాలన కూడ ఇటువంటి ప్రగతి సాధించినట్టే కనబడుతుంది. కానీ, సుపరిపాలన ఉన్నా సరే, స్వపరిపాలనకు ప్రత్యామ్నాయం కాదు అని జాతీయోద్యమం కోరుకుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం కావాలనీ, పరాయి పాలన పీడన తొలగిపోవాలనీ కోరుకుంది. సంపద తరలింపు గురించి మాట్లాడిన నౌరోజీయే ''బ్రిటిషేతర పాలన'' అన్నాడు. అంటే స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి నినాదాల పుట్టుకకు కారణమైన పెట్టుబడిదారీ విధానం వలస వాదంగా, సామ్రాజ్యవాదంగా మారి, ఆ నినాదాల స్ఫూర్తిని వదిలేసి, తమ వలస ప్రజలకు స్వేచ్ఛ లేని స్థితి కల్పించిందని అర్థం. ఆర్థికాభివృద్ధి కన్నా ముఖ్యం స్వాతంత్ర్యం అని సాగిన జాతీయోద్యమం 1947 ఆగస్ట్ 15న ఆ స్వాతంత్ర్యాన్ని సాధించానని భావించింది.

కానీ, ఆ తరువాతి ఇన్నేళ్ళ చరిత్రను అవలోకిస్తే, ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అనే విశాల భావనను ఐదు సంవత్సరాలకు ఒకసారి మొక్కుబడిగా జరిగే ఎన్నికలకు కుదించారు. ఆ ఎన్నికలు అక్రమాలకు నిలయాలయ్యాయి. ఒకసారి ప్రజా ప్రతినిధిగా ఎన్నికైతే ఐదేళ్ళలో ఏమైనా చేసే అధికారం చేజిక్కుతున్నది. ప్రభుత్వాధికారం వ్యక్తిగత సంపదలు పెంచుకునే సాధనంగా మారిపోయింది. ఉదాత్తంగా రాసుకున్న రాజ్యాంగ ఆదేశాల అమలు కన్నా ఉల్లంఘన ఎక్కువ జరుగుతున్నది. ప్రజా భాగస్వామ్యంతో నడవవలసిన పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో ప్రజలు మౌన సాక్షులుగా మిగిలిపోయారు. బహుళత్వానికి నిలయమైన దేశంలో నెలకొనవలసిన, బలపడవలసిన పరస్పర సహాయ సహకార సంఘీభావాల స్థానంలో కుల, మత, ప్రాంత, భాషా విద్వేషాల రాజకీయాలు చెలరేగి సమాజ అస్తిత్వమూ, భవిష్యత్తూ ప్రమాదకర స్థితికి చేరాయి. వలస పాలకులు తయారు చేసిన న్యాయవ్యవస్థ, భారత శిక్షా స్మృతి, నేర శిక్షా స్మృతి స్వల్పమైన మార్పులతో కొనసాగుతున్నాయి. వలస పాలకులు సృష్టించిన రాజద్రోహ నేరం ఇప్పటికీ అట్లాగే ఉంది. జాతీయోద్యమం తీవ్రంగా వ్యతిరేకించిన రౌలట్ చట్టాన్ని మించిన దుర్మార్గమైన ప్రజావ్యతిరేక చట్టాలు లెక్కలేనన్ని స్వతంత్ర భారత పాలనలో అమలులోకి వచ్చాయి. 'దేశమనియెడు దొడ్డ వృక్షం/ ప్రేమలను పూలెత్తవలెనోయి/ నరుల చమటను తడిసి మూలం/ ధనం పంటలు పండవలెనోయి' అని గురజాడ అప్పారావు 'దేశభక్తి' గీతంలో రాసినప్పుడు మొదటి రెండు పంక్తులు ప్రజాస్వామ్యానికీ, బహుళత్వ సామరస్యానికీ, చివరి రెండు పంక్తులు సంపద అభివృద్ధికీ, సమాన పంపిణీకీ సూచనలు. ఈ 75 ఏళ్లలో భారతదేశం అనే దొడ్డ వృక్షం ఎన్నో పూలు పూసింది, ఫలాలూ ఇచ్చింది, నరుల చెమటతో ధనం పంటలూ పండించింది. కానీ ఆ ప్రగతి ఫలాలు దక్కిందెవరికి? ఆ ధనం నింపిన బొక్కసాలెవరివి అనే ప్రశ్నలు ఇంకా భారత సమాజం ముందు నిలిచే ఉన్నాయి.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు, సీనియర్ పాత్రికేయులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కీర్తించాల్సిన విషయమా?



పాకిస్తాన్‌కు చెందిన ఒక 'మానవ హక్కుల కార్యకర్త' సల్మాన్ రష్దీ మీద దాడిచేసినవాడి గొప్పతనాన్ని కీర్తిస్తూ ట్వీట్ చేశాడు. అందుకే ఇస్లామిక్ తీవ్రవాదాన్ని మనం ఎందుకు ఆపలేమనేదాన్లో ఆశ్చర్యం ఏమీ లేదు. పెద్ద సామాజిక మాధ్యమాలన్నీ ఇలాంటివాళ్లకు ప్రచార వేదికలుగా ఉంటూ మరింతమంది జిహాదీలను చేర్చుకోవడానికి పనికొస్తున్నాయి.

– హారిస్ సుల్తాన్, రచయిత

అందరూ వెనక్కి...



ఇప్పటివరకూ బంగ్లాదేశ్ ఏడు లక్షల మంది రోహింగ్యా ముస్లిం శరణార్థులను మయన్మార్‌కు వెనక్కి పంపింది. మిగిలిన శరణార్థులను కూడా చైనా సాయంతో వెనక్కి పంపే ప్రణాళికలో ఉంది. బంగ్లాదేశ్ ఒక్క రోహింగ్యా ముస్లింను కూడా ఉంచుకోవడం లేదు. బంగ్లాదేశ్ ఒక ముస్లిం దేశం.

– రిషి బాగ్రీ, వ్యాఖ్యాత

ఎందుకింత నిర్లజ్జ



శిక్ష పడిన రేపిస్టులు, హంతకులను మిఠాయిలతో గుజరాత్‌లో వీహెచ్‌పీ స్వాగతించడం సిగ్గుపడవలసిన విషయం. వాళ్లు తమ పూర్తి శిక్షాకాలాన్ని అనుభవించి ఉండవచ్చు; అయినాకూడా వారు ఒక పసిపిల్లను చంపిన, ఆమె తల్లిని(బిల్కిస్ బానో) మూకుమ్మడి అత్యాచారం చేసిన మగవాళ్లే కదా!

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

కాపాడలేక...



కశ్మీర్‌లో భారతీయులు భూములు కొనడం అనేది మరిచిపోండి; ఆఖరికి కశ్మీర్‌లో నివసిస్తున్న కశ్మీరీ పండితులు కూడా కశ్మీర్ నుంచి బయటకు పంపమని నిరసన ప్రదర్శనలు జరుపుతున్నారు.

– అశోక్ స్వెయిన్, ప్రొఫెసర్

విలువ తెలుస్తుంది



యుద్ధకాలంలో బతకడం అంటే భయపడటం అని జనం ఎందుకు అనుకుంటారో తెలియదు. యుద్ధకాలంలో బతకడం అంటే మన నుంచి దొంగిలించబడిన మన జీవితాన్ని వెనక్కి తీసుకోవడానికి ప్రయత్నించడం.

– మరియమ్ నయీమ్, అఫ్గాన్ మూలాలున్న ఉక్రెయినియన్

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
శ్రావణ మాసం, **తిథి:** బ.సప్తమి రా.12.17 వరకు, తదుపరి అష్టమి
నక్షత్రం: భరణి రా.3.24 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ప.12.22 నుండి 2.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.56 నుండి 10.47 వరకు తదుపరి ప.2.58 నుండి 3.51 వరకు
అమృతఘడియలు: రా.10.22 నుండి 12.04 వరకు.

సూర్యోదయం: 5.46
సూర్యాస్తమయం: 6.22
రాహుకాలం: ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుంచి 7.30 వరకు

ఇన్‌బాక్స్

ధనికులను కొట్టి... పేదలకు పెట్టి...

సామాన్యుడైన సర్వాయి పాపన్న సమకాలీన పాలకులను గడగడ లాడించి తానే పాలకుడయ్యాడు. జానపద కళాకారులు, కవులు, రచయితలు, కల్లుగీత కార్మికులు తమ శక్తిమేరకు పాపన్న చరిత్రను పదిలపర్చుకుంటూ నేటి తరానికి అందించారు.

క్రీ.శ. 1650 ఆగస్ట్ 18న సర్వాయి పాపన్న జన్మించాడు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం తాటికొండ వాసి. బతుకుతెరువు కోసం పాపన్న పశువులను గాస్తూ తన తల్లి సర్వాయమ్మ కోరిక మేరకు కల్లుగీత వృత్తిని చేపట్టాడు. కాల క్రమంలో స్థానిక దొరలు, భూస్వాములను, రాజులను ఎదిరించడానికి సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. పాపన్న కుల మతాల కతీతంగా అందరినీ చేరదీశాడు. ధనికుల వద్ద ఉన్న భూములను, సంపదను దోచి పేదలకు పంచాడు. ప్రజలందరితో 'సర్దార్' అనిపించుకున్నాడు.



సర్వాయి పాపన్న

బుడిగ జంగాలు, శారద కాండ్ర కథల వాళ్ళు ఇతర జానపదులు పాపన్న చరిత్రను కథలుగా చెబుతున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి ప్రాంతంలో ఒక బోయవాడి పాటను ఆధారం చేసుకుని ప్రముఖ జానపద పరిశోధకుడు ఏజే బోయల్ పాపన్న చరిత్రను ప్రాచుర్యంలోకి తెచ్చారు. లండన్‌లోని విక్టోరియా అల్బర్ట్ మ్యూజియంలో సర్వాయి పాపన్న ఒక చేతిలో రామచిలుక, మరో చేతిలో పొడువాటి బల్లెంతో సేదతీరుతున్న చిత్రం ఉన్నది. లండన్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్శిటీకి చెందిన రిచర్డ్ ఎమ్ ఈటన్ రాసిన 'ఎ సోషల్ హిస్టరీ ఆఫ్ ది దక్కన్: 1300–1761' అనే పుస్తకం ప్రచురించి కవర్ పేజీగా పాపన్న చిత్రాన్ని ప్రచురించారు.

సర్వాయి పాపన్న నిర్మించుకున్న కోటలు సర్వాయిపేట, తాటికొండ, ఖిలాషాపురంలలో ఉన్నాయి. అలాగే ఆయన వరంగల్, భువనగిరి, గోల్కొండ కోటలను ఆక్రమించాడంటారు. మరుగున పడిన పాపన్న చరిత్రను వెలికితీసి నేటి తరానికి అందించేందుకు ప్రభుత్వం మరింతగా పూనుకోవాలి.

– ఎం.వి. రమణ, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
(నేడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రాజ్యాంగ స్ఫూర్తితో దేశం ఎదగాలి!

సందర్భం



కె.కె. శైలజ

మనం 75వ స్వాతంత్ర్య దినోత్సవాలు చేసుకుంటున్నాం. 1947లో భారత్ ఎలా ఉండేదీ, గత 75 ఏళ్లలో అది ఎంతగా మారిందీ, నూరేళ్ల గడిచేసరికి స్వతంత్ర భారత్ ఎలా ఉండాలీ అని తరచి చూసుకోవలసిన సమయం ఇది. స్వాతంత్ర్యం పొందే నాటికి సామ్రాజ్యవాద బ్రిటన్, భారత్‌ను దారిద్ర్యంలో ముంచెత్తి వెళ్లిపోయింది. దేశమంతటా భూస్వామ్య వ్యవస్థ రాజ్యమేలేది. భూస్వామ్య వ్యవస్థలో అత్యంత అమానుష రూపం కులవ్యవస్థ. స్వతంత్ర భారత్‌లో ప్రజాస్వామిక వ్యవస్థ పరిఢవిల్లుతుందనీ; భూస్వామ్య వాదం, దాని పిలకలైన కులతత్వం వంటివి పూర్తిగా తుడిచిపెట్టుకు పోతాయనీ విశ్వసించాం. రాజ్యాంగ నిర్మాతలు ఒక ఉజ్వల ప్రజాస్వామ్యంగా భారత్‌ని మార్చడానికి ప్రయత్నించారు. భారత్ ఒక సార్వ భౌమాధికార, సామ్యవాద, లౌకిక వాద, ప్రజాతంత్ర రిపబ్లిక్ అవుతుందని రాజ్యాంగ ప్రవేశిక ప్రకటించింది.

ప్రజాస్వామ్యం ముఖ్య లక్షణం ఏమిటంటే, పౌరులందరికీ సమాన అవకాశాలను కల్పించడమే. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత, మానవాభివృద్ధిలో, దారిద్ర్య నిర్మూలనంలో, ఆనంద సూచికలో భారత్ ఎంతో వెనుకబడి ఉంది. మన అభివృద్ధి గాథ కూడా సంపన్నులు మరింత సంపన్నులుగా మారటం, పేదలు మరింత నిరుపేదలుగా వెనక్కు నెట్టివేయబడటం లాగానే మిగిలిపోయి ఉంది. స్వాతంత్ర్యం తర్వాత భారత్‌లో భూస్వామ్య వ్యవస్థను, కుల వ్యవస్థను నిర్మూలించి ఉండాల్సింది. భూసంస్కరణలు, వ్యవసాయ సంబంధాల్లో విప్లవం తప్పనిసరిగా వచ్చి ఉండాల్సింది. కాని అలా జరగలేదు.

మతం పేరిట అమానుష సంప్రదాయాలను కొనసాగించడాన్ని అనుమతించకూడదు. జవహర్‌లాల్ నెహ్రూ వంటి నాయకులు ప్రవచించిన శాస్త్రీయ విలువల ఆధారంగా దేశాన్ని అభివృద్ధి వైపు మనం మళ్లించలేకపోయాం. ఇప్పుడు స్వయం ప్రకటిత మెజారిటీ మతం ఆదేశిస్తుంటే తక్కిన దేశమంతా పాటించాల్సిన స్థానానికి దేశం చేరుకుంది. నిజం చెప్పాలంటే, భారత్ ఒక అప్రజాస్వామిక, లౌకికేతరమైన మార్గంలో ప్రయాణిస్తోంది.



లౌకికవాదం అనేది ఏ ప్రజాస్వామిక దేశమూ నిర్లక్ష్యం చేయలేని ఒక ఉదాత్త భావన. భారతదేశం అయిదారు ప్రముఖ మతాలతో, దాదాపుగా 6 వేల కులాలు, 1,600 భాషలతో కూడుకుని ఉన్న దేశం. ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని మనం ఆమోదించకపోతే, ఒక దేశంగా మనం కుప్పగూలిపోతాం. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి, ఓట్ల కోసం మతాన్నీ, కులాన్నీ ఉపయోగించడం సాధారణమైపోయింది.

చేయి చాపుతున్న ప్రజల్లో చాలావరకు పేదలే. ప్రత్యేకించి దళిత కమ్యూనిటీలకు చెందిన మహిళలే ఎక్కువ. దేశ కార్మిక శక్తిలో మహిళల శాతం 23 మాత్రమే. అన్ని విషయాల్లో మాదిరిగానే వేతనాల్లోనూ వివక్షకు గురవుతున్నారు. పంచాయితీ రాజ్‌ని పరిచయం చేసిన తర్వాత మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకటన కారణంగా క్షేత్రస్థాయుల్లో రాజకీయ సంస్థల్లో వారికి ప్రవేశం లభించింది. తమ స్వరాలను వినిపించే అవకాశం కల్పించింది.

సోషలిజం ఒక ప్రజాస్వామిక అనివార్య లక్ష్యంగా ఉండాలి. పౌరులందరికి పనిచేయడానికీ, వివక్ష లేకుండానే తమ దేశ నిర్మాణానికి దోహదం చేయడానికీ అవకాశం కల్పిస్తుందది. తమ లింగం, సామాజిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూసే వ్యవస్థ అది. సోషలిజం మనగలగాలంటే, ప్రభుత్వం ప్రగతిశీల చట్టాలను రూపొందించాలి. కార్యనిర్వాహక వర్గం ఆ చట్టాలను అమలు చేయాలి. న్యాయవ్యవస్థ వాటిని బలపర్చాలి. ఇది భారత్‌లో ఇప్పటికీ వాస్తవంగా మారలేదు.

నేను వామపక్ష రాజకీయ సంప్రదాయానికి చెందినదాన్ని, నా పార్టీ అయిన సీపీఎం కేరళలో అనేకసార్లు ప్రభుత్వాన్ని నడిపింది. భూమి, విద్య, వైద్య పరమైన సంస్కరణలు ఆ రాష్ట్రంలో చక్కగా అమలు చేసింది. ఈ పరిణామాలు స్థిరంగా మారాలంటే, దేశం మొత్తంగా సామాజిక, ఆర్థిక అసమానత్వాన్ని తగ్గించడం వైపు కృషి చేయాల్సి ఉంది. నూరవ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి దేశంలో లౌకికత్వం మనగలుగుతుందనీ, లింగ వివక్ష కుల అంతరాలు ఉండవనీ భావించగలగాలి. దేశ వైవిధ్యం పట్ల గర్వించే పౌరులను అది రూపొందించగలగాలి. మతం, కులం, భాష వంటివాటిపై ఆధారపడి ప్రజలను విభజించకూడదు. సంస్కృతిని పోషించడానికి భాష ముఖ్యమైనది. కానీ ప్రతి భాషకూ సమాన గౌరవం కల్పించాలి.

శత వత్సర స్వతంత్ర భారత్... భావవ్యక్తీకరణ స్వేచ్ఛను నిరోధించని, ప్రజలు స్వేచ్ఛగా తమను తాము వ్యక్తీకరించుకునే భారత్‌గా ఉండాలి. పేదలకు తమదైన భూమి లభించి ఉంటుందనీ, ఉచిత విద్య, విద్యుత్, తాగునీరు, నాణ్యమైన ఉపాధి, న్యాయమైన వేతనం, సరసమైన మార్కెట్ వారికి అందుబాటులోకి వస్తాయనీ నా నమ్మకం. లింగ వివక్షను ఎదుర్కోకుండా పిల్లలు చదువుకునే భారత్‌ను నేను కోరుకుంటున్నాను. పరస్పరం గౌరవించుకుంటూ పెరిగే స్త్రీపురుషులు జీవించే భారత్‌ను, లైంగిక దాడిని ఎదుర్కోకుండా మహిళలు జీవించే భారత్‌ను కోరుకుంటున్నాను. మతపరమైన దాడులు జరగని భారత్‌ను నేను కోరుకుంటున్నాను. మన రాజ్యాంగంలో పేర్కొన్నట్లుగా లౌకిక, సామ్యవాద, ప్రజాతంత్ర భారత్‌ని నేను కోరుకుంటున్నాను.

వ్యాసకర్త సీనియర్ సీపీఎం నాయకురాలు, కోవిడ్ సమయంలో సమర్థంగా పనిచేసిన కేరళ మాజీ ఆరోగ్య మంత్రి

క్లుప్తంగా...

మూడొంతుల మందిపై క్రిమినల్ కేసులు!

బిహార్ మంత్రులపై ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ: ఎన్డీఏ కూటమితో బంధం తెంచుకుని ఆర్జేడీ, కాంగ్రెస్‌తో జట్టుకట్టి బిహార్‌లో కొత్త ప్రభుత్వాన్ని కొలువుతీర్చిన సీఎం నితీశ్‌కుమార్ క్రిమినల్ కేసులున్న నేతలతో దాదాపు మొత్తం మంత్రివర్గాన్ని నింపేశారు. అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) తాజా నివేదిక ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. కొత్త ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న వారిలో 70 శాతానికిపైగా నేతలపై క్రిమినల్ కేసులున్నట్లు ఏడీఆర్ నివేదించింది. రెండేళ్ల క్రితం రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల సందర్భంగా అభ్యర్థులుగా వీరంతా సమర్పించిన అఫిడవిట్లను ఏడీఆర్, బిహార్ ఎలక్షన్ వాచ్ సంస్థ సంయుక్తంగా క్షుణ్ణంగా పరిశీలించాక ఈ నివేదికను బహిర్గతంచేసింది. ఇందుకోసం సీఎం నితీశ్ సహా 33 మంది మంత్రుల్లో 32 మంది అఫిడవిట్లను పరిశీలించారు. మొత్తం మంత్రుల్లో 23 మంది(72 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, 17 మంది మంత్రులు(53 శాతం) తమపై తీవ్రమైన నేరమయ కేసులున్నాయి. మొత్తం మంత్రుల్లో 27 మంది(84 శాతం) కోటీశ్వరులుకాగా, మొత్తం 32 మంది మంత్రుల సగటు ఆస్తుల విలువ రూ.5.82 కోట్లు. పాతిక శాతం మంది మంత్రులు తమ విద్యార్హతలు 8వ తరగతి నుంచి ఇంటర్‌లోపేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నితీశ్ ముగ్గురు మహిళలకు మంత్రివర్గంలో ప్రాధాన్యత కల్పించారు. జేడీ(యూ) నుంచి 11 మంది, ఆర్జేడీ నుంచి 16 మంది, కాంగ్రెస్ నుంచి ఇద్దరు, జితన్ రాం మాంఝీ పార్టీ నుంచి ఒకరు, ఒక స్వతంత్ర్య ఎమ్మెల్యే మంత్రులుగా కొనసాగుతున్నారు.

వాతావరణ మార్పుల బిల్లుపై బైడెన్ సంతకం

వాషింగ్టన్: వాతావరణ మార్పులు, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కీలక బిల్లుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతకం చేశారు. దీంతో ఇది చట్టరూపం దాల్చినట్లే. కొత్త బిల్లు ప్రకారంఅమెరికాలో వాతావరణ మార్పుల వల్ల తలెత్తే దుష్పరిణామాలను నివారించడానికి వచ్చే పదేళ్లలో 375 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తారు. వాతావరణ మార్పులపై జరుగుతున్న యుద్ధంలో ఇది అతి పెద్ద పెట్టుబడి అని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆరోగ్య సంరక్షణకు కోసం పెద్ద ఎత్తున నిధులు వెచ్చించనున్నారు. అర్హులకు రాయితీతో ఆరోగ్య బీమా, ఔషధాలు అందిస్తారు. తాము ఎల్లప్పుడూ అమెరికా ప్రజల వెంటే ఉంటామని, ఇతర ప్రయోజనాలు తమకు ముఖ్యం కాదని ఈ సందర్భంగా బైడెన్ వ్యాఖ్యానించారు. కొత్త బిల్లుకు అమెరికా పార్లమెంట్ గత వారమే ఆమోదం తెలిపింది.

జార్ఖండ్ ఎమ్మెల్యేలకు మధ్యంతర బెయిల్

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని హౌరా జిల్లాలో రూ.49 లక్షల నగదుతో పట్టుబడిన ముగ్గురు జార్ఖండ్ ఎమ్మెల్యేలకు కలకత్తా హైకోర్టు బుధవారం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇర్ఫాన్ అన్సారీ, రాజేశ్ కచ్ఛాప్, నామన్ బిక్సల్ కొంగరీ జూలై 30న అరెస్టయిన సంగతి తెలిసిందే. వారు ప్రయాణిస్తున్న కారును తనిఖీ చేయగా, రూ.49 లక్షల నగదు లభ్యమయ్యింది. ఈ వ్యవహారంపై బెంగాల్ సీఐడీ బృందం దర్యాప్తు చేస్తోంది. నిందితులకు మూడు నెలలపాటు మధ్యంతర బెయిల్ ఇస్తూ డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. కోల్‌కతా మున్సిపల్ ఏరియాను దాటి వెళ్లొద్దని ఆదేశించింది. పాస్‌పోర్టులను అధికారులకు అప్పగించాలని, ప్రతీవారం విచారణకు హాజరు కావాలని పేర్కొంది.

చిన్నారుల టికెట్ల బుకింగ్‌లో మార్పుల్లేవ్

రైల్వే శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: చిన్నారులకు రైల్వే టికెట్ల బుకింగ్‌కు సంబంధించిన నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని రైల్వే శాఖ వెల్లడించింది. ఒకటి నుంచి నాలుగేళ్లలోపు పిల్లలకు సైతం పెద్దలకు అయ్యే చార్జీనే వసూలు చేస్తారంటూ మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో బుధవారం ఈ మేరకు వివరణ ఇచ్చింది. ఐదేళ్లలోపు పిల్లలు రైళ్లలో ఉచితంగా ప్రయాణించవచ్చంటూ రైల్వే శాఖ 2020 మార్చి 6న ఒక సర్క్యులర్ జారీ చేసింది. అయితే, వారికి ప్రత్యేకంగా బెర్త్ గానీ, సీటు గానీ కేటాయించరు. ఒకవేళ బెర్త్ లేదా సీటు కావాలనుకుంటే పెద్దలకు అయ్యే రుసుమును చెల్లించి, టికెట్ కొనాల్సి ఉంటుంది. ఈ నిబంధనల్లో ఎలాంటి మార్పులు చేయలేదని, మీడియాలో వస్తున్న వార్తల్లో నిజం లేదని రైల్వేశాఖ స్పష్టం చేసింది. కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆక్షేపించింది. బెర్త్ లేదా సీటు అవసరం లేదనుకుంటే ఐదేళ్లలోపు పిల్లలు రైళ్లలో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలియజేసింది.



ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో భేటీ అయిన తమిళనాడు సీఎం స్టాలిన్

అనుచితాలు కాదు

- సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ
- సంక్షేమ పథకాలను వద్దనలేం
- వాటిని ఉచితాల గాటన కట్టలేం
- హామీలివ్వకుండా పార్టీలను అడ్డుకోలేం
- ఉపాధి హామీతో ప్రజలకు గౌరవప్రద జీవితం
- ఉచితానుచితాలను తేల్చడానికి త్వరలో కమిటీ
- సీజేఐ పునరుద్ఘాటన
- విచారణ ఆగస్టు 22కు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ''ఉచితమంటే ఏమిటి? దేన్ని ఉచితంగా పరిగణించాలి'' అనే కీలకమైన మౌలిక ప్రశ్నలను సర్వోన్నత న్యాయస్థానం లేవనెత్తింది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీటి సదుపాయం తదితరాలను ఉచితాలుగా భావించాలా, లేక పౌరుల ప్రాథమిక హక్కుగానా అన్నది లోతుగా ఆలోచించాల్సిన అంశమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ వంటి పథకాల ద్వారా దేశ పౌరులకు అందుతున్న ఎనలేని ప్రయోజనాలను ప్రస్తావించారు. తద్వారా గ్రామీణ భారతంలో అపారంగా ఆస్తుల సృష్టి కూడా జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీల ఉచిత హామీల అంశాన్ని సమగ్రంగా తేల్చడానికి ఓ నిపుణుల కమిటీ వేసే యోచన ఉందని మరోసారి చెప్పారు. రాజకీయ పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలను నియంత్రించేలా కేంద్రాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ బీజేపీ నేత, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ హిమా కోహ్లిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా జస్టిస్ రమణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓటర్లకు వాగ్దానాలు చేయకుండా రాజకీయ పార్టీలను నిరోధించలేమని సూచనప్రాయంగా పేర్కొన్నారు. ''వాగ్దానాలు చేయకుండా దేశంలోని రాజకీయ పార్టీలను నిరోధించలేమని సూచిస్తున్నాం. ఎందుకంటే సమాజంలోని భిన్న వర్గాల్లో ఆదాయం, హోదా, సదుపాయాలు, అవకాశాలపరంగా అసమానతలను రూపుమాపాలని రాజ్యాంగమే ప్రభుత్వాలకు నిర్దేశిస్తోంది. కాబట్టి గెలిచి అధికారంలోకి వస్తే ఈ నిర్దేశాన్ని సాకారం చేసేందుకు ఉచిత హామీలివ్వకుండా పార్టీలను గానీ, వ్యక్తులను గానీ నిరోధించలేం. కాకపోతే ఏది నిజమైన హామీ నిర్వచనంలోకి వస్తుందన్నదే అసలు ప్రశ్న. అలాగే అసలు ఉచితమంటే ఏమిటో స్పష్టంగా నిర్వచించాల్సిన అవసరముంది. సార్వత్రిక ఆరోగ్య సంరక్షణ, తాగునీటి సదుపాయం, ఎలక్ట్రానిక్ పరికరాలు వంటివాటిని ఉచితంగా పొందవచ్చా?'' అంటూ ఆయన కీలక ప్రశ్నలు లేవనెత్తారు. ''ప్రజలు గౌరవంగా జీవించడానికి అవసరమైన పథకాలు కూడా ఉన్నాయి. ఎన్నికల్లో గెలుపును కేవలం ఉచిత వాగ్దానాలే నిర్దేశించడం లేదు. కొన్ని పార్టీలు ఎన్ని వాగ్దానాలు చేసినా ఎన్నికల్లో గెలవడం లేదుగా!'' అని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అందరి అభిప్రాయాలూ తెలుసుకున్న తర్వాతే ఉచితాల మీద ఓ స్పష్టమైన నిర్ణయానికి రాగలమని సీజేఐ స్పష్టం చేశారు. తదుపరి విచారణను ఆగస్టు 22కు వాయిదా వేశారు.



అన్నింటిపైనా చర్చ: విపక్షాలు

పిటిషన్‌పై కాంగ్రెస్, ఆప్, డీఎంకే తదితర విపక్ష పార్టీలు భిన్నమైన వ్యాఖ్యలు చేశాయి. ఉచితాలు, దేశ ఆర్థిక పరిస్థితుల మధ్య సంబంధంపై చర్చ జరగాలంటే రాజకీయ నేతలు, చట్టసభ సభ్యులు ఏమేం ప్రయోజనం పొందుతున్నారో కూడా చర్చ జరగాలని ఆప్ తన ఇంటర్‌వీన్ అప్లికేషన్‌లో పేర్కొంది. ప్రజలకు రాయితీలివ్వడాన్ని ఉచితంగా పరిగణించరాదని కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ తన అప్లికేషన్‌లో పేర్కొన్నారు. భారత్‌ను ప్రజాస్వామ్య దేశం నుంచి పెట్టుబడీదారీ దేశంగా మార్చాలని పిటిషనర్ ప్రయత్నిస్తున్నారని డీఎంకే తరఫు సీనియర్ న్యాయవాది పి.విల్సన్ వాదించారు. సంక్షేమ పథకాలకు తాము వ్యతిరేకం కాదని కేంద్రం పేర్కొంది. అయితే పార్టీల ఉచిత వాగ్దానాలను నియంత్రించాల్సిన అవసరముందని కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మరోసారి సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఈ విషయమై చట్టసభల్లో చట్టాలు రూపొందేదాకా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవచ్చని కూడా మరోసారి సూచించింది.

> ప్రజా ధనాన్ని వెచ్చించడానికి సరైన మార్గం ఏమిటన్నదే అసలు సమస్య. ఏదీ ఉచితంగా దక్కదన్న ఆంగ్ల సామెతను గుర్తుంచుకోవాలి

పదవీ విరమణ రోజున ప్రస్తావిస్తా

రిజిస్ట్రీ సమస్యలు తదితరాలపై సీజేఐ

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అవలంబిస్తున్న కొన్ని పద్ధతులను నియంత్రించాల్సి ఉందని సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. బుధవారం విచారణ సందర్భంగా రిజిస్ట్రీతో ఓ కేసు విషయంలో ఎదురైన ఇబ్బందిని న్యాయవాది దుష్యంత్ దవే ప్రస్తావించగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ''రాత్రి ఎనిమిదింటికి దాకా కేసులకు సంబంధించిన అంశాలు విన్నాం. సమావేశాలు కూడా ఎక్కువయ్యాయి. ఆ తర్వాత ఒక కేసును విచారణ జాబితా నుంచి తొలగిస్తేనే ఈ కేసు జాబితాలో చేరింది. ఇది సరికాదు. రిజిస్ట్రీలో ఇలాంటి పద్ధతులను నియంత్రించాల్సిందే'' అన్నారు. ''నా దృష్టికి చాలా సమస్యలు వచ్చాయి. వాటన్నింటినీ నా పదవీ విరమణ సందర్భంగా వీడ్కోలు ప్రసంగంలో చెబుతా' అని పేర్కొన్నారు. జస్టిస్ రమణ 26న పదవీ విరమణ చేయనుండటం తెలిసిందే.

హైదరాబాద్ వెళ్లాలంటే ఎన్ఐఏ కోర్టును అడగండి

వరవరరావుకు సుప్రీంకోర్టు సూచన

సాక్షి, న్యూఢిల్లీ: షరతులతో కూడిన మెడికల్ బెయిల్‌పై విడుదలైన విప్లవ రచయిత వరవరరావు హైదరాబాద్‌కు వెళ్లాలంటే అనుమతి కోసం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కోర్టును అభ్యర్థించాలని సుప్రీంకోర్టు సూచించింది. కంటి చికిత్స కోసం హైదరాబాద్ వెళ్లడానికి అనుమతి ఇవ్వాలంటూ వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కోర్టు విచారించింది. వరవరరావు తరఫు న్యాయవాది ఆనంద్ గ్రోవర్ వాదనలు వినిపించారు. సొంత నివాస స్థలమైన హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుంటే ఆ వాతావరణంలో వరవరరావు త్వరగా కోలుకుంటారని తెలిపారు. దీంతో అనుమతి కోసం ఎన్ఐఏ ట్రయల్ కోర్టుకు వెళ్లాలని వరవరరావుకు సుప్రీంకోర్టు సూచించింది.

పారిశ్రామికవేత్త అదానీకి జెడ్ కేటగిరి భద్రత

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీకి కేంద్ర ప్రభుత్వం జెడ్ కేటగిరి భద్రత కల్పించింది. వీఐపీలకు ఇచ్చే భద్రత కింద సీఆర్‌పీఎఫ్ కమాండోలు ఆయనకు భద్రత కల్పిస్తారని అధికార వర్గాలు వెల్లడించాయి. ఖర్చుని అదానీయే భరిస్తారు. నెలకి రూ.15–20 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా. 33 మంది కమాండోలు ఆయనకు కాపలాగా ఉంటారు.

రెచ్చగొట్టే దుస్తులు ధరిస్తే ఆరోపణలు నిలబడవు

- లైంగిక వేధింపుల కేసులో కేరళ కోర్టు తీర్పు
- కోర్టు తీర్పుపై కేరళ మహిళా కమిషన్ ఆందోళన

కొజికోడ్: యువతులు రెచ్చగొట్టే దుస్తులు వేసుకున్నప్పుడు వారు చేసే లైంగిక ఆరోపణలు కోర్టులో ప్రాథమికంగా నిలబడవని కేరళ జిల్లా సెషన్స్ కోర్టు వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బాధితురాలు సెక్సువల్‌గా రెచ్చగొట్టే దుస్తులు ధరించినందుకే వేధింపుల కేసు నుంచి కేరళ రచయిత, సామాజిక కార్యకర్త సివిక్ చంద్రన్‌కు బెయిల్ మంజూరు చేస్తూ తీర్పు చెప్పింది. ఫిబ్రవరిలో కోయిలాండి సమీపంలోని నంది బీచ్‌లో జరిగిన ఒక సాహితీ సమావేశంలో రచయిత సివిక్ చంద్రన్ తనను లైంగికంగా వేధించారంటూ ఒక యువ రచయిత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ముందస్తు బెయిల్ కోసం చంద్రన్ దరఖాస్తు చేసుకున్నారు. సదస్సులో ఆమె ఫోటోలను చంద్రన్ తరఫు లాయర్ కోర్టుకి సమర్పించారు. ఆ ఫోటోల్లో ఆమె లైంగికంగా రెచ్చగొట్టే దుస్తులు ధరించారని, అలాంటి దుస్తులు ధరించి లైంగిక వేధింపుల ఆరోపణలు చేస్తే ఐపీసీ సెక్షన్ 354ఏ ప్రకారం అవి చెల్లవని కోర్టు పేర్కొంది. 74 ఏళ్ల దివ్యాంగుడైన చంద్రన్ ఆమె ఆరోపించినట్టు ఒళ్లో కూర్చోబెట్టుకోవడం, అసభ్యంగా ప్రవర్తించడం వంటివి నమ్మదగినట్టుగా లేవని కోర్టు అభిప్రాయపడింది. రెచ్చగొట్టే దుస్తులు ధరించే వారు చేసే ఆరోపణలు 354ఏ ప్రకారం చెల్లవు కాబట్టి చంద్రన్‌కు బెయిల్ ఇచ్చింది. ఘటన జరిగిన 6నెలలకు కేసువేయడంపై వివరణ ఇవ్వాలంటూ ప్రాసిక్యూషన్‌ని ఆదేశించింది. కోజికోడ్ కోర్టు తీర్పుపై కేరళ మహిళా కమిషన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కోర్టు ఇలాంటి తీర్పు ఇవ్వడం దురదృష్టకరమని కేరళ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సతీదేవి వ్యాఖ్యానించారు. ఇలాంటి తీర్పులు అత్యాచారం వంటి కేసుల్లో తప్పుడు సంకేతాలు పంపుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

జాక్వెలిన్ ఫెర్నాండెజ్ చుట్టూ ఈడీ ఉచ్చు



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్ చుట్టూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉచ్చు బిగుస్తోంది. ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న కోట్లాది రూపాయల దోపిడీ కేసుతో సంబంధం ఉన్న మనీల్యాండరింగ్ కేసుకు సంబంధించిన చార్జిషీటులో ఆమెనూ నిందితురాలిగా పేర్కొంది. ఢిల్లీ ప్రత్యేక కోర్టులో బుధవారం కేసుకు సంబంధించిన అనుబంధ చార్జిషీటులో జాక్వెలిన్ పేరు చేర్చింది. ఏప్రిల్‌లో ఆమెకు సంబంధించిన రూ.7.27 కోట్లను అటాచ్ చేసింది. సుకేశ్‌తో సన్నిహితంగా మెలిగినందుకు జాక్వెలిన్‌కు దోపిడి సొమ్ముతో లబ్ధి చేకూరిందని ఈడీ పేర్కొంది. సుకేశ్ హవాలా మార్గాల్లో డబ్బులు సంపాదిస్తాడని తెలిసినప్పటికీ జాక్వెలిన్ అతనితో సన్నిహిత సంబంధాలు కొనసాగించిందని ఈడీ దర్యాప్తులో తేలింది. రాన్‌బాక్సీ మాజీ ప్రామోటర్లు మల్వీందర్ సింగ్, శివీందర్ సింగ్‌కు బెయిల్ ఇప్పిస్తానని నమ్మించి వారి భార్యల దగ్గర నుంచి రూ.200 కోట్లకు పైగా సుకేశ్ వసూలు చేశాడు. వారికి బెయిల్ రాకపోవడంతో ఆ భార్యలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత ఏడాది అతనిని అరెస్ట్ చేశారు. తన పేరు చార్జిషీటులో ఉందని విషయం తెలియగానే జాక్వెలిన్ ఇన్‌స్టాగ్రామ్‌లో డియర్ మీ అంటూ తనకి తానే ఒక పోస్టు పెట్టింది.



ముంబైలో తిరగనున్న డబుల్ డెక్కర్ ఎలక్ట్రిక్ బస్ ఇది. ఇలాంటి 900 బస్సులు త్వరలో దశలవారీగా అందుబాటులోకి రానున్నాయి. బుధవారం కొలాబాలో తీసిందీ ఫొటో.

స్వల్పకాలిక రుణాలపై 1.5% వడ్డీ రాయితీ

- రూ. 3 లక్షలలోపు వ్యవసాయ రుణాలకు వర్తింపు
- కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: వ్యవసాయ రంగంలో రుణ వితరణను పెంచాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. రూ.3 లక్షలలోపు స్వల్పకాలిక వ్యవసాయ రుణాలపై 1.5 శాతం వడ్డీ రాయితీ ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. కేంద్ర కేబినెట్ బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశమయ్యింది. ఈ భేటీ వివరాలను సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ మీడియాకు తెలియజేశారు. సాగు కోసం తీసుకున్న స్వల్పకాలిక రుణాలపై 1.5 శాతం వడ్డీ రాయితీని పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. 2022–23 నుంచి 2024–25 వరకూ అన్ని రకాల బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కంప్యూటరైజ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల నుంచి తీసుకున్న రూ.3 లక్షలలోపు రుణాలపై ఈ రాయితీ వర్తిస్తుందని అన్నారు. ఈ పథకం అమలు కోసం బడ్జెట్ కేటాయింపుల కంటే అదనంగా రూ.34,856 కోట్లు కేటాయించాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఎరువులపై రాయితీ రూ.2 లక్షల కోట్లు దాటే అవకాశం ఉందని ఠాకూర్ చెప్పారు. వాస్తవానికి వ్యవసాయ రుణాలపై వడ్డీ రాయితీని 2020 మే నెలలో నిలిపివేశారు. బ్యాంకులు 7 శాతం వడ్డీ రేటుతో రైతులకు రుణాలిస్తున్నాయి. ఆర్బీఐ ఇటీవల రెపో రేటును పెంచింది. దీంతో వ్యవసాయ రుణాలపై వడ్డీ రేట్లు పెరగనున్నాయి. అందుకే వడ్డీ రాయితీని మళ్లీ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈసీజీఎల్ఎస్‌కు మరో రూ.50,000 కోట్లు

ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారంటీ స్కీమ్ (ఈసీజీఎల్ఎస్)కు 2022–23 కేంద్ర బడ్జెట్‌లో రూ.4.5 లక్షల కోట్లు కేటాయించారు. ఈ పథకానికి మరో రూ.50,000 కోట్లు ఇవ్వనున్నారు. అదనపు సొమ్మును కోవిడ్‌తో దెబ్బతిన్న ఆతిథ్య, అనుబంధ రంగాలకు రుణాలిస్తారు.

భారత్–ఫ్రాన్స్ ఒప్పందానికి ఆమోదం

భారత రవాణా రంగంలో అంతర్జాతీయ రవాణా వేదిక(ఐటీఎఫ్) కార్యకలాపాలకు ఊతం ఇవ్వడానికి భారత్–ఫ్రాన్స్ మధ్య కుదిరిన ఒప్పందానికి కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. 2022 జూలై 6న ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం రవాణా రంగంలో కర్బన ఉద్గారాలను తగ్గించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ఇకపై అందరికీ టీకేడీఎల్ డేటాబేస్

సంప్రదాయ విజ్ఞాన డిజిటల్ లైబ్రరీ(టీకేడీఎల్) డేటాబేస్‌ను ఇకపై కేవలం పేటెంట్ అధికారులే కాదు సామాన్యులు ఉపయోగించుకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ యూజర్లకు దశలవారీగా ఈ డేటాబేస్‌ను అందుబాటులోకి తీసుకొస్తారు. చందారూపంలో రుసుము చెల్లించి వాడుకోవచ్చు.

బీజేపీ పార్లమెంటరీ బోర్డు నుంచి
గడ్కరీ, చౌహాన్ ఔట్



గడ్కరీ



శివరాజ్‌సింగ్

- కె.లక్ష్మణ్, యడియూరప్ప ఇన్
- సంస్థాగతంగా భారీ మార్పులు
- ప్రతిఫలించిన ప్రాంతీయ వైవిధ్యం

సాక్షి, న్యూఢిల్లీ: త్వరలో రానున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు తదితరాలను దృష్టిలో ఉంచుకుని భారీ సంస్థాగత మార్పుచేర్పులకు బీజేపీ తెరతీసింది. పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన పార్లమెంటరీ బోర్డును పునర్ వ్యవస్థీకరించింది. కేంద్ర మంత్రి, మాజీ అధ్యక్షుడు నితిన్ గడ్కరీ (65), మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (63)లను బోర్డు నుంచి తప్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని తదితర 11 మంది అత్యున్నత స్థాయి నేతలు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యులుగా ఉంటారు. వీరంతా సీఈసీ మెంబర్లుగానూ వ్యవహరిస్తారు. కర్నాటక మాజీ సీఎం యడియూరప్ప, తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యుడు కోవ లక్ష్మణ్, పంజాబ్ నేత, జాతీయ మైనారిటీల కమిషన్ చైర్మన్ ఇక్బాల్ సింగ్ లాల్‌పురా, కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్, సత్యనారాయణ జతియా, సుధా యాదవ్‌లకు బోర్డులో తాజాగా చోటు దక్కింది. వీరిలో లక్ష్మణ్, సుధా యాదవ్ ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు. జతియా ఎస్సీ కాగా సోనోవాల్ గిరిజన నేత. వచ్చే ఏడాది కీలకమైన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలున్నందున అక్కడ ప్రధాన సామాజిక వర్గమైన లింగాయత్ నేత యడియూరప్ప (77)కు స్థానం దక్కిందని భావిస్తున్నారు. ఇక్బాల్ రూపంలో ఒక సిక్కుకు తొలిసారిగా బోర్డులో స్థానం దక్కింది. బోర్డులో ప్రస్తుతం ఒక్క ముఖ్యమంత్రికి స్థానం లేకపోవడం విశేషం. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్ పేర్లు కూడా తొలుత విన్పించాయి. వీరిలో యాదవ్‌కు సీఈసీలో చోటు దక్కింది. అనంతకుమార్, జైట్లీ, సుష్మా స్వరాజ్‌ల మృతి, ఎం.వెంకయ్య, థావర్ గెహ్లోట్ నిష్క్రమణతో బోర్డులో చాలాకాలంగా ఐదు ఖాళీలున్నాయి.

ఎన్నికల కమిటీలోకి ఫడ్నవీస్

ఇక యాదవ్‌తో పాటు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఓం మాథుర్, మహిళా విభాగం చీఫ్ వనతి శ్రీనివాసన్‌లను సీఈసీలోకి తీసుకున్నారు. కేంద్ర మాజీ మంత్రులు జ్యుల్ ఓరం, షానవాజ్ హుస్సేన్, బీజేపీ మహిళా మోర్చా మాజీ చీఫ్ విజయ రత్నాకర్‌లకు ఉద్వాసన పలికారు. తాజా మార్పుల అనంతరం పార్లమెంటరీ బోర్డులో 11, సీఈసీలో 15 మంది సభ్యులున్నారు. శివసేన నేత తిరుగుబాటు నేపథ్యంలో ఏర్పాటైన కొత్త ప్రభుత్వ సారథిగా ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎం పగ్గాలు చేపడతారని అంతా భావించగా చివరి నిమిషంలో అనూహ్యంగా డిప్యూటీ సీఎం పదవితో సరిపెట్టుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఆయన్ను సీఈసీలోకి తీసుకోవడం ద్వారా సముచితంగా గౌరవించారని భావిస్తున్నారు. ప్రాంతీయ వైవిధ్యానికి కూడా రెండు విభాగాల్లోనూ సముచిత ప్రాధాన్యం దక్కిందని బీజేపీ నాయకుడొకరు అన్నారు. ''సోనోవాల్‌ది ఈశాన్య భారతం కాగా లక్ష్మణ్, యడియూరప్ప దక్షిణాది నేతలు. ఇక సుధా యాదవ్ పార్టీలో స్వశక్తితో ఎదిగిన నాయకురాలు' అని గుర్తు చేశారు.

నియామకాలపై మోదీ మార్కు

తాజా మార్పుచేర్పులపై పూర్తిగా మోదీ మార్కు కన్పించింది. బీజేపీ అధ్యక్షునిగా 2020లో జేపీ నడ్డా పగ్గాలు చేపట్టాక పార్లమెంటరీ బోర్డులో మార్పుచేర్పులు చేయడం ఇదే తొలిసారి. అంతకు ముందు 2014లో కేంద్రంలో అధికార పగ్గాలు చేపడుతూనే పార్టీని పూర్తిగా తన గుప్పెట్లోకి తెచ్చుకునే చర్యలకు నరేంద్ర మోదీ చకచకా తెర తీశారు. అందులో భాగంగా అమిత్ షా పార్టీ అధ్యక్షునిగా ఎన్నికవుతూనే పార్టీలో 'యువ రక్తాన్ని' నింపే పేరిట ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషీ వంటి కీలక సీనియర్ నేతలను బోర్డు నుంచి తొలగించారు. వారిని అంతగా ప్రాధాన్యం లేని నామమాత్రమైన పార్టీ మార్గదర్శక్ మండలి సభ్యులను చేయడంతో సరిపెట్టడం తెలిసిందే. కానీ తాజాగా బోర్డులోకి తీసుకున్న యడియూరప్ప, జతియా 75 ఏళ్లు పైబడ్డ వారు కావడం గమనార్హం.

ఇది గొప్ప గౌరవం: యడ్డి

బీజేపీ పార్లమెంటరీ బోర్డులో తనకు సభ్యుడిగా అవకాశం కల్పించడం పట్ల కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, పార్టీ సీనియర్ నేత బీఎస్ యడియూరప్ప ఆనందం వ్యక్తం చేశారు. పార్టీకి సంబంధించిన అత్యున్నత విధాన నిర్ణాయక మండలికి సేవలందించే అవకాశం రావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు బీజేపీ అగ్రనాయకత్వానికి యడియూరప్ప కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ట్వీట్ చేశారు. తనకు పెద్ద బాధ్యత అప్పగించారని అన్నారు. కర్ణాటకతోపాటు మిగిలిన దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ప్రధాని మోదీ తనకు సూచించారని తెలిపారు.

కేంద్రం అనుమతి ఉందా?

'బిల్కిస్' దోషుల విడుదలపై రాహుల్

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో ఉదంతంలో ప్రధాని మోదీపై విమర్శల దాడిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంచేసింది. సామూహిక అత్యాచారం, హత్యలకు సంబంధించిన ఈ కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న 11 మంది విడుదల విషయంలో గుజరాత్ ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ''ఈ నిర్ణయానికి మోదీ అనుమతి ఉందా? లేని పక్షంలో గుజరాత్ సీఎంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో ఆయన, కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పాలి'' అని బుధవారం డిమాండ్ చేశారు. మోదీ మాటలకూ చేతలకూ ఎంత తేడా ఉందో ప్రపంచమంతా గమనిస్తూనే ఉందన్నారు. ''ఐదు నెలల గర్భిణిపై సామూహిక అత్యాచారానికి, ఆమె మూడున్నరేళ్ల చిన్నారితో పాటు ఏడుగురు కుటుంబీకుల పాశవిక హత్యకు పాల్పడ్డ వాళ్లను స్వాతంత్ర్య అమృతోత్సవం నాడే విడుదల చేశారు. నారీ శక్తి అంటూ భారీ ప్రసంగాలు చేసిన వాళ్లు ఈ చర్యల ద్వారా మహిళలకు ఏం సందేశమిచ్చినట్టు?'' అంటూ మోదీ పంద్రాగస్టు ప్రసంగాన్ని ఉద్దేశించి ట్వీట్ చేశారు. సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తు చేసిన కేసుల్లో దోషులకు కేంద్రం అనుమతి లేకుండా క్షమాభిక్ష ప్రసాదించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉండదని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు.

'లంక రేవు'ను పర్యవేక్షిస్తున్నాం: జైశంకర్

బ్యాంకాక్: శ్రీలంక పోర్టు హంబన్‌టోటలో చైనా నిఘా నౌక యువాన్ వాంగ్ 5 రావడంతో భారత్ భద్రతకు భంగం వాటిల్లే పరిణామమైనా జరుగుతుందేమోనని పర్యవేక్షిస్తున్నామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ చెప్పారు. భారత్ థాయ్‌లాండ్ జాయింట్ కమిషన్ భేటీ సందర్భంగా జైశంకర్ మాట్లాడారు. మా పొరుగు దేశంలో జరిగే ఎలాంటి పరిణామాలైనా గమనిస్తూ ఉంటామని చెప్పారు. చైనాకు చెందిన హైటెక్ నౌక యువాన్ వాంగ్ 5 శాంతి, స్నేహ సంబంధాల మిషన్ అని ఆ నౌక కెప్టెన్ జాంగ్ హాంగ్‌వాంగ్ పేర్కొన్నారు.

'రోహింగ్యా శరణార్థులకు ఆశ్రయమిస్తాం'

న్యూఢిల్లీ: భారత్‌లోకి అక్రమంగా చొరబడిన రోహింగ్యా ముస్లింలలో కొందరికి ఢిల్లీలో ఆశ్రయం కల్పిస్తామని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ పురి ప్రకటించారు. బుధవారం తన ట్విట్టర్ ఖాతాలో హర్దీప్ ట్వీట్‌చేసిన కొద్దిగంటల్లోనే కేంద్ర హోం శాఖ అందుకు భిన్నమైన వివరణ ఇచ్చింది. అక్రమ వలసదారులకు నివాస సాయం చేసే ప్రసక్తే లేదని స్పష్టంచేసింది. మయన్మార్‌తో సంప్రదింపుల ప్రక్రియ, వలసదారులను వెనక్కి పంపే ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపింది. అంతకుముందు, బక్కర్‌వాలాలో ఆర్థికంగా వెనకబడిన వర్గాల కోసం నిర్మించిన ఫ్లాట్లలోకి వలసదారులను తరలిస్తామని హర్దీప్ అన్నారు. వీరికి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, ఢిల్లీ పోలీసులు రక్షణగా ఉంటారని చెప్పారు. దీనిపైనా హోం శాఖ భిన్నమైన ప్రకటన చేసింది. తెలంగాణ, కర్ణాటక, కేరళసహా 12 రాష్ట్రాల్లో, కశ్మీర్‌లో మొత్తంగా దాదాపు 40వేల మంది రోహింగ్యా ముస్లింలు అక్రమంగా ఉంటున్నారని, కొందరు అసాంఘిక కార్యకలాపాల్లో మునిగారని హోం శాఖ ఆందోళన వ్యక్తంచేసింది. ఢిల్లీలో నిర్బంధ కేంద్రాల్లో ఉన్న వలసదారులను అక్కడే ఉంచుతామని, వారు నిర్బంధ కేంద్రాలు దాటిపోకుండా చూడాల్సిన బాధ్యత ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానిదేనని సూచించింది. హోంశాఖ ప్రకటన తర్వాత మంత్రి హర్దీప్ పురీ మళ్లీ స్పందించారు. హోం శాఖ ప్రకటన అనేది వలసదారుల 'ప్రస్తుత స్థితి'ని మాత్రమే పేర్కొందని మరో ట్వీట్‌చేశారు.

కేజ్రీవాల్.. జాతీయస్థాయి ప్రచారం

లోక్‌సభ ఎన్నిక దృష్టిలో ఉంచుకుని మేక్ ఇండియా నం.1 కార్యక్రమానికి శ్రీకారం

న్యూఢిల్లీ: ఢిల్లీ, పంజాబ్‌లో అధికార పీఠంపై పాగా వేసిన ఆమ్ ఆద్మీ పార్టీ ఈసారి కేంద్రంలో సత్తా చాటాలని ముందడుగు వేసింది. దేశవ్యాప్తంగా మద్దతు కూడగట్టేందుకు లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే పరమావధిగా జనబాహుళ్యంలోకి దూసుకెళ్లనుంది. సుపరిపాలనకు పంచ సూత్రావళిని ప్రకటిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ 'మేక్ ఇండియా నంబర్ వన్' పేరిట జాతీయస్థాయి ప్రచార కార్యక్రమానికి త్రివర్ణ పతాకం ఊపి మరీ శ్రీకారంచుట్టారు. బుధవారం ఢిల్లీలోని తల్కటోరా స్టేడియం ఇందుకు వేదికైంది. ''భారత్ 'అభివృద్ధిచెందిన దేశం'గా అవతరించకుండా చేసి దశాబ్దాలుగా 'అభివృద్ధి చెందుతున్న దేశం'గా మిగిల్చిన పార్టీలపై ప్రజాస్వామ్యపోరాటంలో గెలుస్తాం. అధికార పగ్గాలు ఇకపై వారికి అప్పజెప్పేదిలేదు' అంటూ కేజ్రీవాల్ ప్రతిజ్ఞచేశారు. 'ప్రపంచ దేశాల్లో భారత్‌ను అగ్రభాగాన నిలుపుదాం. అందుకు మాతోపాటు మీరంతా కలిసిరండి' అంటూ పౌరులనుద్దేశిస్తూ ప్రసంగించారు. దేశ పురోభివృద్ధికి పాటుపడాలంటే బీజేపీ, కాంగ్రెస్.. మరే పార్టీ వారితోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధమంటూనే బీజేపీ, కాంగ్రెస్‌లపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. '75ఏళ్ల చరిత్రలో ఈ పార్టీలు కేవలం తమ , తమ స్నేహితుల ఇళ్లను వేలకోట్ల స్థిర, చరాస్తులతో నింపేశాయి. దేశం ఇంకా వీళ్ల చేతుల్లోనే ఉంటే దేశాభివృద్ధి మరో 75 ఏళ్లు వెనకే ఉండిపోతుంది' అని ఆరోపించారు. 'ఈ కార్యక్రమం రాజకీయమైందికాదు. భారతజాతి కోసం చేస్తున్న ఉద్యమం' అని అన్నారు. దేశ సర్వతోముఖాభివృద్ధికి ఐదు సూత్రాలను తప్పక ఆచరణలో పెట్టాలన్నారు.




పంచ సూత్రావళి

- ప్రతి చిన్నారికి ఉచిత, నాణ్యమైన విద్య అందించాలి
- పౌరులందరికీ ఉచితంగా మెరుగైన వైద్యం, ఔషధాలు అందివ్వాలి. ఉచితంగా పరీక్షలు చేసే రోగ నిర్ధారణ కేంద్రాల ఏర్పాటు.
- యువతకు ఉద్యోగ కల్పన
- మహిళలకు సమాన హక్కులు, సరైన భద్రత
- రైతుల పంటకు సరైన ధర దక్కేలా చూడాలి. వారి పిల్లలు సైతం తమది రైతు కుటుంబమని గర్వపడేలా చేయాలి. లాభాల పంట పండేలా, రైతుగా కొనసాగాలనే ఆకాంక్ష వారిలో పెంచాలి.

క్లుప్తంగా

రామనారాయణంలో కృష్ణాష్టమి వేడుకలు రేపు


శ్రీకృష్ణుని విగ్రహం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 19న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఆదే రోజు ఉదయం గోపూజ నిర్వహించడం జరుగుతుందని, సాయంత్రం 6 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉట్టికొట్టే ఉత్సవానికి సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆంగ్ల బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ


ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్న నైనా

నెల్లిమర్ల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మరింత సులభతరంగా ఆంగ్లం బోధించడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. మండలానికి చెందిన సగం మంది ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్ నైనా జె సెక్వైరా తొలిరోజు శిక్షణ అందించారు. ఫోనిక్స్ ఎలా బోధించాలో వివరించారు. రెండు బ్యాచ్‌లుగా నాలుగు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణను ఉపాధ్యాయులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

పీఏసీఎస్ అధ్యక్షురాలిగా రూపావతి



భోగాపురం: వైఎస్సార్‌సీపీ నాయకుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుందర గోవిందరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా.. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చొరవతో ఈయన స్థానంలో ఆయన భార్య సుందర రూపావతి పీఏసీఎస్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థికి నేత్ర పరీక్ష చేస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల(డెంకాడ): మండలంలోని పెదతాడివాడ గ్రామంలోనున్న మెర్సీ చిల్డ్రన్ హోమ్ విద్యార్థులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం కంటి పరీక్షలు నిర్వహించారు. అనాథ పిల్లలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించాలన్న ఆ సొసైటీ రాష్ట్ర విభాగం పిలుపు మేరకు 122 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. వీరిలో ఏడుగురికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. ముగ్గురికి తదుపరి వైద్యం అవసరమని గుర్తించి, పంపిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని అనాథ శరణాలయాలు, పాఠశాలల్లో చదువుతున్న పిల్లలకు భవిష్యత్తులో నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు డి.గౌరిశంకర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

21న జానపద కళాకారుల మహోత్సవం

విజయనగరం టౌన్: అంతర్జాతీయ జానపద కళాకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న పట్టణంలోని శిల్పారామంలో జానపద కళాకారుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ కన్వీనర్ పి.షణ్ముఖరావు తెలిపారు. స్థానిక ప్రజా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 21న ఉదయం 10 గంటలకు కోట జంక్షన్ వద్ద స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల చేతుల మీదుగా ర్యాలీని ప్రారంభిస్తామన్నారు. అనంతరం శిల్పారామానికి చేరుకుని అక్కడ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నిర్వహించే సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి చేతుల మీదుగా కళాకారులను సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్.రాజు, సుంకర సూర్యనారాయణ, రత్నాల బాలకృష్ణ, టివి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యతగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే కొలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి 35వ డివిజన్లోని, వీటీ అగ్రహారం ఎస్‌సీ కాలనీలో బుధవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ బొద్దాన అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఇంటింటికి వెళ్తూ ప్రభుత్వ పథకాలను అడిగి తెలుసుకోవడం, అర్హులైన వారందరికీ అందుతున్నాయా లేదా అని పరిశీలించడం శుభ పరిణామమన్నారు. మాట తప్పని మడమ తిప్పని నేతగా ముఖ్యమంత్రి అందరికీ పథకాలను అందిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నారన్నారు. అందుకు తగ్గట్లుగానే స్థానిక ఎమ్మెల్యే అనుక్షణం ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నానన్నారు. స్థానిక కార్పొరేటర్ చందక శ్రీనివాసరావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజాస్పందన అనూహ్యంగా లభిస్తుందన్నారు. సర్వేలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా నమోదు కావడం సంతోషదాయకమన్నారు. ప్రజలందరూ మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల సుగుణ, తాత్రాజు సునీత, పైలభవాని, గౌరీ శంకర్, రెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి బుధవారం పరిశీలించారు. గంటస్తంభం పరిసర ప్రాంతంలో అధికారులతో కలియతిరిగి తగు సూచనలు ఇచ్చారు. గంటస్తంభానికి మరింత ఆకర్షణ చేకూరే విధంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అనంతరం ప్రకాశం పార్కులో అభివృద్ధి చేస్తున్న ఈత కొలనును పరిశీలించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళా ఈతకొలనుగా తీర్చిదిద్దనున్నారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సుమారు కోటి రూపాయలతో రూపుదిద్దు కుంటున్న పార్కుకు అవసరమైన హంగులు తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కార్పొరేటర్ మరియు చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సీతారామమూర్తి, నగరపాలక సంస్థ ఏసీపీ మధుసూదన్ రావు, ఈఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రభుత్వాన్ని దీవించండి


వెంపడాం బీసీ కాలనీలో సంక్షేమ పథకాలు బుక్‌లెట్ అందజేస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స తదితరులు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ బెల్లాన

పూసపాటిరేగ: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేస్తూ జనరంజకమైన పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని నిండు మనస్సుతో దీవించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని తాళ్లపేట, వెంపడాం హరిజన కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఘన స్వాగతం పలుకుతూ గ్రామంలో ఇంటింటికి తీసుకెళ్లారు. సచివాలయం సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి వారి పొందుతున్న లబ్ధిని గూర్చి ప్రతి ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ, వలంటీరు వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రభుత్వం తమదే అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేరుస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కింది అన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా వున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి కాలినడకన వెళ్లినప్పుడు చూసిన సమస్యలుపై ఇప్పుడు స్పందిస్తున్న తీరు అద్భుతమని, అందుకే ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పడుతున్నారన్నారు.

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ అవనీతికి తావులేకుండా పారదర్శకంగా పాలన చేస్తున్నారని గుర్తు చేశారు. పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఎంపీపీ మండలవైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, మండలవైస్ ఎంపీపీ ఎస్.సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, మహంతి శ్రీనువాసురావు, మహంతి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ యాజమాన్యంపై చర్యలకు డిమాండ్

నెల్లిమర్ల(డెంకాడ): మండలంలోని చింతలవలసలో ఉన్న ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు, ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన దళిత విద్యార్థి గంటా శివ బంధువులు కళాశాల గేటు వద్ద బుదవారం ఆందోళన చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ గత నెల 19న కళాశాల వసతిగృహంలో శివ అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. ఆయన మృతిపై తల్లిదండ్రులకు, బంధువులకు ఎన్నో అనుమానాలున్నాయన్నారు. ఆత్మహత్యకు పాల్పడినట్లు యాజమాన్యం చెబుతున్నప్పటికీ మృతదేహంపై ఉన్న గాయాలపై ఎటువంటి సమాధానం చెప్పడం లేదన్నారు.

శివ మృతిపై పోలీసులు తగిన రీతిలో విచారణ చేపట్టి, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మృతికి కారణమైన దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కొడుకును కోల్పోయిన తల్లిదండ్రులకు యాజమాన్యం బాధ్యత వహిస్తూ రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌చేశారు. అనంతరం బంధువులతో కలిసి ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డీఎస్పీ త్రినాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శివ తండ్రి గంటా మల్లేష్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సిహెచ్.రామకృష్ణ, డి.రాము, హర్ష తదితరులు పాల్గొన్నారు.

విశాల్ మార్ట్‌లో అగ్ని ప్రమాదం


పొగలు కమ్ముకున్న ప్రాంతంలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ అధికారులు, సిబ్బంది

విజయనగరం క్రైమ్: స్థానిక ఆర్‌అండ్‌బీ రైతు బజార్ సమీపంలో ఉన్న విశాల్ మార్ట్‌లో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మార్ట్ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్యానల్ బోర్డులో పొగలు కమ్ముకున్నాయి. అదే మంటలు చెలరేగితే పెద్ద ప్రమాదం సంభవించి ఉండేదని, ఈ ప్రమాదంలో ఎంత నష్టం వాటిల్లిందో ఇంకా అంచనా వేయలేదని, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు వచ్చి, వివరాలివ్వాల్సి ఉంటుందని జిల్లా సహాయ అగ్నిమాపక శాఖాధికారి వి.సోమేశ్వరరావు పేర్కొన్నారు.

పచ్చిమేతతో అధిక పాల దిగుబడి

- జిల్లా పశు సంవర్ధక అధికారి రమణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న రమణ

విజయనగరం ఫోర్ట్: పాడి పశువులకు పచ్చిమేత వేయడం ద్వారా పాల దిగుబడి పెరుగుతుందని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వై.వి.రమణ పేర్కొన్నారు. స్థానిక వీటీ అగ్రహారంలో ఉన్న డివిజనల్ ట్రైనింగ్ సెంటర్‌లో బుధవారం 30 మంది పాడి రైతులకు పశువుల దాణా, పశుగ్రాసాలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాల దిగుబడి పెరగాలంటే మంచి పశువుల దాణా వేయాలని చెప్పారు. ప్రతి రైతు తనకు ఉన్న పొలంలో ఎంతో కొంత స్థలంలో పచ్చిమేత సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ ఎ.రామచంద్రరావు, ఏడీ సిహెచ్.నరసింహులు, వెటర్నటీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎల్.కృష్ణవేణి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై యువత అవగాహన కల్పించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ విక్రమాదిత్య పేర్కొన్నారు. స్థానిక ఎంఆర్ మహిళా కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నివారణలో యువత పాత్ర అనే అంశంపై విద్యార్థులకు ఒక నిమిషం మాట్లాడటం, డ్రాయింగ్, చిన్న కథల పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మేనేజర్ బాలాజీ, జిల్లా ఐసీటీసీ సెంటర్ల సూపర్‌వైజర్లు సాక్షి గోపాల్‌రావు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎమ్‌లకు హెల్త్ విజిటర్స్‌గా పదోన్నతి

భోగాపురం రూరల్: పోలిపల్లి పీహెచ్‌సీలో ఏఎన్ఎంలుగా పని చేస్తున్న సిహెచ్.సాయికుమారి, జి.లక్ష్మిలను గరివిడి, వేపాడ పీహెచ్‌సీలలో హెల్త్ విజిటర్స్‌గా పదోన్నతి లభించినట్టు వైద్యాధికారి తిరుపతి స్వామి బుధవారం తెలిపారు. కరోనా సమయంలో వారిద్దరు ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. సిబ్బంది వారిని అభినందించారు. ఎంపీహెచ్ఈఓ రమణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ కె.దుర్గారావు, సీహెచ్ఓ జయకుమారి, పీహెచ్ఎన్ పి.రాణి, సూపర్‌వైజర్ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు ప్రేమమందిరం వార్షికోత్సవం

విజయనగరం టౌన్: ఓం మందిరం సమితి అనుబంధ భజన మండలి అయిన స్థానిక దాసన్నపేట ఒరుగంటి వారి వీధిలో ఉన్న సత్య సాయిబాబా ప్రేమమందిరం ప్రథమ వార్షికోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ టి.రామకృష్ణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 5.20 గంటల నుంచి ఓంకారం, సుప్రభాతసేవ, నగర సంకీర్తనలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం పతాకావిష్కరణ, జ్యోతి ప్రజ్వలన, నారాయణసేవ, బాలవికాస్ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, దివ్య మంగళ హారతి వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులందరూ కార్యక్రమాల్లో పాల్గొని తరించాలని కోరారు.

'యాప్ ఉపసంహరించుకోవాలి'

విజయనగరం పూల్‌బాగ్: ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేస్ రికగ్నిషన్ యాప్‌ను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) ప్రతినిధులు ఇజ్జిరోతు రామునాయుడు, రమణ, సుబ్రహ్మణ్యం తదితరులు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సదరు యాప్ వల్ల ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై బోధన కుంటుపడుతుందన్నారు. అవసరమైతే పర్యవేక్షణ కోసం ఉద్యోగులను నియమించి, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

పుస్తకాల వితరణ

విజయనగరం టౌన్: స్పార్క్ సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక బాబామెట్ట ఖాదర్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, చెప్పులను బుధవారం సంస్థ అధ్యక్షురాలు భవానీపద్మనాభం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోదండరాం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సినీనటులు చిరంజీవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అఖిల భారత చిరంజీవి యువత సంస్థ జిల్లా అధ్యక్షుడు రాంకీ ఆధ్వర్యంలో స్థానిక చిన్నపల్లివారి వీధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీను, సూరిబాబు, సురేష్, రాము పాల్గొన్నారు.

డీపీఓకు సత్కారం


డీపీఓ ఇందిరా రమణకు జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీపీ మామిడి

విజయనగరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారిణిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా విజయనగరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి విచ్చేసిన ఇందిరా రమణను ఎంపీపీ మామిడి అప్పలనాయుడు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు వైస్ ఎంపీపీ నారాయణ, ఎంపీడీఓ వెంకటరావు, సిబ్బంది, అభినందనలు తెలిపారు.

ఘనంగా పెనుమత్స జయంతి


పెనుమత్స చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు తదితరులు

నెల్లిమర్ల/నెల్లిమర్ల రూరల్: మాజీ మంత్రి దివంగత పెనుమత్స సాంబశివరాజు 89వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన స్వగ్రామం మొయిదలోని స్మృతివనంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో పాటు వారి కుటుంబ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనుమత్స చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలోనూ పెనుమత్స జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో సాంబశివరాజు మనుమలు పెనుమత్స సంతోష్‌బాబు, అజిత్‌బాబు స్థానిక మారుతీ నర్సింగ్ హోమ్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పట్టణంలోని కుసుమంచి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలను అందజేశారు. 50 ఏళ్ల రాజకీయ చరిత్రలో మచ్చలేని నేత సాంబశివరాజు అని నాయకులు కొనియాడారు. ప్రస్తుత నేతలంతా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, అట్టాడ శ్రీనివాసరావు, యడ్ల గోవిందరావు, పతివాడ అప్పారావు, అట్టాడ కనకారావు, ధవళ లక్ష్మణరావు, మావూరి శంకర్రావు, ముడిమంచి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు


నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్యాధికారులు, సిబ్బంది

భోగాపురం రూరల్: మండలంలో ఈ నెల 16 నుంచి 30 వరకు మేకలకు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్టు మండల పశు వైద్యాధికారులు కమల కుమారి, రామరాజు తెలిపారు. బుధవారం కవులవాడ, ఆవాలు నందిగాం, రామచంద్రపేట రైతు భరోసా కేంద్రాల పరిధిలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు మండలంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గొర్రెలు, మేకల కాపరులు ఈ కార్యక్రమాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇప్పటి వరకు 2,350 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయడం జరిగిందన్నారు. గురువారం రావాడ, ముగడపేట రైతు భరోసా కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

సక్రమంగా అందని వైద్య సేవలు

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రాకోడు పీహెచ్‌సీలో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదని రాకోడు గ్రామ సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. రాకోడు పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు, పదుల సంఖ్యలో సిబ్బంది ఉన్నప్పటికీ అక్కడ వైద్యాధికారి ఎం.జగదీష్ సమయానికి విధులకు హాజరు కావడం లేదని ఆయన బుధవారం విలేకరులకు సమాచారం అందించారు. ఇదేమని ప్రశ్నిస్తే క్షేత్ర స్థాయి పర్యటనలు పేరు చెప్పి తప్పించుకుంటున్నారని అన్నారు. వాస్తవంగా ఇటు పీహెచ్‌సీకిగాని, అటు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లడం లేదన్న ఖచ్చితమైన సమాచారం ఉందని ఆయన తెలిపారు. రాకోడు పీహెచ్‌సీ అధికారుల సమయపాలనపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చిన ఉన్నతధికారులు తూతూమంత్రంగా దర్యాప్తు చేసి వదిలేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

నెల్లిమర్ల: ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు గ్రామాల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని ఎంపీడీఓ హెచ్.భానోజీరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశించిన ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హార్టికల్చర్ కింద 19.79 ఎకరాల్లో గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. గతేడాది రహదారులకు ఇరువైపుల నాటిన మొక్కల్లో చనిపోయిన వాటి స్థానంలో కొత్తవి నాటడానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వేతనదారులకు 90 పనిదినాలు పని కల్పించి, వేతనాలు అందే విధంగా చూడాలన్నారు. ఏపీఓ అరుణ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం


శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: భగవద్గీత మూడు ఆత్మల సారం సంపూర్ణంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ప్రబోధ సేవా సమితి - ఇందూ జ్ఞాన వేదిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక గురజాడ కళాభారతి ఆడిటోరియం ఆవరణలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకూ నిర్వహించే శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలకు రంగం సిద్ధం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు వి.శంకరరావు పేర్కొన్నారు. స్థానిక ఆడిటోరియం ఆవరణలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదురోజుల పాటూ నిర్వహించే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం తొలిరోజు పూజా కార్యక్రమాలు అతిథుల చేతుల మీదుగా నిర్వహిస్తామన్నారు. ఉదయం, సాయంత్రం పూజలతో పాటూ జ్ఞాన ప్రవచాలు, గీతా శ్లోకపోటీలు విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. 23న మంగళవారం పల్లకిపై శ్రీకృష్ణ పరమాత్మ ప్రతిమను ఉంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ప్రబోధ సేవా సమితి తరఫున విజయనగరం జిల్లాలో బొబ్బిలి, గజపతినగరం, రాజాం, చీపురుపల్లి మండలం గొల్లలపాలెంలో వేడుకలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాజేష్, సివిఎస్.నాయుడు, రాజు, వంశీ, సూరిబాబు, ప్రసాద్, కోటి, రాము, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి : సీఐ


బ్యాంక్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: ఇటీవల కాలంలో జరుగుతున్న దొంగతనాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక తోటపాలెం బాలాజీనగర్, బ్యాంక్ కాలనీ ప్రాంతాల్లో ప్రజలకు బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ఇళ్ల నుంచి నాలుగైదు రోజుల పాటూ వెళ్లాల్సి వచ్చినప్పుడు తప్పనిసరిగా సమీప పోలీసుస్టేషన్‌లో సమాచారమిస్తే ఆ ఇంటికి సీసీ కెమెరాలను ఉచితంగా అమర్చి, ఆ ప్రాంతంలో నిఘా పెడతామన్నారు. దొంగతనాలకు చెక్ పెట్టేందుకు ప్రతి ఒక్కరూ ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుడు మంతెన ఇకలేరు

ఏలూరుపాడుకు చెందిన వెంకటసూర్య నారాయణరాజు కన్నుమూత



కాళ్ల: పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధుడు, రైతు కార్యాచరణ సమితి గౌరవాధ్యక్షుడు మంతెన వెంకటసూర్యనారాయణరాజు (93) మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. రెండురోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన భీమవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన 13వ ఏట ఎస్‌ఎస్‌ఎల్‌సీ చదివే రోజుల్లోనే అంటే 1941లో వ్యష్టి, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోషలిస్ట్ పార్టీ యువజన సంఘాల నాయకుడిగా పనిచేశారు. సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కరివేణలో జరిగిన రైతు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యారు. సమాజ్‌వాది యువజన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. గ్రామ పంచాయతీ కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తూ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. 1986లో ఉద్యోగవిరమణ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లాలో పలువురు నాయకులతో కలిసి రాజకీయాలకతీతంగా రైతు కార్యాచరణ సమితిని స్థాపించారు. పోలవరం ప్రాజెక్టు సాధన కమిటీ చైర్మన్‌గా, రైతు కార్యాచరణ సమితి అధ్యక్షుడు, కృష్ణాడెల్టా పరిరక్షణ, పులిచింతల సాధన, కొల్లేరు అభయారణ్య పరిరక్షణ, రైతుల శ్రేయస్సు కోసం రైతు అధికార ప్రతినిధిగా, కో–ఆర్డినేటర్‌గా, గౌరవాధ్యక్షుడిగా 36 ఏళ్ల పోరాటం చేశారు. పలు అవార్డులు అందుకున్నారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఏలూరుపాడులో వెంకటసూర్యనారాయణరాజు ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. సూర్యనారాయణరాజు భార్య సుభద్రమ్మ ఏడాది కిందట మృతిచెందారు. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

సాక్షి, అమరావతి: ఏపీలో 47 ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ ఉన్న, అధిక ధరలకు విక్రయిస్తోన్న 12 దుకాణాలపై కేసులు నమోదు చేశారు. రైతులను మోసగిస్తూ ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు డీజీ శంఖబ్రత బాగ్చి చెప్పారు.

గిరిజన వివాహం.. పర్యాటక పరవశం

అరకు లోయలో ప్రత్యేక ఆకర్షణగా 'గిరి గ్రామ దర్శిని'

- పర్యాటకులకు పూర్తి ఆదివాసీ జీవన విధాన అనుభూతి
- గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో వివాహాలకు అవకాశం



సాక్షి, అమరావతి: ప్రకృతి అందాల నెలవైన అరకు లోయలో 'గిరి గ్రామ దర్శిని' ఆదివాసీ జీవన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తోంది. పచ్చటి కొండలు, లోతైన లోయలు, జాలువారే జలపాతాలు నడుమ అరకును సందర్శించే పర్యాటకులకు మరపురాని అనుభూతిని అందిస్తోంది. అన్నిటికి మించి గిరిజన సాంప్రదాయ వస్త్రధారణలో పర్యాటకులకు వివాహ వేడుక అవకాశాన్ని కల్పిస్తోంది. అరకులోని గిరిజన మ్యూజియానికి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న 'పెదలబుడు' గ్రామంలో ప్రభుత్వం ప్రత్యేకంగా గిరిజన గ్రామాన్ని నిర్మించింది. ఒడిశా సరిహద్దున గల ఈ ప్రాంతంలో దాదాపు 92 శాతం జనాభా గిరిజనులే.

గిరిజన ఆచారాల్లో ఒదిగిపోవచ్చు

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐటీడీఏ) ఆదివాసీల జీవనశైలి, వారి సంప్రదాయాలు, ఆచారాలు, ఆహారపు అలవాట్లను అర్థం చేసుకోవడానికి 'గిరి గ్రామ దర్శిని'ని తీర్చిదిద్దింది. ఈ గ్రామంలో పర్యాటకులకు సాధారణ స్థానిక ఆదివాసీ వాతావరణాన్ని అందిస్తూ సుమారు 15కి పైగా సంప్రదాయ గిరిజన గుడిసెలను ఏర్పాటు చేసింది. గిరిజనుల జీవన విధానాన్ని అనుభవించాలనుకునే వారు ఈ కాటేజీలను బుక్ చేసుకుని ఒకట్రెండు రోజులు బస చేయవచ్చు. ఈ సమయంలో పర్యాటకులు స్థానిక గిరిజన సమూహాలతో మమేకమై గడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివాసీల మాదిరిగానే కట్టు, బొట్టు, ఆభరణాలు ధరించి వారి ఆచార వ్యవహారాల్లో పాల్గొనవచ్చు. ఎద్దుల బండిపై సవారీ, రాగి అంబలి, విలు విద్య క్రీడా కేంద్రం, బొంగరం ఆట, కొమ్ము రాట్నం, థింసా ఆడుకునేందుకు ప్రత్యేక స్థలం, నాగలి పట్టి దుక్కి దున్నడం ఇలా ఒకటేమిటి అనేక అంశాలు గిరి గ్రామదర్శినిలో ఉన్నాయి. గిరిజనుల ఆట విడుపు అయిన కోడి పుంజులను పట్టుకోవడం కూడా పర్యాటకుల కార్యకలాపాల్లో భాగం చేశారు.

అక్కడే పెళ్లి చేసుకోవచ్చు

గిరి గ్రామ దర్శినిలో పర్యాటకులను ఆదివాసీ వివాహ పద్ధతి ఎక్కువగా ఆకట్టుకుంటోంది. వినూత్న రీతిలో వివాహం చేసుకోవాలనుకునే యువతకు, ఇప్పటికే వివాహమైన జంటలకు గిరిజన వివాహ అనుభూతిని అందిస్తోంది. పెదలబుడు ఎకో టూరిజం వెల్ఫేర్ సొసైటీ ఈ కాన్సెప్ట్‌ను రూపొందించింది. ఇందులో వధూవరుల తోపాటు, స్నేహితులు, బంధువులు కూడా గిరిజన సంప్రదాయ పద్ధతుల్లో ముస్తాబు చేస్తారు. గుడిసెను వెదురు, పూలు, ఆకులతో అలంకరిస్తారు. ఇక్కడి గిరిజన పూజారి గిరిజన సంప్రదాయాల ప్రకారం వివాహ తంతును నిర్వహించేందుకు మూడు నుంచి నాలుగు గంటల సమయం తీసుకుంటారు. ఆచారమంతా గిరిజన సంగీతంతో మార్మోగుతుంది. పెళ్లి విందు కూడా స్థానిక జీవన శైలిలో ఉంటుంది. క్యాంప్ ఫైర్ చుట్టూ థింసా నృత్యం చేస్తూ స్థానిక గిరిజన మహిళలు అతిథులను అలరిస్తారు. గిరిజన వివాహాలు పూర్తిగా మహిళలతో నిర్వహిస్తుండటం కూడా ఇక్కడి విశేషం. ఈ తరహా వివాహాన్ని కోరుకునేవారు రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.

నేరుగా జీవోలా?

- ప్రజా ప్రతినిధులపై కేసుల ఉపసంహరణల్లో సుప్రీం తీర్పు ప్రకారం మా అనుమతి తప్పనిసరి కదా
- జీవోలిచ్చిన తరువాత మమ్మల్ని అనుమతి కోరడం ఏమిటి?
- డేంజర్ జోన్‌లోకి వెళ్లారు.. ఈ చర్యలు కోర్టు ధిక్కారం కిందకు కూడా వస్తాయి
- మీరే ఓ పరిష్కారంతో కోర్టు ముందుకు రండి
- ప్రభుత్వానికి తేల్చి చెప్పిన హైకోర్టు.. విచారణ 23కి వాయిదా

సాక్షి, అమరావతి: ప్రజా ప్రతినిధులపై కేసులను ఉపసంహరిస్తూ ప్రభుత్వమే నేరుగా జీవోలు జారీ చేయడం ఏమిటని హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రజా ప్రతినిధులపై కేసులను ఉపసంహరించే ముందు హైకోర్టు అనుమతి తప్పనిసరని గుర్తు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కొందరు ప్రజా ప్రతినిధులపై కేసులను ఉపసంహరిస్తూ జీవోలు జారీ చేసి ఆ తరువాత తమ అనుమతి కోరిందని పేర్కొంది. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని, కేసుల ఉపసంహరణకు ముందు తమ అనుమతి కోరాలని, తాము అనుమతి ఇచ్చిన తరువాతే జీవోలు జారీ చేయాలని స్పష్టం చేసింది. అలా కాకుండా నేరుగా జీవోలు జారీ చేయడం ద్వారా ప్రభుత్వం డేంజర్ జోన్‌కి వెళ్లిందని వ్యాఖ్యానించింది. అంతేకాకుండా అలాంటి చర్యలు కోర్టు ధిక్కారం కిందకు వస్తాయంది. ఆ జీవోలను తాము కొట్టివేస్తే తదనుగుణ పర్యవసానాలు ఎలా ఉంటాయో తాము చెప్పజాలమని, అలాంటి పరిస్థితి తీసుకు రావద్దని సూచించింది. ఈ సమస్యకు ప్రభుత్వమే ఓ పరిష్కారంతో తమ ముందుకు రావాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను ఆగస్టు 23కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఇవీ వ్యాజ్యాలు...

వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలపై తమ అనుమతి లేకుండా కేసులను ఉపసంహరిస్తూ జీవోలు జారీ చేయడంపై హైకోర్టు సుమోటోగా విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఇదే అంశంపై ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైంది. తాజాగా ఎమ్మెల్యేలు మేకా అప్పారావు, రక్షణ నిధిపై కేసులను ఉపసంహరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై హైకోర్టు సుమోటోగా స్పందించింది. వీటన్నింటిపై సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వెంకటేష్ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవోలు జారీ చేసిందన్నారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది (హోం) వేలూరి మహేశ్వరరెడ్డి స్పందిస్తూ హైకోర్టు అనుమతి లేకుండా కేసులను ఉపసంహరించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పునరుద్ఘాటించారు. జీవోలు జారీ చేసినప్పటికీ హైకోర్టు అనుమతి తీసుకున్న తరువాతే కేసుల ఉపసంహరణ ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సుప్రీంకోర్టు చెప్పింది ఇది కాదని, హైకోర్టు అనుమతి తీసుకున్న తరువాతే జీవోలు ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. దీనికి ప్రభుత్వమే ఓ పరిష్కారం కనుగొనాలని సూచిస్తూ విచారణను వాయిదా వేసింది.

జగనన్న విదేశీ విద్యాదీవెన కొత్త పథకం


- ఈ పథకానికి, అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధం లేదు
- రాజకీయ లబ్ధికే చంద్రబాబు, టీడీపీ నేతల అబద్ధపు ప్రచారాలు
- మంత్రి మేరుగ నాగార్జున స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: విదేశీ విద్య పథకానికి అంబేడ్కర్ పేరు తొలగించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేరు పెట్టుకున్నారంటూ టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారంలో ఎంతమాత్రం నిజం లేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున స్పష్టం చేశారు. ఈ పథకం విషయంలో చంద్రబాబు, టీడీపీ నేతలు మరో కొత్త అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి, జగనన్న విదేశీ విద్యాదీవెన వేర్వేరు పథకాలని, వీటికి సంబంధించిన నియమాలు, విధి–విధానాలు వేర్వేరు అని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కేవలం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఉద్దేశించినదని, జగనన్న విదేశీ విద్యా దీవెన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటుగా ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారందరికీ సంబంధించిన పథకమని వివరించారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం కేవలం 15 దేశాలకు మాత్రమే పరిమితమైన పథకమని, దీనిద్వారా ఏడాదికి ఎస్సీల్లో 300 మందికి, ఎస్టీల్లో 100 మందికి మాత్రమే అవకాశం కల్పించే వారని మంత్రి గుర్తు చేశారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో 1 నుంచి 200 వరకూ క్యూఎస్ ర్యాంకులు కలిగిన వర్సిటీలన్నిటికీ వర్తిస్తుందని, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, అగ్రకులాల వారు ఎంతమంది అర్హత సాధిస్తే అంతమందికీ విదేశీ విద్యను అందించే అవకాశాలను కల్పించే పథకం అని వివరించారు. అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించే వారన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, అగ్రకులాలకు చెందిన పిల్లలు ఎవరైనా క్యూఎస్ ర్యాంకింగ్‌లో 1 నుంచి 100 లోపు ర్యాంకులు కలిగిన యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకుంటే కోటి రూపాయలైనా సరే ఆ ఫీజు మొత్తాన్ని, రీయింబర్స్‌మెంట్, క్యూఎస్ ర్యాంకుల్లో 101 నుంచి 200 లోపు కలిగిన యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకుంటే రూ.50 లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేసే పథకమని స్పష్టం చేశారు.

నేతలు అలసత్వం వీడాలి

నాలుగు నియోజకవర్గాల సమీక్షల్లో చంద్రబాబు



సాక్షి, అమరావతి: పార్టీ నేతలు అలసత్వం వీడాలని టీడీపీ అధినేత చంద్రబాబు సూచించారు. ప్రణాళిక ప్రకారం వ్యవహరిస్తూ.. చురుగ్గా పనిచేయాలని కోరారు. అవనిగడ్డ, పెనమలూరు, మార్కాపురం, సంతనూతలపాడు నియోజకవర్గాల ఇన్‌చార్జులతో ఆయన గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో విడివిడిగా మాట్లాడారు. ఎప్పుడైనా ఎన్నికలు రావచ్చని దూకుడుగా ఉండాలని కోరారు. వచ్చే ఏడాది పార్టీకి అత్యంత కీలకమని చెప్పారు. పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు, బాదుడే బాదుడు కార్యక్రమం, ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నేతల పనితీరుపై చర్చించారు. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఆయా నియోజకవర్గాలపై తన వద్ద ఉన్న నివేదికల ప్రకారం వారి పరిస్థితిని వివరించారు. రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల్లో నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని, స్థానిక సమస్యలపైనా పోరాటం చేయాలన్నారు. ప్రజల సమస్యలను జగన్ సర్కారు పూర్తిగా గాలికి వదిలేసిందని, దీనిపై నిరసనలు తెలపాలని సూచించారు.

మాంసాభివృద్ధి కార్పొరేషన్ ఎండీకి బెయిలబుల్ వారెంట్

హైకోర్టు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : ఏపీ రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కోర్టు ముందు హాజరు కాకపోవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎండీకి బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. రూ.10 లక్షల పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. వారెంట్‌ను అమలు చేయాలని కృష్ణా జిల్లా ఎస్పీకి ఆదేశాలిచ్చింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 15కి వాయిదా వేసింది. ఆ విచారణకు కోర్టు ముందు హాజరై తీరాలంది. ఒకవేళ హాజరు కాకుంటే నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తామని తేల్చి చెప్పింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది. మాంసం, పౌల్ట్రీ కార్పొరేషన్‌లో పనిచేసిన తమచే.. ఆ కార్పొరేషన్ రద్దు తర్వాత బలవంతంగా స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకునేలా చేయడంతో పాటు, తమకు రావాల్సిన బకాయిల్లో కోత విధించారంటూ ఇద్దరు ఉద్యోగులు 2000లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మాంసం, పౌల్ట్రీ కార్పొరేషన్ ఎండీ దాఖలు చేసిన ప్రొసీడింగ్స్‌ను కొట్టేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు, పిటిషనర్ల అభ్యర్థనను కొంత మేరకే ఆమోదించింది. వారికి చెల్లించాల్సిన బకాయిలను 8 వారాల్లో చెల్లించాలంటూ మాంసాభివృద్ధి సంస్థను హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఆ ఇద్దరు ఉద్యోగులు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. గత నెల 27న ఈ అప్పీల్‌పై విచారణ జరిపిన సీజే ధర్మాసనం, మాంసాభివృద్ధి కార్పొరేషన్ ఎండీని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశాలిచ్చింది. అయితే ఈ ఆదేశాల మేరకు ఎండీ బుధవారం తమ ముందు హాజరుకాకపోవడంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది.

విభిన్న ప్రతిభావంతుల హాస్టల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, బధిరులకు సంబంధిత హాస్టళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖ నుంచి బుధవారం ఓ ప్రకటన విడుదలైంది. 2022–23 విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి, ఆపై విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న వారికి శిక్షణ కాలంలో వసతి గృహంలో వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు డీఆర్‌డీఏ కాంప్లెక్స్, శ్రీకాకుళంలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 08942–240519, సెల్ 8074777210, 7286036421లకు సంప్రదించాలని సూచించారు.

వాల్తేరు, పెందుర్తిలో..

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): పెదవాల్తేరు, పెందుర్తి వసతి గృహాల్లో 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు. ఈ మేరకు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తూ బుధవారం ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వాల్తేరు వసతి గృహంలో 67, పెందుర్తి వసతిగృహంలో 47 ఖాళీలు ఉన్నట్లు పేర్కొంది. విశాఖతో పాటు విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలకు చెందిన శారీరక, బధిర కేటగిరీలకు చెందిన పురుష దివ్యాంగులు ఈ వసతి గృహాల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సూచించింది. వసతి, ఉచిత భోజనంతో పాటు ప్రభుత్వం అందించే అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. పూర్తి వివరాలకు 99484 97333(పెదవాల్తేరు హాస్టల్ వార్డెన్), 95054 94632(పెందుర్తి హాస్టల్ వార్డెన్)లో సంప్రదించవచ్చు.

'ఉపాధ్యాయులు మార్పును వ్యతిరేకించడం విడ్డూరం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ఇటీవల కాలంలో ప్రవేశ పెడుతున్న విధానాలను ఉపాధ్యాయులు వ్యతిరేకించడం అన్యాయమని, ఆంధ్రప్రదేశ్ బీసీ న్యాయవాదుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తూ అక్కడ బోధన, రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో హాజరు తదితర విషయాలపై నిరంతరం ఆయా యాజమాన్యాలతో చర్చిస్తుంటారని, అదే ఉపాధ్యాయులు తాము పనిచేసే పాఠశాలల్లో సరికొత్త విధానాలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న తమ పిల్లలకు ఆన్‌లైన్ తరగతుల కోసం స్మార్ట్ ఫోన్లు విరివిగా వాడేవారని, అదే ఉపాధ్యాయులు ప్రస్తుతం ఫేస్ రికగ్నేషన్ (ముఖ హాజరు) విధానంలో హాజరు నమోదుకు స్మార్ట్ ఫోన్ పరిజ్ఞానం లేదనడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. కోవిడ్ సమయంలో ఎలాంటి పనిలేకుండానే లక్షలాది రూపాయలు జీతాలుగా పుచ్చుకున్న ఉపాధ్యాయులు చిన్న చిన్న మార్పులను ఆహ్వానించలేకపోవడం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఉద్యోగ సంఘాల పేరుతో తమకున్న ఓటింగ్ బలం చూపించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, సామాన్య ఓటర్లను తాము ప్రభావితం చేయగలమనే భావనలో ఉన్నారని, ఇది సరైనది కాదని తెలిపారు. ప్రజలు నేడు ఎంతో వివేకంతో ఆలోచిస్తున్నారని తెలిపారు.

సాయం చేస్తే.. మాయం చేస్తారు!

- సరికొత్త మార్గాల్లో చోరీలకు పాల్పడుతున్న గ్యాంగ్
- సాయం చేసేందుకు చొరవచూపిన వారి వస్తువులే టార్గెట్
- ఇప్పటికే నాలుగైదు చోట్ల సెల్‌ఫోన్లు, నగదు కొట్టేసిన వైనం



అరసవల్లి:

సరిగ్గా 10 రోజుల క్రితం..

సమయం: సాయంత్రం 7.15 గంటలు..

ప్రదేశం : 80 అడుగుల రోడ్డు.. శ్రీకాకుళం

ఓ యువకుడు బైక్ మీద నుంచి అలా కిందపడిపోతూ కనిపించాడు. అదే రోడ్డులో అటువైపుగా వాకింగ్ చేసుకుంటూ వెళ్తున్న క్లోపల్లి వెంకటరమణమూర్తి అనే వ్యక్తి హుటాహుటిన వెళ్లి అతన్ని కిందకు పడిపోకుండా కాపాడే ప్రయత్నం చేశారు. ఇంతలో దగ్గరగా ఉన్న మరో యువకుడు వచ్చి రమణమూర్తి జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను చాకచాక్యంగా కొట్టేశాడు. అదే బైక్‌పై ఇద్దరూ తుర్రుమన్నారు. రమణమూర్తి తన జేబులో సెల్‌ఫోన్ మాయమైనట్లు గుర్తించారు. చుట్టూచూస్తే ఎవ్వరూ లేరు. లబోదిబోమంటూ అటు వైపుగా వాకింగ్ చేస్తున్న కొందరికి జరిగిన ఉదంతాన్ని వివరించారు. వారి సలహా మేరకు వారి సెల్ నుంచే 100 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించారు.

ఇలాంటి ఘటనలే జిల్లా కేంద్రంలో ఇప్పటికే నాలుగైదు జరిగాయి. ఇటీవల నరసన్నపేటలో ఇలాంటి ఘటన జరిగితే అందరూ లైట్‌గా తీసుకున్నారు. తాజాగా శ్రీకాకుళం నగరంలోని మాధవ మోటార్స్ వద్ద బ్యాటరీ షాపులో పనిచేస్తున్న ఇషాక్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. నక్కవీధిలో ఓ వ్యక్తికి చెందిన రూ.17 వేల నగదును జేబులోంచి కొట్టేశారు. నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద కూడా ఇలాంటి ఘటనలో ఓ యువకుడు తన విలువైన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు.

సెల్‌ఫోన్ కొట్టేశారు..

80 అడుగుల రోడ్డులో వాకింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో విష్ణు సహస్రనామాలను వింటూ నడుస్తున్నాను. శనివారం రాత్రి 7.15 గంటల సమయంలో ఓ యువకుడు బైక్ మీద నుంచి పడిపోతూ కనిపించాడు. కాపాడేందుకు వెళ్లాను. అతన్ని పట్టుకుని లేపుతుండగా ఇంకో వ్యక్తి నా సెల్‌ఫోన్‌ను కొట్టేశాడు. తర్వాత ఫోన్ పోయిందని గుర్తించాను. కొందరి సలహా మేరకు 100కి డయల్ చేసి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాను. ఇదేం ఘోరమో.. సాయం చేయడానికి వెళ్తే సెల్ కొట్టేశారు. – క్లోపల్లి వెంకటరమణమూర్తి, వ్యాపారి, ఎల్‌బీఎస్ కాలనీ

ప్రత్యేక దృష్టి పెడతాం..

వెంకటరమణమూర్తి లాంటి బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో దొంగలను గుర్తిస్తాం. నగరంలో చోరీ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. మహిళలు ఒంటరిగా బంగారు నగలతో బయటకు వెళ్లొద్దు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తే ఇబ్బందులు తగ్గుతాయి. – అంబేడ్కర్, సీఐ, వన్‌టౌన్

నేరగాళ్ల నయాపంథా..

దొంగతనాల్లో ఇదో కొత్త రకంగా కనిపిస్తోంది. ఒంటరిగా నడిచే మహిళల బంగారు నగలను స్నాచింగ్ చేస్తున్న ఘటనల మాదిరిగా.. ఒంటరిగా నడుస్తున్న పురుషుల నుంచి కూడా దోపిడీకి ఈ కొత్త వ్యూహం ద్వారా తెర తీశారు. 30–32 ఏళ్ల మధ్య వయసున్న కొందరు యువకులు ఇలా చోరీలకు పాల్పడుతున్నారు. దారిలో వెళ్తున్న వ్యక్తి పడిపోతుంటే మానవత్వంతో సాయపడే వారే వీరి టార్గెట్ అని జరిగిన ఘటనలు స్పష్టం చేస్తున్నాయి.

వరద బాధితులకు అండగా ఉంటా



పంటపొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, అధికారులు

హిరమండలం: వరద బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గులుమూరు గ్రామంలో అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. ఒడిశాలో ఇటీవల కురిసిన వర్షాలకు వంశధార నదికి వచ్చిన వరదనీటి ప్రవాహంతో దెబ్బతిన్న పంటపొలాలు, రహదారులను ఎమ్మెల్యే పరిశీలించారు. పొలాలు నీట మునగడంతో ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు వివరించారు. జరిగిన నష్టాన్ని అంచనావేసి ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో రవీంద్రబాబు, గులుమూరు సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారుడు తూలుగు తిరుపతిరావు, అల్లు శంకర్‌రావు, ఎంపీటీసీలు బి.గంగాధరరావు, తట్ల శంకర్‌రావు ఉన్నారు.

ఇంటర్నేషనల్ ఫిడే ఆర్బిటర్‌గా సనపల భీమారావు



వరల్డ్ చెస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డెవెర్కోవిచ్‌తో సనపల భీమారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన సనపల భీమారావు మరో అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా సేవలందిస్తున్న భీమారావు అంతర్జాతీయ ఫిడే ఆర్బిటర్‌గా అర్హత సాధించారు. వాస్తవానికి గత ఏడాది సీనియర్ నేషనల్ ఆర్బిటర్‌గా ఉత్తీర్ణత సాధించిన భీమారావు ఈ సంవత్సరం మార్చి నెలలో బెంగళూరులో నిర్వహించిన ఫిడే ఆర్బిటర్ సెమినార్‌లో పాల్గొని 80%పైగా మార్కులతో క్వాలిఫై అయ్యారు. భారత క్రీడాకారులతో సహా ఇతర దేశాల క్రీడాకారులు ఆడిన టోర్నమెంట్లలో నార్మ్‌లు సాధించాల్సి ఉంటుంది. భీమారావు 11 దేశాల క్రీడాకారులు పాల్గొన్న టోర్నమెంట్లలో ఆర్బిటర్‌గా చేసి నార్మ్‌లు సాధించారు. దీంతో ఈనెల 6వ తేదీన చెన్నైలో నిర్వహించిన ఇంటర్నేషనల్ చెస్ ఫెడరేషన్ (ఫిడే) కౌన్సిల్‌లో భీమారావు పేరును చేర్చి అప్రూవ్ చేశారు. వరల్డ్ చెస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్కెడీ డెవెర్కోవిచ్ ధృవీకరించిన ధ్రువ పత్రాన్ని వెబ్‌సైట్‌లో సైతం పొందుపరచడంతో పాటు ఆ వెబ్‌సైట్‌లో డెవెర్కోవిచ్ భీమారావును అభినందించారు. ఇకపై ఇంటర్నేషనల్ ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లలో సైతం చీఫ్ ఆర్బిటర్‌గా వ్యవహరించే అరుదైన అవకాశాన్ని జిల్లావాసి సనపల భీమారావు సొంతం చేసుకోవడం గమనార్హం. రాష్ట్ర, జిల్లా చెస్ సంఘ నాయకులు, డీఎస్ఏ అధికారులు, ఒలింపిక్, పీఈటీ సంఘ నాయకులు వివిద క్రీడా సంఘాల ప్రతినిధులు భీమారావుకు శుభాకాంక్షలు తెలిపారు.



మంకీ.. చాలా పెంకి

శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ జంక్షన్ సిగ్నల్ లైట్ వద్ద రెండు కోతులు వాహనదారులతో గిల్లికజ్జాలు ఆడాయి. వాటి చేష్టలు చూసి అటుగా వెళ్తున్న వారంతా నవ్వుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం







సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
గురువారం ॥ 18-8-2022

కిచెన్ టిప్స్

సాగిపోయినా పనికొస్తాయి





- చిన్నపిల్లల సాక్స్‌లు బిగుతయ్యాయని, పాత వైపోయాయని పడేస్తుంటాం. ఈ సాక్స్‌లను నూనె డబ్బాలకు తొడిగి ఉంచితే డబ్బాలను పట్టుకుని నూనె వేసేటప్పుడు జారకుండా గట్టిగా ఉంటాయి. చేతులకు నూనె తాలుకూ జిడ్డు కూడా అంటదు.
- కిచెన్ టేబుల్ మీద చిన్న కలశంలో మిరియాలు, సొంఠి, వెల్లుల్లి, అల్లం, ధనియాలు, ఇంగువ వంటివి దంచుతుంటాం. గట్టిగా దంచినప్పుడు శబ్దం వస్తుంటుంది. అయితే కలశానికి అడుగుభాగంలో సాక్స్‌ను తొడిగి, మిగిలిన సాక్స్ భాగాన్ని మడిచిపెడితే.. కలశంలో ఏం వేసి దంచినా ఎటువంటి శబ్దం వినిపించదు.
- డిష్‌వాష్ బార్‌ను సాక్స్‌లో పెట్టి కొద్దిగా తడిచేసి స్టవ్ పైభాగాన్ని రుద్దితే, నూనె జిడ్డు ఇట్టే పోతుంది. కూరమరకలు కూడా పోయి స్టవ్ తళతళలాడుతుంది. ఇలా చేయడం వల్ల స్టవ్‌ను పదేపదే నీటితో కడగాల్సిన అవసరం ఉండదు.



తాజా తీర్పు

పోల్చి తిడితే ఇంతే సంగతులు

భర్తల నోటికి తాళం.
భార్యల వేదనకు ఈ తీర్పు ఒక అవసరం.
ఇరుగింటామెతోనూ పొరుగింటామెతోనూ సినిమా హీరోయిన్‌తోనూ పోల్చి భార్యను చులకన చేస్తే సూటిపోటి మాటలంటే అది 'మానసిక క్రూరత్వం' కిందకే వస్తుందని కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది.
అటువంటి భర్తతో కాపురం చేయనవసరం లేదని విడాకులు మంజూరు చేసింది.
గతంలో ముంబై ఫ్యామిలీ కోర్టు కూడా 'ఆ నువ్వు పెద్ద మగాడివని' లాంటి గుచ్చే మాటలు మాట్లాడే భార్య నుంచి విడాకులు ఇప్పించింది.
భార్యాభర్తలు ఇలాంటి మాటలు అనుకోవడం ఎందుకు?

భార్యను చులకన చేయడం భర్తకు సమాజం నుంచి కుటుంబం నుంచి అంగీకారం పొందిన విషయంగా అనిపిస్తుంది. సినిమాల్లో పాత్రలు, టీవీల్లో స్కిట్‌లు భార్యను భర్త నానా విధాలుగా హేళన చేయడం చూపిస్తూనే ఉంటాయి. 'మసిబొగ్గులా ఉన్నావు', 'బోండాంలా ఉన్నావు', 'నిన్ను చేసుకునే బదులు అడవిలో మొద్దును చేసుకుని ఉంటే నయం', 'ఏదో ఒక మాయలో పడినట్టుగా నిన్ను చేసుకున్నాను. కాని నీలో ఏ ఆకర్షణ లేదు', 'ఆ ఎదురింటామెను చూడు ఎంత అందంగా ఉందో', 'ఇదంతా నా ఖర్మ'... ఇలాంటి మాటలు భర్త మాట్లాడితే భార్య లోలోపల బాధ పడటమో తిరిగి తగాదా పడటమో చేస్తూ ఉంటుంది. కాని 'ఇది అవసరమా నాకు' అని భార్య అనుకుంటే విడాకులు మంజూరు చేయడానికి ఈ కారణం సరిపోతుందని తాజాగా కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేరళ హైకోర్టు బెంచిలో జస్టిస్ కె.నరేంద్రన్, సి.ఎస్.సుధ ఈమేరకు తీర్పు వెలువరించారు.

ఏమిటి కేసు?

కేరళలో ఒక జంట 2009లో పెళ్లి చేసుకున్నారు. అప్పుడు ఆమెకు 26. అతనికి 29. పెళ్లయిన తర్వాత భర్త కొత్త పెళ్లికూతురు అని కూడా చూడక వెంటనే ఇతర స్త్రీలతో పోల్చసాగాడు. 'నీ కన్నా ఆమె బాగుంది', 'ఆమెకున్న మంచి జుట్టు నీకు లేదు' లాంటి కామెంట్లు చేసేవాడు. అతని తమ్ముడు పెళ్లి ప్రయత్నాలు చేస్తుంటే పెళ్లిచూపులకు అన్నగా హాజరయ్యి భార్యతో 'నా తమ్ముడు అదృష్టవంతుడు. మంచి అమ్మాయిలను వెతుకుతున్నాడు' లాంటి కామెంట్లు చేసేవాడు. దాంతో ఆమె కనీసం ఆరునెలలు కూడా అతనితో కాపురం చేయలేకపోయింది. జనవరిలో పెళ్లయితే నవంబర్‌లో విడాకులకు ఫ్యామిలీ కోర్టులో దరఖాస్తు చేసింది. ఫ్యామిలీ కోర్టు 'లైంగిక దూరాన్ని' కారణంగా చూపుతూ విడాకులు మంజూరు చేసింది. దాని మీద భర్త హైకోర్టుకు అప్లయి చేశాడు. కేరళ హైకోర్టు కూడా తాజాగా విడాకులే సబబైనవిగా తీర్పు ఇచ్చింది.

మానసిక క్రూరత్వం

ఈ కేసులో విడాకులకు కనిపించే సగటు కారణాల కన్నా భర్త తన భార్యను ఇతర స్త్రీలతో పోల్చుతూ చిన్నబుచ్చడాన్నే హైకోర్టు ప్రధాన కారణంగా తీసుకుంది. దానిని 'మానసిక క్రూరత్వం'గా వ్యాఖ్యానించింది. అలాంటి క్రూరత్వంతో బంధం నిలవదు అని చెప్పింది. 'వారు మంచి వయసులో ఉన్న జంటే అయినా ఈ కేసు కొనసాగిన ఇన్నేళ్లుగా తిరిగి కలవలేదు. భాగస్వాములలో ఒకరు విడాకులకు దరఖాస్తు చేసి, ఏళ్ల తరబడి ఇద్దరూ విడిగా ఉండగా ఆ పెళ్లి కుటుంబాలకు, సంఘానికి చెప్పుకోవడానికి ఉంటుందిగాని నిజంగా మనలేదు' అని విడాకులు మంజూరు చేసింది.

భర్తను చిన్నబుచ్చినా అంతే!

అయితే 2013లో ముంబై ఫ్యామిలీ కోర్టులో భర్త తరఫు నుంచి ఇటువంటి తీర్పే ఇచ్చింది. భార్య భర్తను 'నువ్వు పెద్ద మగాడివిలే', 'నేను సరిగా ఏడ్చి ఉంటే మావాళ్లు నీకంటే తెలివైన, మంచి కుటుంబం నుంచి కుర్రాణ్ణి వెతికి ఉండేవారు', 'నాకు నువ్వు ఏమాత్రం సరి తూగవు' లాంటి మాటలతో బాధించేది. అప్పటికి వారికి పెళ్లయి పదేళ్లు. ఇద్దరు పిల్లలు. కాని భర్త అలసిపోయి ఆఫీసు నుంచి వస్తే 'ఒక ముద్దు ముచ్చట లేదు. మగాడివై తేగా' వంటి మాటలతో బాధించేది. ఏమైనా అంటే 'ఉరేసుకుని చస్తా' అని బెదిరించేది. ఈ మాటలన్నింటినీ కోర్టు 'మానసిక క్రూరత్వం'గా పరిగణించి విడాకులు ఇచ్చింది. ముఖ్యంగా 'ఆత్మహత్య బెదిరింపులు' భర్తకు నరక ప్రాయం అవుతాయని వ్యాఖ్యానించింది.

ఎందుకు ఈ మాటలు?

భార్యాభర్తల మధ్య ప్రేమ, స్నేహం, గౌరవం, సర్దుబాటు ధోరణి, అవగాహన, అర్థం చేసుకోవడం, బలహీనతలను గుర్తించడం, ఎదుటి వారికి ఏ పని నచ్చదో దానిని వదలిపెట్టడం... ఇవన్నీ ఉంటే తప్ప కాపురం సజావుగా సాగదు. పెళ్లయ్యాక ఒకరికొకరు సరిపడరు అని అనుకుంటే విడిపోవడం లేదా మౌనంగా కొనసాగడం మేలు. కాని మాటలు చాలా గాయం చేస్తాయి. నిజానికి అవి వంటి మీద పడే దెబ్బల కంటే తీవ్రమైనవి. మాటలతో హింసించి సంతృప్తి పడదామంటే కాలక్రమంలో ఆ బంధం మరింత పలుచనవుతుంది తప్ప గట్టి పడదు.

కాబట్టి తిడితే ఏమవుతుందిలే అని భార్య/భర్త అనుకోవద్దు. విడాకులకు అవి చాలు.

బ్యూటిప్స్

మేనిని మెరిపించే స్క్రబ్స్



ఎన్ని జాగ్రత్తలు పాటిస్తున్నప్పటికీ బ్లాక్ హెడ్స్ వస్తూనే ఉంటాయి. వీటివల్ల ముఖం డల్‌గా, కళావిహీనంగా కనిపిస్తుంది. వీటిని తీయించుకోవడం ఖర్చుతో కూడుకున్నదేగాక, సమయం కూడా వెచ్చించాల్సి ఉంటుంది. అయితే ఇంట్లో ఉండే దాల్చిన చెక్క, నిమ్మకాయ, పప్పు, పాలు, పంచదార, కొబ్బరి నూనె, ఉప్పుతో సులభంగా తొలగించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూద్దాం...

- చర్మంలో అతిముఖ్యమైన ప్రోటీన్ కొల్లాజెన్ విడుదలను మెరుగుపరచడంలో దాల్చిన చెక్క ప్రముఖ పాత్ర పోషిస్తుంది. చర్మం మీద ఏర్పడే రంధ్రాలను దాల్చిని తగ్గిస్తుంది. నిమ్మరసంలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మంమీద రంధ్రాలను లోతుగా శుభ్రం చేస్తాయి. అందువల్ల అరచెక్క నిమ్మరసంలో టీస్పూను దాల్చిన చెక్కపొడి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లాక్‌హెడ్స్ ఉన్న ప్రాంతంలో పూతలా వేసి పదిహేను నిమిషాలపాటు మర్దనా చేయాలి. తరువాత చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేస్తే బ్లాక్‌హెడ్స్ తగ్గుముఖం పడతాయి.
- పాలు చర్మానికి పోషణ అందిస్తే పప్పు దినుసులు బ్లాక్‌హెడ్స్‌ను వేళ్లతోసహా పీకేస్తాయి. ఎర్రకందిపప్పుని ఒక టేబుల్ స్పూను తీసుకుని నాలుగు గంటలపాటు నానబెట్టాలి. నానిన పప్పులో నీటిని తీసేసి రెండు స్పూన్ల పాలు పోసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా వేసి పదిహేను నిమిషాలపాటు మర్దన చేసి తరువాత కడిగేయాలి. ఇలా చేయడం వల్ల పప్పులోని యాంటిఆక్సిడెంట్స్ చర్మానికి అందుతాయి. మర్దనతో బ్లాక్ హెడ్స్ పోతాయి. సున్నిత చర్మతత్వం కలిగిన వారికి ఈ స్క్రబ్ చక్కగా పనిచేస్తుంది.



- స్పూను పంచదారలో రెండు టేబుల్ స్పూన్ల కొబ్బరి నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాల పాటు మర్దన చేసి తరువాత కడిగేయాలి. పంచదార లోతుగా శుభ్రంచేసి మూసుకుపోయిన రంధ్రాలను తెరవడంతోపాటు, మృతకణాలను తొలగిస్తుంది. కొబ్బరి నూనెలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంతోపాటు, మృదువుగా మారుస్తాయి.
- అరచెక్క నిమ్మరసంలో అరటీస్పూను సాల్ట్‌వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదినిమిషాలపాటు మర్దన చేసి చల్లని నీటితో కడిగేయాలి. ఈ స్క్రబ్ వదులుగా ఉన్న చర్మాన్ని బిగుతుగా మార్చడంతోపాటు, బ్లాక్‌హెడ్స్‌ను తొలగించి చర్మం కాంతిమంతంగా మెరిసేలా చేస్తుంది.

చేయూత


యాసిడ్ బాధిత మహిళలకు శ్రేయాస్ హ్యాంగవుట్ కేఫ్ కొండంత అండ

ఆత్మబలమే అసలైన అందం... ఆనందం

ఆ కేఫ్ వేడివేడి చాయ్‌లకు మాత్రమే ఫేమస్ కాదు. వేడి, వేడి చర్చలకు కూడా. ఎక్కడో ఏదో దిగులుగా ఉందా? అంతా శూన్యం అనిపిస్తుందా? అయితే అటు పదండి. దేశవ్యాప్తంగా ఎంతోమంది యాసిడ్ బాధిత మహిళలకు అంతులేని ధైర్యాన్ని ఇచ్చిన శ్రేయాస్ హ్యాంగవుట్ కేఫ్ ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది...

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలోని 'శ్రేయాస్ హ్యాంగవుట్' కేవలం రుచుల కేఫ్ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసం లేనివారికి అంతులేని ఆత్మస్థైర్యాన్ని, విశ్వాసాన్ని ఇచ్చే వేదిక. అభాగ్యుల కన్నీటిని తుడిచే చల్లని హస్తం. ఆపదలో ఉన్నవారికి చేయూత ఇచ్చి ముందడుగు వేయించే ఆత్మీయ మిత్రురాలు. యాసిడ్ ఎటాక్ సర్వైవర్స్ ఈ కేఫ్‌ను నడుపుతున్నారు.

దేశవ్యాప్తంగా ఉన్న ఎంతోమంది యాసిడ్ బాధిత మహిళలకు స్ఫూర్తి ఇచ్చిన 'శ్రేయాస్ హ్యాంగవుట్' తాజాగా మరో అడుగు ముందుకు వేసింది.

ప్రముఖ బ్యూటీ చైన్ సెలూన్ 'నేచురల్స్'తో కలిసి యాసిడ్ బాధిత మహిళలకు ప్రొఫెషనల్ బ్యూటీ కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సాధారణంగా ఈ కోర్స్ చేయడానికి డెబ్బై వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది.

శిక్షణ ఇవ్వడం మాత్రమే కాదు, వారు సొంతంగా బ్యూటీపార్లర్ ప్రారంభించడానికి అవసరమైన సహాయాన్ని కూడా అందిస్తారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అయిదు మంది మహిళలు శిక్షణ తీసుకున్నారు. వారిలో ఒకరు ఫరాఖాన్. ఒకప్పుడు ఆమెకు మేకప్ వేసుకోవడం అంటే ఎంతో ఇష్టం. అయితే భర్త యాసిడ్ దాడి చేసిన తరువాత అద్దంలోకి చూడాలంటేనే భయపడే పరిస్థితికి వచ్చింది.

'అందరు మహిళలలాగే నాకు కూడా అలంకరణ అంటే చాలా ఇష్టం. శుభకార్యాలకు వెళ్లడానికి ముందు ఎంతో హడావిడి చేసేదాన్ని. నా భర్త చేసిన దుర్మార్గం వల్ల మేకప్ అనే మాట వినబడగానే కన్నీళ్లు ధారలు కట్టేవి. అద్దం చూడడానికి భయమేసేది. ఇలాంటి నా మానసిక ధోరణిలో పూర్తిగా మార్పు తీసుకువచ్చి నన్ను బలమైన మహిళగా నిలబెట్టింది శ్రేయాస్. పూర్వంలాగే ఇప్పుడు నేను మేకప్ విషయంలో శ్రద్ధ చూపుతున్నాను. ఏ తప్పు చేశానని భయపడాలి? ఎవరికి భయపడాలి!' అంటుంది ఫరాఖాన్.

28 సంవత్సరాల కుంతి సోని డిమాండ్ ఉన్న నెయిల్ ఆర్ట్‌లో శిక్షణ తీసుకుంది. ఒక సినిమా కోసం బాలీవుడ్ కథానాయిక దీపికా పదుకొణెతో కలిసి పనిచేసింది.

'యాసిడ్ బాధితులకు ఉపాధి దొరకడం ఒక ఎత్తైతే, అందమైన ఆనంద జీవితం మరో ఎత్తు. యాసిడ్ బాధితురాలైన నేను మేకప్ వేసుకుంటే నలుగురు చులకనగా మాట్లాడతారేమో...అనే భావనతో చాలామంది అలంకరణ అనే అందమైన సంతోషాన్ని తమ ప్రపంచం నుంచి దూరం చేసుకుంటున్నారు. అలాంటి వారికి శ్రేయాస్ కొత్త ధైర్యాన్ని ఇచ్చింది' అంటుంది సోని.

ఘాజీపూర్‌కు చెందిన రూపాలి విశ్వకర్మ సినిమా రంగంలో మేకప్–ఆర్టిస్ట్ కావాలని బలంగా అనుకుంటుంది. కొన్ని ప్రాంతీయ చిత్రాలలో చిన్న చిన్న పాత్రలు వేసిన రుపాలి ఆర్టిస్ట్‌గా నిలదొక్కుకోకముందే ఆమెపై గుర్తు తెలియని వ్యక్తి యాసిడ్ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో ఆమె ఒక కన్ను పూర్తిగా దెబ్బతింది.

ఆమె రంగుల కల నల్లగా మసక బారింది.

ఒకప్పుడు కళ్లముందు సుందర భవిష్యత్ చిత్రపటం తప్ప మరేది కనిపించేది కాదు.

దాడి తరువాత ఎటుచూసినా దుఃఖసముద్రమే!

'బయటి వాళ్ల నుంచి మాత్రమే కాదు ఇంటివాళ్ల నుంచి కూడా నన్ను పట్టించుకోని నిర్లక్ష్య ధోరణి ఎదురైంది. ఒక మూలన కూర్చొని జీవితాన్ని వెళ్లదీయి అన్నట్లుగా ఉండేవి వారి మాటలు. అయితే శ్రేయాస్‌తో పరిచయం అయిన తరువాత నాలో ధైర్యం పెరిగింది. మరుగున పడిన కలలు మళ్లీ ఊపిరి పోసుకున్నాయి. నేను మేకప్–ఆర్టిస్ట్‌గా రాణించడం మాత్రమే కాదు, ధైర్యం లోపించి దారి కనిపించని యువతులకు ధైర్యం ఇవ్వాలనుకుంటున్నాను' అంటుంది రుపాలి.

శ్రేయాస్ సరికొత్త ముందడుగు ద్వారా 'అలంకరణ, అందం అనేవి మనకు సంబంధించిన మాటలు కావు' అనే దుఃఖపూరిత నిరాశానిస్పృహలకు కాలం చెల్లుతుంది. 'ఆత్మబలమే అసలైన అందం, ఆనందం' అనుకునే కొత్త కాలం ఒకటి వస్తుంది.

సైబర్ టాక్



వాట్సాప్ స్కామ్ చా(చీ)టింగ్

తెలియని వ్యక్తులతో చేసే చాటింగ్‌లు, సీనియర్ అధికారుల ఫొటోలను ఉపయోగించి డిజిటల్ ప్రొఫైల్స్‌ని సృష్టించడం, డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయమని కోరడం, లింక్స్ ద్వారా వివరాలను రాబట్టడం, స్క్రీన్ షేరింగ్‌లు చేయించడం.. వంటి ఎన్నో మోసాలకు వాట్సాప్ అతి పెద్ద వేదికయ్యింది.

ప్రపంచ వ్యాప్తంగా రెండు బిలియన్లకు పైగా వినియోగదారులు ఉన్న వాట్సాప్ ఫేస్‌బుక్ తర్వాత అందరూ అత్యధికంగా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లలో రెండవది. అయితే, అన్ని ప్రముఖ ప్లాట్‌ఫారమ్‌లు, యాప్‌ల మాదిరిగానే మోసగాళ్లు, దొంగల రూపంలో కూడా వాట్సాప్ ద్వారా ప్రమాదం పొంచి ఉంది. వాట్సాప్ ప్రధాన ఫీచర్ టెక్స్టింగ్ అయితే, వాట్సాప్ మిమ్మల్ని స్టేటస్‌లను క్రియేట్ చేయడానికి, వాయిస్ మెసేజ్‌లను పంపడానికి, మీ లోకేషన్‌ను షేర్ చేయడానికి, వాయిస్, వీడియో కాల్స్ చేయడానికి కూడా ఉపయోగపడుతుంది. ఈ యాప్‌కు ఉన్న ఆదరణ వల్ల మీ ఫోన్ నంబర్ తెలిసిన ఎవ్వరైనా మీకు మెసేజ్ పంపవచ్చు. మోసం చేయడానికి కూడా. తాజా వాట్సాప్ స్కామ్‌ల గురించి తెలుసుకుంటే ఇబ్బందులను నివారించుకోవచ్చు.

టెక్స్ మెసేజ్‌తో వల

మోసగాళ్లు అధికారిక వెబ్‌సైట్ నుండి సంస్థ, ఉద్యోగుల గురించి అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత, ఏదైనా వెబ్‌సైట్, సోషల్ మీడియా సైట్‌లు, ఇ–మెయిల్, మెసెంజర్ యాప్ మొదలైన వాటి నుండి సీనియర్స్ ఫొటోలను సేకరిస్తారు. కింది అధికారులను మోసగించడానికి వాటిని ఉపయోగిస్తారు. మోసగాడు మొదట నమ్మదగిన సంభాషణను ప్రారంభిస్తాడు. వారి ఫోన్ పోయిందనో, పాడైపోయిందనో కొత్త ఫోన్ నుండి మెసేజ్ చేస్తున్నట్టు చెబుతారు. చెప్పిన ఖాతాకు డబ్బును బదిలీ చేయమని అడిగే ముందు, తమకు డబ్బు ఇబ్బంది ఉందని, చాలా అర్జంట్ అని చెబుతారు.

వాట్సాప్ వెరిఫికేషన్ స్కామ్

యాప్‌ని ఇన్‌స్టాల్ చేస్తున్నప్పుడు లేదా తిరిగి లాగిన్ చేస్తున్నప్పుడు, మీరు మీ వాట్సాప్ ఖాతాను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే మీ మొబైల్ ఫోన్‌కి ఆరు అంకెల కోడ్‌ని సెట్ చేసుకోవాలి. మీరు ఈ ధృవీకరణను ఒకే చేస్తే మీ ఖాతాను వేరొకరు దొంగిలించడానికి ప్రయత్నిస్తున్నట్లు లేదా మీ ఫోన్ యాక్సెస్‌ని కలిగి ఉన్నట్లు ఎరుపు రంగు ఫ్లాగ్ వస్తుంది. మీ ఖాతా సురక్షితంగా ఉందని నిర్ధారించుకోవడానికి వచ్చే మీ ఎసెమ్మెస్ కోడ్‌ను ఎప్పుడూ షేర్ చేయకండి.

వాట్సాప్ గోల్డ్

వాట్సాప్ గోల్డ్ మెంబర్‌షిప్ అనేది కొన్నేళ్లకు ఒకసారి వస్తున్న వాట్సాప్ స్కామ్. దీంట్లో ప్రముఖులు, ఉన్నత ప్రొఫైల్ అకౌంట్స్ కోసం రూపొందించిన మెసేజ్‌లు చూడవచ్చు. మీరు అప్‌గ్రేడ్ చేయకపోతే మీ ఫోన్ హ్యాక్ చేయబడుతుందని స్కామర్‌లు హెచ్చరించే మెసేజ్‌లను కూడా చూస్తారు. అయితే, వాట్సాప్ నుండి అలాంటివేవీ రిలీజ్ కావని గ్రహించాలి. వారు ఇచ్చిన లింక్ ద్వారా మీ ఫోన్‌ను స్వాధీనం చేసుకునే లేదా మీ సమాచారాన్ని దొంగిలించే మాల్వేర్ అని గుర్తించాలి. వారి లింక్‌పై క్లిక్ చేయడం వలన మీకు, మీకు అనుబంధంగా ఉన్న స్నేహితులు, కుటుంబ సభ్యులకు పెద్ద తలనొప్పిగా మారచ్చు.

కూపన్ స్కామ్‌లు

ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ డబ్బును పొదుపు చేయాలని కోరుకుంటారు. అయితే, మీకు ఇష్టమైన షాపింగ్ స్థలాలు, సూపర్ మార్కెట్‌లు, కూపన్‌లు, ప్రత్యేక ఆఫర్ల కోసం మీరు లింక్‌లపై క్లిక్ చేసేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. వాట్సాప్ గోల్డ్ మాదిరిగానే, లింక్‌లను ఓపెన్ చేయడం వలన సమస్యలకు దారి తీయవచ్చు.

వాట్సాప్ స్కామ్‌ల సారాంశం

ఈ సైబర్ నేరగాళ్ల పని విధానాన్ని తెలుసుకుంటే వారి ఉచ్చులో పడకుండా ఉండవచ్చు.

- స్కామర్ తన అత్యవసర విషయాన్ని మీకు తెలియజేస్తాడు. మిమ్మల్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు లేదా త్వరగా చెల్లించమని ఒత్తిడి చేస్తాడు.
- మీకు తెలియని ఫోన్ నంబర్ నుంచి వాట్సాప్ సందేశాన్ని పంపుతాడు
- స్కామర్ తమ నంబర్ మారిందని మీకు తెలియజేస్తాడు. వెంటనే డబ్బు గురించి మాట్లాడటం ప్రారంభిస్తాడు.
- మోసగాడి టెక్స్ మెసేజ్‌లో గ్రామర్‌లేని ఇంగ్లిష్ వాక్యాలు ఉంటాయి. అంటే, మోసగాడి మాతృభాష ఇంగ్లిష్ కాదు. లేదా వారు బాగా చదువుకున్నవారు కాదు.
- ఒక తెలియని ఖాతాకు లేదా యాప్‌కు డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయమని అడుగుతాడు.

అకౌంట్ సెట్టింగ్

- వాట్సాప్‌లో వేరొకరిలాగా నటించడం సులభం. మీరు ఎవరితో టెక్స్ చేస్తున్నారో చెప్పడం కష్టం. ఎందుకంటే మీరు చూడగలిగేది ఫోన్ నంబర్, ప్రొఫైల్ ఫోటో మాత్రమే. అయితే, కొంతమంది వినియోగదారులు ప్రొఫైల్ ఫోటోలను అప్‌లోడ్ చేయరు లేదా అది నిజమైనది కాకపోవచ్చు. అనుమానంగా ఉన్నప్పుడు, సదరు వ్యక్తిని అడగడం ఉత్తమం. లేదా మీరు ఎప్పుడైనా ముఖాముఖి మాట్లాడేందుకు, వారు ఎవరో నిర్ధారించుకోవడానికి వాట్సాప్ వీడియో చాట్ చేయవచ్చు.
- వాట్సాప్ ప్రైవేట్ అయినప్పటికీ, మీ నంబర్ తెలిస్తే ఎవరైనా మీకు మెసేజ్ చేయవచ్చు. స్కామర్లు వాట్సాప్ సందేశాలతో స్పామ్ చేయడానికి వందల, వేల ఫోన్ నంబర్‌లను సేకరిస్తుంటారు. మీకు తెలియని సందేశాలు వస్తే, వాటిని ఓపెన్ చేయకపోవడం మంచిది. అలాగే దానిని గుడ్డిగా ఫార్వార్డ్ చేయవద్దు. మీరు మెసేజ్‌ని నొక్కి పట్టి, 'రిపోర్ట్' ఆప్షన్‌ను ద్వారా వారిని బ్లాక్ చేయవచ్చు లేదా వాట్సాప్‌కి రిపోర్ట్ చేయచ్చు.
- మెసేజ్‌లను పూర్తిగా ఆపలేనప్పటికీ, నంబర్‌లను బ్లాక్ చేయడం, రిపోర్ట్ చేయడం, తొలగించడం ద్వారా మీరు స్పామర్‌లకు అడ్డుకట్టవేయచ్చు.
- మీ కాంటాక్ట్ లిస్ట్‌లో లేని వ్యక్తుల నుండి మెసేజ్‌లు వస్తున్నట్లయితే ఆన్‌లైన్‌లో ఉన్నప్పుడు మీ అకౌంట్ సెట్టింగ్‌లను సెట్ చేసుకోవచ్చు.

భద్రతా చిట్కాలు

- మీ సమాచారాన్ని ఎవరు చూడాలో వారి వరకే మీ వాట్సాప్ సెట్టింగ్ సెట్ చేసుకోవచ్చు.
- సమస్యాత్మక కంటెంట్, పరిచయాలను వాట్సాప్ సహాయ కేంద్రానికి తెలియజేయడం ద్వారా నియంత్రణ సులువు అవుతుంది. మీరు మీడియా వ్యూయర్ నుండి నేరుగా ఈ అకౌంట్‌కు తెలియజేయవచ్చు.

https://faq.whatsapp.com/2798237480402991/?locale=fi_FI

వాట్సాప్‌కు ఇలా తెలియజేయవచ్చు..

- ఆండ్రాయిడ్/ఐఫోన్‌లోలో వాట్సాప్‌లో మోర్ అనే ఆప్షన్ బటన్‌ను నొక్కండి (బటన్ ఒకదానిపై ఒకటి మూడు చుక్కలు వరుసగా ఉంటాయి). ఆపై సెట్టింగ్ సహాయం ఆప్షన్‌ను ఎంచుకోవచ్చు.
- మీకు అనుమానాస్పద, తెలియని నంబర్ నుంచి మెసేజ్ వచ్చినట్లయితే, మీరు వాటిని చాట్‌లోనే వాట్సాప్‌కి నివేదించవచ్చు. దీన్ని చేయడానికి ... వాట్సాప్‌లో నెంబర్ చాట్‌ను ఓపెన్ చేయండి. వారి ప్రొఫైల్ సమాచారాన్ని ఓపెన్ చేయడానికి నంబర్, గ్రూప్ పేరుపై నొక్కి, దిగువకు స్క్రోల్ చేయాలి. రిపోర్ట్ కాంటాక్ట్ లేదా రిపోర్ట్ గ్రూప్ లింక్‌పై నొక్కాలి.

మీరు పంపిన మెసేజ్‌లను, నంబర్ లేదా గ్రూప్‌ల నుండి సందేశాలను వాట్సాప్ అందుకుంటుంది. నియంత్రిస్తుంది.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్



రష్యాలో రవి దహియా సన్నాహాలు

వచ్చే నెలలో జరిగే ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ సన్నాహాల కోసం భారత స్టార్ రెజ్లర్ రవి దహియా (57 కేజీలు) రష్యాకు బయలుదేరి వెళ్లాడు. రష్యాలో 29 రోజులపాటు సాగే రవి శిక్షణ శిబిరం ఖర్చులన్నీ కేంద్ర క్రీడా శాఖ భరించనుంది. ఇటీవల కామన్వెల్త్ గేమ్స్‌లో రవి స్వర్ణం సాధించాడు. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం సాధించి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఈ ఢిల్లీ రెజ్లర్ విశ్వ క్రీడల్లో రజత పతకంతో మెరిశాడు.



కోల్‌కతా నైట్‌రైడర్స్ కోచ్‌గా చంద్రకాంత్ పండిత్

వచ్చే ఐపీఎల్ సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) జట్టుకు భారత మాజీ ప్లేయర్ చంద్రకాంత్ పండిత్ హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తారు. గత ఏడాది కేకేఆర్ జట్టుకు హెడ్ కోచ్‌గా ఉన్న న్యూజిలాండ్ మాజీ ప్లేయర్ మెకల్లమ్ ఇంగ్లండ్ జట్టుకు కోచ్‌గా వెళ్లడంతో ఈ స్థానం ఖాళీ అయింది. 60 ఏళ్ల పండిత్ దేశవాళీ క్రికెట్‌లో తన శిక్షణతో సంచలనం సృష్టించారు. పండిత్ శిక్షణలో ముంబై 2002, 2004లలో... విదర్భ 2018, 2019లలో... ఈ ఏడాది మధ్యప్రదేశ్ రంజీ చాంపియన్స్‌గా నిలిచాయి.

స్పోర్ట్స్ రీల్

ఈసారి ఎనిమిదో ర్యాంకర్‌పై...



మయామి: ఎఫ్‌టీఎక్స్ క్రిప్టో కప్ అంతర్జాతీయ ర్యాపిడ్ చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద వరుసగా రెండో విజయం నమోదు చేశాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ నాలుగో ర్యాంకర్ అలీ రెజా ఫిరూజా (ఫ్రాన్స్)ను ఓడించిన 17 ఏళ్ల ప్రజ్ఞానంద... రెండో రౌండ్‌లో ఎనిమిదో ర్యాంకర్ అనీశ్ గిరి (నెదర్లాండ్స్)పై గెలిచాడు. నేపాల్ సంతతికి చెందిన అనీశ్ గిరితో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 89వ ర్యాంకర్ ప్రజ్ఞానంద 2.5–1.5తో నెగ్గాడు. తొలి మూడు గేమ్‌లు 'డ్రా' కాగా నాలుగో గేమ్‌లో ప్రజ్ఞానంద 81 ఎత్తుల్లో గెలిచి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. ఈ గెలుపుతో ప్రజ్ఞానందకు 7,500 డాలర్లు (రూ. 5 లక్షల 94 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య రౌండ్ రాబిన్ లీగ్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. రెండో రౌండ్ తర్వాత ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ (నార్వే), ప్రజ్ఞానంద ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నారు.

ఆరు పతకాలతో...



సాక్షి, హైదరాబాద్: జాతీయ యూత్ సెయిలింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ సెయిలర్లు ఆరు పతకాలతో అదరగొట్టారు. మైసూర్‌లో ఇటీవల జరిగిన ఈ టోర్నీలో వైష్ణవి వీరవంశం, కొమరవెల్లి లాహిరి స్వర్ణ పతకాలు సాధించారు. తనూజా కామేశ్వర్, సాహిత్ బండారం రజత పతకాలు నెగ్గగా... లావేటి ఝాన్సీ ప్రియ, అమితవ వీరారెడ్డి కాంస్య పతకాలు గెలిచారు. యాట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కోచ్ సుహీమ్ షేక్ మాట్లాడుతూ భవిష్యత్‌లో హైదరాబాద్ సెయిలర్లు మరిన్ని పతకాలు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

మరో సిరీస్ వేటలో...

- నేడు జింబాబ్వేతో భారత్ తొలి వన్డే
- రాహుల్ సారథ్యంలో బరిలోకి టీమిండియా
- మధ్యాహ్నం గం. 12:45 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ప్రాక్టీస్‌లో జింబాబ్వే ఆటగాళ్లు

51

భారత్, జింబాబ్వే జట్ల మధ్య ఇప్పటివరకు మొత్తం 63 వన్డేలు జరిగాయి. భారత్ 51 మ్యాచ్‌ల్లో, జింబాబ్వే 10 మ్యాచ్‌ల్లో గెలిచాయి. రెండు మ్యాచ్‌లు 'టై'గా ముగిశాయి. జింబాబ్వే గడ్డపై జింబాబ్వేతో 23 మ్యాచ్‌లు ఆడిన భారత్ 19 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. సొంతగడ్డపై జింబాబ్వే చివరిసారి 2010లో భారత్‌పై వన్డేలో గెలిచింది.

హరారే: ఈ మధ్య విదేశానికెళ్లిన చోటల్లా విభిన్న కెప్టెన్‌లతో బరిలోకి దిగుతున్న టీమిండియా ఫలితాల్లో మాత్రం నిలకడగా సిరీస్ విజయాలను సాధిస్తోంది. ఇప్పుడు కూడా మరో ప్రయత్నం మరో సారథితో చేస్తోంది. జింబాబ్వే పర్యటనలో కేఎల్ రాహుల్ సారథ్యంలోని భారత్ నేడు తొలి వన్డే ఆడనుంది. ఈ పర్యటన జింబాబ్వేకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇస్తున్న 'ఆర్థిక బహుమతి'. కేవలం ఈ మూడు వన్డేల సిరీస్‌తో వచ్చే రాబడితోనే జింబాబ్వే బోర్డు సగం ఏడాదికి సరిపడా ఖర్చుల్ని వెళ్లదీసుకుంటుందంట! ఈ నేపథ్యంలో ఇక్కడ సిరీస్ ఆసక్తికరమనే కంటే కూడా... ఆతిథ్య బోర్డుకు ఆర్థిక పుష్టికరమని చెప్పాలి.

అందరి కళ్లు రాహుల్, చహర్‌లపైనే...

ఇక సిరీస్ విషయానికొస్తే జట్టు కంటే కూడా... కొత్త కెప్టెన్ రాహుల్‌కు అగ్ని పరీక్షలాంటిది. ఎందుకంటే టీమిండియా ఇటీవల ఏ దేశమేగినా... ఎందుకాలిడినా గెలుస్తూనే వస్తోంది. ఎటొచ్చి 'స్పోర్ట్స్ హెర్నియా' సర్జరీతో రెండు నెలలుగా ఆటకు దూరమైన రాహుల్ ఫిట్‌నెస్‌కే ఇది టెస్ట్! ఇక్కడ ఈ టాపార్డర్ బ్యాటర్ త్రిపాత్రాభినయం చేయాల్సి వస్తుంది. 100 ఓవర్ల పాటు మైదానంలో ఫిట్‌నెస్ నిరూపించుకోవాలి. సారథిగా జట్టును నడిపించాలి. టాపార్డర్‌లో బ్యాట్‌తో సత్తా చాటాలి. అలాగే మరో ఆటగాడు కూడా సవాలుకు సిద్ధమయ్యాడు. గాయంతో ఫిబ్రవరి నుంచి అసలు మైదానంలోకే దిగని దీపక్ చహర్ సుమారు ఆరు నెలల తర్వాత అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్నాడు. ఆసియా కప్, వన్డే ప్రపంచకప్‌ల కోసం అతన్ని పరిశీలించాలంటే అందుబాటులో ఉన్న ఈ కొద్ది మ్యాచ్‌ల్లోనే ఆల్‌రౌండర్‌గా నిరూపించుకోవాలి. ధావన్, గిల్, సామ్సన్ అంతా ఫామ్‌లోనే ఉన్నారు. బౌలింగ్‌లోనూ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్దీప్‌లతో భారత జట్టే బలంగా ఉంది. ప్రస్తుత భారత జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ తన వన్డే కెరీర్‌ను... అక్షర్ పటేల్, సంజూ సామ్సన్ తమ టి20 కెరీర్‌ను జింబాబ్వేలోనే ప్రారంభించారు.

జోరు మీదుంది కానీ...

ఈ నెలలోనే తమ దేశానికి వచ్చిన బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించిన జింబాబ్వే జోరుమీదుంది కానీ... భారత్‌లాంటి అసాధారణ ప్రత్యర్థితో ఎలా ఆడుతుందనేదే ఆసక్తికరం. ఏ రకంగా చూసినా కూడా టీమిండియాకు దీటైన ప్రత్యర్థి కాదు. కానీ సొంతగడ్డపై ఉన్న అనుకూలతలతో, ఇటీవలి విజయాలిచ్చిన ఆత్మవిశ్వాసంతో గట్టి పోటీ ఇచ్చేందుకు జింబాబ్వే తహతహలాడుతోంది. కెప్టెన్, వికెట్ కీపర్ రెగిస్ చకాబ్వా, సికందర్ రజా, ఇన్నోసెంట్ కయా చక్కని ఫామ్‌లో ఉన్నారు. అయితే బౌలింగ్ మాత్రం పేలవమనే చెప్పాలి. టీమిండియాలాంటి టాప్ ప్రత్యర్థిని ఎదుర్కోవాలంటే బౌలింగ్ విభాగం కూడా మెరుగవ్వాలి.



సిరాజ్, రుతురాజ్, ఇషాన్ కిషన్, గిల్

పిచ్, వాతావరణం

బంగ్లాదేశ్‌తో ఇటీవలే ఆడిన పిచ్ ఇది. బంగ్లాదేశ్ చేసిన 303, 290 భారీ స్కోర్లను అవలీలగా ఆతిథ్య జట్టు ఛేదించింది. బ్యాటర్లు చెలరేగిపోవడం ఖాయం కాబట్టి పరుగులకు పండగే. వర్షం ముప్పులేదు.

జట్లు (అంచనా)

భారత్: కేఎల్ రాహుల్ (కెప్టెన్), ధావన్, శుబ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్/సంజూ సామ్సన్, దీపక్ హుడా, శార్దుల్, అక్షర్, కుల్దీప్, దీపక్ చహర్, ప్రసిధ్ కృష్ణ/అవేశ్ ఖాన్, సిరాజ్.

జింబాబ్వే: రెగిస్ చకాబ్వా (కెప్టెన్), మరుమని, కైటానో, కయా, వెస్లీ మదెవెర్/సీన్ విలియమ్స్, సికందర్ రజా, టోని మన్యోంగా, ల్యూక్ జాంగ్వే, బ్రాడ్ ఇవాన్స్, విక్టర్ న్యాయుచి, చివాంగ.

38 టెస్టులు, 42 వన్డేలు, 61 టి20లు

2023 నుంచి 2027 వరకు భారత క్రికెట్ షెడ్యూల్

న్యూఢిల్లీ: రాబోయే ఐదేళ్ల కాలంలోనూ భారత పురుషుల క్రికెట్ జట్టు బిజీబిజీగా గడపనుంది. 2023 నుంచి 2027 వరకు భవిష్యత్ పర్యటనల కార్యక్రమాన్ని (ఎఫ్‌టీపీ) అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బుధవారం విడుదల చేసింది.

- ఐసీసీలో శాశ్వత సభ్యత్వం ఉన్న 12 దేశాలు రాబోయే ఐదేళ్లలో 173 టెస్టులు, 281 వన్డేలు, 323 టి20లతో కలిపి మొత్తం 777 మ్యాచ్‌లు ఆడనున్నాయి.
- భారత జట్టు విషయానికొస్తే టీమిండియా 38 టెస్టులు, 42 వన్డేలు, 61 టి20 మ్యాచ్‌లతో కలిపి మొత్తం 141 మ్యాచ్‌ల్లో పోటీపడనుంది. అయితే ఈ ఐదేళ్లలో భారత్, పాకిస్తాన్ మధ్య ఒక్క ద్వైపాక్షిక సిరీస్ లేకపోవడం గమనార్హం. ఈ రెండు జట్లు ఐసీసీ టోర్నీలలోనే తలపడతాయి.
- ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్లతో భారత్ ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లు ఆడుతుంది. ఆస్ట్రేలియాతో ఇప్పటివరకు నాలుగు టెస్టుల సిరీస్‌ను భారత్ ఆడేది. 1991 తర్వాత మళ్లీ ఆస్ట్రేలియాతో భారత్ ఐదు టెస్టుల సిరీస్‌కు సిద్ధమైంది.



'ఫిఫా'తో చర్చించండి

- కేంద్రంతో సుప్రీం కోర్టు
- విచారణ 22కు వాయిదా

న్యూఢిల్లీ: ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్ ఆతిథ్యం ఇవ్వబోయే అండర్–17 మహిళల ఫుట్‌బాల్ ప్రపంచకప్ మరో చోటికి తరలిపోకుండా గట్టి ప్రయత్నాలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని అత్యున్నత న్యాయస్థానం కోరింది. భారత్‌లో అండర్–17 ఫుట్‌బాలర్ల ప్రయోజనాల కోసం కేంద్రం తీవ్రంగా ప్రయత్నించాలని, అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా)తో చర్చించాలని బుధవారం జరిగిన విచారణ సందర్భంగా జస్టిస్ డీవై చంద్రచూడ్, ఏఎస్ బోపన్న, జేబీ పరిద్వాలాలతో కూడిన బెంచ్ సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్యపై 'ఫిఫా' విధించిన నిషేధాన్ని ఎత్తేసేందుకు ఏఐఎఫ్ఎఫ్ క్రియాశీలక సభ్యులు, కేంద్ర బృందం సమన్వయంతో పనిచేయాలని కోరిన సుప్రీం బెంచ్ విచారణను ఈ నెల 22కు వాయిదా వేసింది.

ఇంగ్లండ్ 116/6

లండన్: దక్షిణాఫ్రికాతో బుధవారం మొదలైన తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు తడబడింది. లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో వర్షం అంతరాయం కలిగించడంతో తొలి రోజు 32 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 వికెట్లు కోల్పోయి 116 పరుగులు సాధించింది. ఓలీ పోప్ (61 బ్యాటింగ్; 4 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీ చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో నోర్జే మూడు, రబడ రెండు వికెట్లు తీశారు.

తొలి రౌండ్‌లోనే సెరెనాకు చుక్కెదురు



సిన్సినాటి: తన టెన్నిస్ కెరీర్ చరమాంకంలో ఉందని అమెరికా దిగ్గజం సెరెనా విలియమ్స్ తన ఆటతీరుతో నిరూపించింది. ఇటీవల టొరంటో ఓపెన్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించిన 40 ఏళ్ల సెరెనా తాజాగా సిన్సినాటి ఓపెన్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సెరెనా 4–6, 0–6తో బ్రిటన్ టీనేజర్, గత ఏడాది యూఎస్ ఓపెన్ చాంపియన్ ఎమ్మా రాడుకాను చేతిలో పరాజయం పాలైంది. యూఎస్ ఓపెన్ తర్వాత టెన్నిస్‌కు వీడ్కోలు పలుకుతానని ఇటీవల సెరెనా ఒక మేగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. 1995లో ప్రొఫెషనల్‌గా మారిన సెరెనా ఇప్పటి వరకు 23 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించింది. 19 ఏళ్ల రాడుకానుతో జరిగిన మ్యాచ్‌లో సెరెనా రెండో సెట్‌లో ఒక్క గేమ్ కూడా గెలవలేకపోయింది.

సెరెనాపై ఒక సెట్‌ను 6–0తో గెలిచిన పదో ప్లేయర్‌గా రాడుకాను ఘనత వహించింది. 2017లో జొహానా కొంటా (బ్రిటన్) చేతిలో చివరిసారి సెరెనా ఒక సెట్‌ను 0–6తో కోల్పోయింది. సిమోనా హాలెప్ (రొమేనియా), అనాబెల్ మెదీనా గారిగెస్ (స్పెయిన్), వీనస్ విలియమ్స్ (అమెరికా), ప్యాటీ ష్నిదెర్ (స్విట్జర్లాండ్), జస్టిన్ హెనిన్ (బెల్జియం), జెలెనా జంకోవిచ్ (సెర్బియా), మేరీజో ఫెర్నాండెజ్ (అమెరికా), అలెక్సియా డెషామ్ బాలెరెట్ (ఫ్రాన్స్) కూడా సెరెనాపై ఒక సెట్‌ను 6–0తో గెలిచారు.

సినిమా



నాని, సాయిపల్లవి

ఆస్కార్ నామినేషన్‌కి

శ్యామ్ సింగరాయ్

● మూడు విభాగాల్లో పోటీ

నాని, సాయిపల్లవి, కృతీ శెట్టి కాంబినేషన్‌లో రూపొందిన 'శ్యామ్ సింగరాయ్' ఆస్కార్ పోటీకి వెళ్లింది. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వెంకట్ బోయినపల్లి నిర్మించిన ఈ పీరియాడికల్ ఫిక్షనల్ డ్రామా గత ఏడాది డిసెంబర్‌లో విడుదలై, మంచి ప్రేక్షకాదరణ దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇందులో శ్యామ్ సింగరాయ్ అనే అభ్యుదయ భావాలున్న బెంగాలీ రచయితగా, ఫిల్మ్ మేకర్‌గా రెండు పాత్రల్లో నాని నటన ప్రేక్షకులను మెప్పించింది. దేవదాసీగా సాయిపల్లవి నటనకు కూడా మంచి మార్కులు పడ్డాయి. ఈ చిత్రం మూడు విభాగాల్లో ఆస్కార్ నామినేషన్‌కి పోటీ పడుతోంది. పీరియాడిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, భారతీయ సంప్రదాయ క్లాసిక్ విభాగాల జాబితాలో నామినేషన్ పరిశీలనకు పంపారు. వచ్చే ఏడాది మార్చిలో 95వ ఆస్కార్ అవార్డుల వేడుక జరగనుంది. నామినేషన్ జాబితాని జనవరిలో ప్రకటించే అవకాశం ఉంది. మరి.. 'శ్యామ్ సింగరాయ్'కి మూడు విభాగాల్లోనూ నామినేషన్ దక్కుతుందా? కాని పక్షంలో ఏదో ఒక విభాగంలో అయినా దక్కించుకుంటుందా? అనేది చూడాలి.



తాప్సీ

డర్టీ పిక్చర్ హీరోయిన్ ఎవరు?

'ది డర్టీ పిక్చర్'కి సీక్వెల్ రానుందా? అంటే బాలీవుడ్ అవుననంటోంది. విద్యాబాలన్ కథానాయికగా ఏక్తా కపూర్ నిర్మించిన 'ది డర్టీ పిక్చర్' (2011) గుర్తుండే ఉంటుంది. విద్యా నటనకు జాతీయ అవార్డు కూడా వచ్చింది. మిలన్ లూథ్రియా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం దివంగత ప్రముఖ నటి సిల్క్ స్మిత జీవితంలోని కొన్ని అంశాలతో రూపొందినట్లుగా టాక్ వినిపించింది. అయితే దర్శక-నిర్మాతలు ఆ విషయాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఆ సంగతలా ఉంచితే 'ది డర్టీ పిక్చర్'కి సీక్వెల్ నిర్మించడానికి ఏక్తా కపూర్ సన్నాహాలు మొదలుపెట్టారని సమాచారం. మరో రచయితతో కలిసి కనికా ధిల్లాన్ ఈ సీక్వెల్‌కి స్టోరీ సిద్ధం చేస్తున్నారట.

సీక్వెల్‌లో విద్యాబాలన్ కాదు... సీక్వెల్‌లో విద్యాబాలన్ నటించడంలేదు. కాగా ఫస్ట్ పార్ట్ అప్పుడే కంగనా రనౌత్‌ని కథానాయికగా అడిగారు ఏక్తా కపూర్. అయితే కంగన తిరస్కరించారు. సీక్వెల్‌కి అడగ్గా.. మళ్లీ తిరస్కరించారట. ఈ నేపథ్యంలో తాప్సీ, కృతీ సనన్ వంటి తారలతో సెకండ్ పార్ట్ గురించి ఏక్తా చెప్పారట. ఇద్దరూ నటించడానికి సుముఖత వ్యక్తపరచారని టాక్. అయితే పూర్తి కథ రెడీ అయ్యాక మరోసారి కలుద్దామని కృతీ, తాప్సీతో అన్నారట ఏక్తా. మరి.. ఇద్దరిలో 'డర్టీ పిక్చర్ 2' హీరోయిన్ ఎవరు? అనేది కాలం చెబుతుంది. అలాగే తొలి భాగానికి దర్శకత్వం వహించిన మిలన్ మలి భాగాన్ని కూడా తెరకెక్కిస్తారా? అనేది కూడా తెలియాల్సి ఉంది.

వేరే కథ... 'ది డర్టీ పిక్చర్' విద్యాబాలన్ పాత్ర చనిపోవడంతో ముగుస్తుంది. మరి.. సీక్వెల్ కథ ఏంటి? అనే చర్చ జరుగుతోంది. అయితే పూర్తిగా వేరే కథ తయారు చేస్తున్నారట. ఈ ఏడాది చివరికి కథ సిద్ధమవుతుందని సమాచారం. వచ్చే ఏడాది ప్రథమార్ధంలో సీక్వెల్ షూటింగ్ ఆరంభించాలనుకుంటున్నారని భోగట్టా.



కృతీ సనన్

మీరే హీరోలాగ...



కిరణ్, సుధీర్‌బాబు, ఇంద్రగంటి, మహేంద్ర, కృతీ శెట్టి, సుధీర్‌బాబు

''కథకు న్యాయం చేసే దర్శకుడు ఇంద్రగంటిగారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాల్లో బెస్ట్ మూవీ 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి'. ప్రేమకథతో పాటు అద్భుతమైన ఫ్యామిలీ డ్రామా ఉన్న ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అని అన్నారు సుధీర్‌బాబు. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో సుధీర్‌బాబు, కృతీ శెట్టి జంటగా నటించిన చిత్రం 'ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి'. గాజులపల్లె సుధీర్‌బాబు సమర్పణలో బి. మహేంద్రబాబు, కిరణ్ బళ్లపల్లి నిర్మించిన ఈ సినిమా సెప్టెంబర్ 16న రిలీజ్ కానుంది. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మీరే హీరో లాగ..' అనే పాటని దర్శకుడు హను రాఘవపూడి రిలీజ్ చేశారు. హీరో సుధీర్‌బాబు మాట్లా డుతూ– ''నటీనటులు ఎంత ప్యాషనేట్‌గా సినిమాలు చేస్తారో జర్నలిస్టులు కూడా అంతే ప్యాషన్‌తో తమ పని చేస్తారు. అందుకే 'మీరే హీరో లాగ..' పాటని మీడియాకి అంకితం ఇస్తున్నాం. 'సిరివెన్నెల' సీతారామ శాస్త్రిగారిని మనం మిస్ కాకుండా చూసుకునే బాధ్యత రామజోగయ్య శాస్త్రిగారిపై ఉంది'' అన్నారు. ఇంద్రగంటి మోహనకృష్ణ మాట్లాడుతూ– ''నేను కూడా జర్నలిస్ట్‌గా పని చేశాను. ఒక ఇంటర్వ్యూ తరహాలో హీరో పరిచయ పాట ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచి వచ్చిందే 'మీరే హీరో లాగ..'. ఈ సాంగ్ క్రెడిట్ రామజోగయ్య శాస్త్రి, దినేష్, వివేక్‌లకు దక్కుతుంది'' అన్నారు. రచయిత రామజోగయ్య శాస్త్రి, సంగీత దర్శకుడు వివేక్ సాగర్, కెమెరామేన్ పీజీ విందా, ఆర్ట్ డైరెక్టర్ సాహి సురేష్ మాట్లాడారు.

1770 నేపథ్యంలో...



అశ్విన్ గంగరాజు

ప్రముఖ బెంగాలీ రచయిత బంకిం చంద్ర ఛటర్జీ రాసిన 'ఆనంద మఠ్' అనే నవలలోని 'వందే మాతరం' గీతం రాసి 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా 'ఆకాశవాణి' ఫేమ్ అశ్విన్ గంగరాజు దర్శకత్వంలో '1770' అనే చిత్రాన్ని ప్రకటించారు. శైలేంద్ర కుమార్, సుజయ్ కుట్టి, కృష్ణ కుమార్ .బి, సూరజ్ శర్మ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. అశ్విన్ గంగరాజు మాట్లాడుతూ– ''ఇది నాకు పెద్ద ఛాలెంజింగ్ సబ్జెక్ట్. విజయేంద్రప్రసాద్‌గారి కథకు సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను మాత్రమే నేను తెరకెక్కించాలి'' అన్నారు. విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ''1770లో భారత స్వాతంత్ర్య సమరం కోసం మనలో స్ఫూర్తిని రగిల్చిన యోధులు ఎందరో ఉన్నారు. వారి గురించి తెలియజేసే చిత్రమే 1770'' అన్నారు. ''హిందీ, తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ భాషల్లో ఈ సినిమా రూపొందిస్తున్నాం'' అన్నారు నిర్మాతలు.

మీకు నచ్చితే పది మందికి చెప్పండి

- ఆది సాయికుమార్



కల్యాణ్, సాయి కార్తీక్, పాయల్, ఆది, అడివి శేష్, తిరుపతి రెడ్డి

''పక్కా కమర్షియల్ చిత్రం 'తీస్ మార్ ఖాన్'. చాలా రోజుల తర్వాత అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ సినిమా చేశాను. మంచి స్క్రిప్ట్.. మంచి ఎమోషన్ ఉంది. మా చిత్రం మీకు నచ్చితే పది మందికి చెప్పండి'' అని ఆది సాయికుమార్ అన్నారు. కల్యాణ్ జి. గోగణ దర్శకత్వంలో ఆది సాయికుమార్, పాయల్ రాజ్‌పుత్ జంటగా రూపొందిన చిత్రం 'తీస్ మార్ ఖాన్'. డా. నాగం తిరుపతి రెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్‌లో ఆది సాయికుమార్ మాట్లాడుతూ– ''నన్ను కొత్తగా చూపించిన కల్యాణ్‌కు, ఎక్కడా రాజీపడని నాగం తిరుపతి రెడ్డిగారికి థ్యాంక్స్. మా సినిమాను చూసి ఆశీర్వదించండి'' అన్నారు. ''అన్ని సినిమాలు బాగుండాలి.. అందులో మన సినిమా కూడా ఉండాలి. ప్రేక్షకుల ఆశీర్వాదంతో 'తీస్ మార్ ఖాన్' కూడా విజయం సాధించాలి'' అన్నారు నటుడు సాయికుమార్. ''ఇలాంటి సినిమా తీసిన నిర్మాత ధైర్యానికి హ్యాట్సాఫ్. మా సినిమాని థియేటర్లో చూడండి'' అన్నారు కల్యాణ్ జి. గోగణ. ''ఆది కెరీర్‌లో ఇది బెస్ట్ సినిమా అవుతుంది'' అన్నారు నాగం తిరుపతి రెడ్డి. హీరోలు సిద్ధు జొన్నలగడ్డ, సుధీర్‌బాబు, నటుడు శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల కథే ఈ సినిమా

- వంశీధర్, లక్ష్మీనారాయణ



''రెండు రోజుల్లో జరిగే కథే 'ఫస్ట్ డే ఫస్ట్ షో' మూవీ. పవన్ కల్యాణ్ ఫ్యాన్ అయిన శ్రీను (శ్రీకాంత్ రెడ్డి) 'ఖుషీ' సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్లను సంపాదించి, ప్రేయసికి ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంటాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అనేది సస్పెన్స్'' అని దర్శకులు వంశీధర్ గౌడ్, లక్ష్మీ నారాయణ .పి అన్నారు. శ్రీకాంత్ రెడ్డి, సంచిత బాషు ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'ఫస్ట్ డే ఫస్ట్ షో'. 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ కేవీ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందించారు. వంశీధర్ గౌడ్, లక్ష్మీనారాయణ .పి దర్శకత్వం వహించారు. పూర్ణోదయ మూవీ క్రియేషన్స్ అధినేత ఏడిద నాగేశ్వరరావు మనవరాలు శ్రీజ నిర్మించారు. ఏడిద శ్రీరామ్ సమర్పిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ– ''జాతిరత్నాలు'కి రైటింగ్ విభాగంలో చేశాను. నాకు కామెడీ జోనర్ సినిమాలంటే ఇష్టం'' అన్నారు. వంశీధర్ గౌడ్ మాట్లాడుతూ– ''నేను డాక్టర్‌ని అయినా సినిమాలంటే ఇష్టంతో 'జాతిరత్నాలు'కి సహాయ దర్శకుడిగా చేశా. కొత్తవాణ్ణి కావడంతో 'ఫస్ట్ డే ఫస్ట్ షో'కి ఇద్దరు దర్శకులుంటే బాగుంటుందన్నారు అనుదీప్‌గారు. ఈ మూవీలో 'ఖుషీ' టికెట్ల కోసం హీరో పడే కష్టాలు సీరియస్‌గా, ఫన్నీగా అనిపిస్తాయి. నాకు నటనపై కూడా ఆసక్తి ఎక్కువ'' అన్నారు.

మిలటరీ నేపథ్యంలో...



నజీరుద్దీన్, సీతా మహాలక్ష్మి

''ఎమోషనల్, ఫ్యామిలీ, మిలటరీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ఇది. మంచి కంటెంట్‌తో డీయస్ రాథోడ్ తీసిన ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అన్నారు నిర్మాత బెక్కం వేణుగోపాల్. నజీరుద్దీన్, సీతా మహాలక్ష్మీ జంటగా డీయస్ రాథోడ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భారత్ కీ నారీ'. అఖిల్ గంధం సమర్పణలో సమీర్ ఉద్దీన్ అహ్మద్ తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ని బెక్కం వేణుగోపాల్, ఫస్ట్ లుక్‌ని కల్నల్ రామారావు విడుదల చేశారు. డీయస్ రాథోడ్ మాట్లాడుతూ– ''దేశాన్ని కాపాడటానికి సైనికులు బాధ్యత వహించినట్లే వారి సతీమణులు కుటుంబాన్ని బాధ్యతగా చూసుకుంటారు. ఈ చిత్రాన్ని దేశ సైనికుల సతీమణులకు, వారి తల్లితండ్రులకు అంకితం చేస్తున్నాం. సెప్టెంబర్ నెలాఖరులో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''మిలటరీ ఆఫీసర్‌గా నటించడం సంతోషంగా ఉంది'' అన్నారు నజీరుద్దీన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
418	119
60,260	17,944

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	12,939	▽	164
డోజోన్స్	33,984	▽	168
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,516	▽	20
డాక్స్	13,627	▽	283
షాంఘై	3,293	▲	15
నికాయ్	29,223	▲	353

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఈవీ ప్లాంట్ కోసం జోరు పెంచిన మహీంద్రా

వివిధ రాష్ట్రాలతో చర్చలు



న్యూఢిల్లీ: విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ ప్రారంభించే దిశగా ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఇందుకోసం పలు రాష్ట్రాల ప్రభుత్వాలతో చర్చలు జరుపుతోంది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేశ్ జెజూరికర్ ఈ విషయాలు తెలిపారు. ఈవీలను ప్రస్తుత ప్లాంట్లలోనే తయారు చేస్తారా లేక ప్రత్యేకంగా కొత్త ప్లాంటు ఏర్పాటు చేస్తారా అనే ప్రశ్నకు స్పందిస్తూ 'మేం అన్ని అవకాశాలనూ పరిశీలిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి కోసం వివిధ రాష్ట్రాలు ఎంత మేర సబ్సిడీలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయో పరిశీలించుకుని, తర్వాత తగు నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. అయితే, ప్లాంటు ఏర్పాటుకు సబ్సిడీ మాత్రమే ప్రాతిపదిక కాబోదని, వాహనాల తయారీకి అనువైన పరిస్థితులు తదితర అంశాలు కూడా పరిగణనలోకి తీసుకుంటామని జెజూరికర్ తెలిపారు. 'అసలు ఆటోమోటివ్ వ్యవస్థ అనేదే లేని ప్రాంతానికి వెళ్లాము. అది ఆటోమోటివ్ హబ్ అయి ఉండాలి. వాహనాల తయారీకి అనువైన పరిస్థితులు ఉండి, ఈవీ పెట్టుబడులను ఆకర్షించడంపై దృష్టి పెడుతున్న రాష్ట్రాలు చాలానే ఉన్నాయి. మేము మూడు–నాలుగు అవకాశాలను మదింపు చేసి, తగు నిర్ణయం తీసుకుంటాము' అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) ఎగుమతులపై స్పందిస్తూ.. ఇంకా ఏయే మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నది నిర్ణయం తీసుకోలేదని రాజేశ్ చెప్పారు. ఎంఅండ్ఎం ఇటీవలే ఎక్స్‌యూవీ, బీఈ బ్రాండ్ కింద అయిదు ఎలక్ట్రిక్ వాహనాల మోడల్స్‌ను ప్రదర్శించింది. 2024–2026 మధ్యలో నాలుగు వాహనాలను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించింది. కంపెనీకి ప్రస్తుతం మహారాష్ట్ర, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో సంప్రదాయ ఇంధనాలతో పనిచేసే వాహనాల తయారీ ప్లాంట్లు ఉన్నాయి.

సెన్సెక్స్@60,000

- 18వేల స్థాయికి చేరువలో నిఫ్టీ
- ఆటో షేర్లకు మాత్రమే నష్టాలు



ముంబై: దేశీయ ఈక్విటీ మార్కెట్లో బుల్ స్థిరమైన ర్యాలీతో సెన్సెక్స్ సూచీ ఏప్రిల్ ఐదో తేదీ తర్వాత మరోసారి 60,000 స్థాయిని అధిగమించింది. లాభాల స్వీకరణతో ఆటో షేర్లు మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 418 పాయింట్లు బలపడి 60,260 వద్ద స్థిరపడింది. మొత్తం 30 షేర్లలో ఏడు షేర్లు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 119 పాయింట్లు పెరిగి 17,944 వద్ద నిలిచింది. సెన్సెక్స్‌కిది వరుసగా నాలుగో రోజూ, నిఫ్టీకి ఏడోరోజూ లాభాల ముగింపు. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు అరశాతానికి పైగా లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,347 కోట్ల షేర్లను కొనడంతో 13వ రోజూ నికర కొనుగోలుదారులుగా నిలిచారు. దేశీ ఇన్వెస్టర్లు రూ.510 కోట్ల షేర్లను అమ్మారు. ఆసియాలో కొరియా ఇండెక్స్ తప్ప మిగిలిన అన్ని దేశాల స్టాక్ సూచీలు లాభపడ్డాయి. బ్రిటన్ ద్రవ్యోల్బణం నలభై ఏళ్ల గరిష్టస్థాయిలో నమోదవడంతో యూరప్ మార్కెట్లు 1–2% నష్టపోయాయి. యూఎస్ రిటైల్ సేల్స్, ఫెడ్ పాలసీ రిజర్వ్ జూలై సమావేశపు మినిట్స్ వెల్లడికి ముందు అమెరికా మార్కెట్లు అరశాతం స్వల్ప నష్టంతో ట్రేడ్ అవుతున్నాయి. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ 29 పైసలు బలపడి 79.45 వద్ద ముగిసింది.

నాలుగురోజుల్లో రూ.7.41 లక్షల కోట్లు

సెన్సెక్స్ 4 రోజుల ర్యాలీతో రూ.7.41 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ.279 లక్షల కోట్లకు చేరింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- నాలుగేళ్లకు సరిపడా 5జీ స్పెక్ట్రం వేలం సొమ్మును ముందుగానే చెల్లించడంతో భారతీ ఎయిర్‌టెల్ షేరు రెండున్నర శాతం లాభపడి రూ.722 వద్ద స్థిరపడింది.
- బోర్డు షేర్ల బోనస్ ఇష్యూను పరిగణనలోకి తీసుకోవడంతో భారత్ గేర్స్ షేరు 18% లాభపడి రూ.178 వద్ద నిలిచింది.

బీఓబీ ప్రత్యేక డిపాజిట్ స్కీమ్

6 శాతం వరకూ వడ్డీ ఆఫర్

న్యూఢిల్లీ: బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) 6 శాతం వరకూ అత్యధిక వడ్డీరేట్లను ఆఫర్ చేస్తూ, 'బరోడా తిరంగా డిపాజిట్ పథకం' పేరుతో ప్రత్యేక రిటైల్ టర్మ్ ప్లాన్‌ను ఆఫర్ చేసింది. భారతదేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని సూచిస్తూ, అధిక వడ్డీ రేట్లను అందించే ఈ ప్రత్యేక టర్మ్ డిపాజిట్ పథకాన్ని తీసుకు వచ్చినట్లు బ్యాంక్ ఒక ప్రకటనలో తెలిపింది. 2022 డిసెంబర్ 31 వరకూ ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుంది. రూ.2 కోట్లలోపు రిటైల్ డిపాజిట్లకు ఈ పథకం వర్తిస్తుంది. ఈ స్కీమ్ కింద సీనియర్ సిటిజన్లు అదనపు వడ్డీ ప్రయోజనాన్ని పొందుతారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-8-2022	
విశాఖ	450-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	447-00
విజయవాడ	447-00
రిటైల్ ధర (డజను)	66.00
17-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

బీఎస్ఎన్ఎల్.. పోటీ పడుతుందా?

- 4జీ సేవల ప్రారంభానికి కసరత్తు
- ఇప్పటికే 3జీలో చవక చార్జీలు
- ఇవి కొనసాగిస్తేనే మార్కెట్లో పోటీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అపరిమిత డేటా.. అదీ ఎటువంటి స్పీడ్ నియంత్రణ లేకుండా. అదనంగా అపరిమిత కాల్స్. 30 రోజుల కాల పరిమితి గల ఈ ట్రూలీ అన్‌లిమిటెడ్ ప్యాక్ కోసం భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) రూ.398 చార్జీ చేస్తోంది. అపరిమిత డేటాతో రూ.98 నుంచి ప్యాక్‌లను కంపెనీ ఆఫర్ చేస్తోంది. ప్రస్తుతానికి ఈ సేవలు 3జీ సాంకేతికతపైనే. భారత టెలికం రంగంలో చవక ధరలతో సేవలు అందించడమేగాక పారదర్శక సంస్థగా పేరున్న బీఎస్ఎన్ఎల్.. కేంద్ర ప్రభుత్వం అందించిన పునరుద్ధరణ ప్యాకేజీని ఆసరాగా చేసుకుని 4జీ, 5జీ సర్వీసుల్లోనూ ఇదే స్థాయిలో గనక చార్జీలను నిర్ణయిస్తే మార్కెట్లో సంచలనమే అని చెప్పవచ్చు. ప్రైవేట్ సంస్థలకు సవాల్ విసరడమేగాక అధిక చార్జీలకు కట్టడి పడడం ఖాయం. ఇదే జరిగితే బీఎస్ఎన్ఎల్ కొత్త వైభవాన్ని సంతరించుకోవడం ఎంతో దూరంలో లేదు. అంతేకాదు సామాన్యులకూ నూతన సాంకేతికత చేరువ అవుతుంది. వచ్చే రెండేళ్లలో బీఎస్ఎన్ఎల్ కనీసం 20 కోట్ల 4జీ, 5జీ కస్టమర్లను సొంతం చేసుకుంటుందని కేంద్రం భావిస్తోంది.

5జీ సేవలూ అందించవచ్చు..

బీఎస్ఎన్ఎల్‌కు ఊతమిచ్చేందుకు రూ.1.64 లక్షల కోట్ల ప్యాకేజీకి కేంద్ర కేబినెట్ జూలైలో ఆమోదించింది. ఇందులో రూ.43,964 కోట్లు నగదు రూపంలో, రూ.1.2 లక్షల కోట్లు నగదుయేతర రూపంలో నాలుగేళ్ల వ్యవధిలో కేంద్రం అందించనుంది. 4జీ సర్వీసులకై 900, 1800 మెగాహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీలో రూ.44,993 కోట్ల విలువైన స్పెక్ట్రంను బీఎస్ఎన్ఎల్‌కు ప్రభుత్వం కేటాయించనుంది. 900, 1800 మెగాహెర్ట్జ్ స్పెక్ట్రంతో 5జీ సేవలనూ అందించవచ్చు. అత్యంత మారుమూలన ఉన్న 24,680 గ్రామాలకు 4జీ సేవలను అందుబాటులోకి తెచ్చే రూ.26,316 కోట్ల ప్రాజెక్టుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. మరోవైపు బీఎస్ఎన్ఎల్‌కు సిబ్బంది బలమూ ఉంది. ప్రస్తుతం సంస్థలో సుమారు 62,000 మంది పనిచేస్తున్నారు. ప్రధాన పోటీ సంస్థల మొత్తం ఉద్యోగుల కంటే బీఎస్ఎన్ఎల్ సిబ్బంది సంఖ్యా బలం ఎక్కువ. ఈ స్థాయి ఉద్యోగులతో వినియోగదార్లను గణనీయంగా పెంచుకోవచ్చు. జియో వద్ద 18,000, ఎయిర్‌టెల్ 20,000, వొడాఫోన్ ఐడియా వద్ద 13,000 మంది ఉద్యోగులు ఉన్నట్టు సమాచారం.

ప్రైవేటుకు అండగా..

ప్రభుత్వ పోకడలే సంస్థ ప్రస్తుత పరిస్థితికి కారణమని బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ స్పష్టం చేసింది. టెలికం శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈ మేరకు ఘాటుగా లేఖ రాసింది. 'బీఎస్ఎన్ఎల్‌కు వ్యతిరేకంగా, ప్రైవేటుకు అండగా ప్రభుత్వం వ్యవహరించింది. 2019 అక్టోబర్ 23న కేంద్రం బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌కు పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటించింది. ఇందులో బీఎస్ఎన్ఎల్‌కు 4జీ స్పెక్ట్రం కేటాయింపు కూడా ఉంది. ప్రభుత్వం సృష్టించిన అడ్డంకుల కారణంగా స్పెక్ట్రం ప్రయోజనాన్ని బీఎస్ఎన్ఎల్ అందుకోలేకపోయింది. 49,300 టవర్లను అప్‌గ్రేడ్ చేసి ఉంటే రెండేళ్ల క్రితమే 4జీ సేవలు ప్రారంభం అయ్యేది. దురదృష్టవశాత్తు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. ఇది బీఎస్ఎన్ఎల్ పునరుద్ధరణకు తీవ్ర ఆటంకం కలిగించింది. 50,000ల 4జీ టవర్ల కొనుగోలుకై 2020 మార్చిలో టెండర్లను ఆహ్వానించింది. టెలికం ఎక్విప్‌మెంట్, సర్వీసెస్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫిర్యాదుతో టెండర్ రద్దు అయింది. పైగా దేశీయ కంపెనీల నుంచే పరికరాలను కొనుగోలు చేయాలన్న నిబంధన పెట్టారు. ప్రైవేట్ కంపెనీలు విదేశీ సంస్థలైన ఎరిక్సన్, నోకియా, సామ్‌సంగ్ నుంచి కొనుగోలు చేస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్‌కు మాత్రమే ఎందుకీ నిబంధన? ఆలస్యం అయినప్పటికీ లాభాలు అందించే దక్షిణ, పశ్చిమ ప్రాంతంలో రూ.500 కోట్లతో నోకియా సహకారంతో 19,000 టవర్లను అప్‌గ్రేడ్ చేసి ఇప్పటికైనా 4జీ అందించవచ్చు' అని ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి పి.అభిమన్యు మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఇదీ కంపెనీ స్థానం..

ట్రాయ్ ప్రకారం 2022 మే 31 నాటికి 114.5 కోట్ల వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లలో జియోకు 35.69%, ఎయిర్‌టెల్ 31.62%, వొడాఐడియా 22.56% వాటా ఉంటే వెనుకంజలో ఉన్న బీఎస్ఎన్ఎల్ 9.85% వాటాకు పరిమితమైంది. మేలో జియో 30 లక్షలు, ఎయిర్‌టెల్ 10 లక్షల మంది యూజర్లను కొత్తగా సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 5.3 లక్షల మందిని కోల్పోయింది. దేశంలో వైర్‌లైన్ కస్టమర్లు 2.52 కోట్ల మంది ఉన్నారు. ఇందులో అగ్ర స్థానంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ వాటా 28.67%. జియోకు 26.7%, ఎయిర్‌టెల్‌కు 23.66% వాటా ఉంది. మొత్తం 79.4 కోట్ల బ్రాడ్‌బ్యాండ్ చందాదార్లలో జియో 52.18% వాటాతో 41.4 కోట్లు, ఎయిర్‌టెల్ 27.32%తో 21.7 కోట్లు, వొడాఫోన్ ఐడియా 15.51%తో 12.3 కోట్లు, బీఎస్ఎన్ఎల్ 3.21% వాటాతో 2.55 కోట్ల మంది ఉన్నారు. వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో జియోకు 58.9 లక్షలు, ఎయిర్‌టెల్ 47.4 లక్షలు, బీఎస్ఎన్ఎల్‌కు 47.4 లక్షల మంది యూజర్లు ఉన్నారు.

చార్జర్లపై నిపుణుల కమిటీలు

కేంద్ర ప్రభుత్వ అధికారుల వెల్లడి

న్యూఢిల్లీ: వివిధ రకాల మొబైల్స్, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ పరికరాలన్నింటికీ ఒకే తరహా చార్జర్లను వినియోగంలోకి తెచ్చే అంశాన్ని అధ్యయనం చేసేందుకు నిపుణుల బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి రోహిత్ కుమార్ సింగ్ తెలిపారు. ఇవి రెండు నెలల వ్యవధిలో సవివర నివేదికను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



పరిశ్రమ, యూజర్లు, తయారీదారులు, పర్యావరణం వంటి అంశాలన్నింటినీ పరిగణించి ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సింగ్ వివరించారు. పరిశ్రమ వర్గాలతో బుధవారం భేటీ అయిన తర్వాత ఆయన ఈ విషయాలు తెలిపారు. ప్రతి వర్గం ఆలోచనలు భిన్నంగా ఉంటాయి కాబట్టి ఆయా అంశాలను అధ్యయనం చేసేందుకు వేర్వేరుగా నిపుణుల బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు సింగ్ పేర్కొన్నారు. నెల రోజుల్లోగా బృందాలను నోటిఫై చేస్తామని వివరించారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	52,034
బంగారం (99.5 స్వచ్ఛత)	51,826
వెండి (కిలో)	57,821

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం తెలంగాణ చరిత్ర కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీవీవీపీ ఆసుపత్రుల్లో 341 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు

ఏపీ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆసుపత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్(సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 341
» **పోస్టుల వివరాలు:** గైనకాలజీ-60, అనెస్తీషియా-51 పీడియాట్రిక్స్-51, జనరల్ మెడిసిన్-75, జనరల్ సర్జరీ-57, రేడియాలజీ-27, పాథాలజీ-08, ఈఎన్‌టీ-09, ఫోరెన్సిక్ మెడిసిన్-03.
» **అర్హత:** పీజీ డిగ్రీ,డిప్లొమా,డీఎన్‌బీ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** అర్హత పరీక్ష మార్కులు, అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు. **వయసు:** 01.07.2022 నాటికి గరిష్ట వయోపరిమితి 42ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్-సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల మినహాయింపు ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 26.08.2022
» **వెబ్‌సైట్:** hmfw.ap.gov.in

యూపీఎస్సీలో 37 పోస్టులు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ).. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సివిల్ ఏవియేషన్, కంజ్యూమర్ అఫైర్స్, డిఫెన్స్ తదితర శాఖల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రిక్రూట్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.09.2022
» **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్శిటీలో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్.. నర్సింగ్ కళాశాలల్లో రెండేళ్ల పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.


» **అర్హత:** ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులవ్వాలి. జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 31.12.2022 నాటికి 21 నుంచి 45ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ పరీక్షలో మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 02.09.2022
» **వెబ్‌సైట్:** https://ntruhs.ap.nic.in

ఎక్స్‌ఏటీతో మేనేజ్‌మెంట్ విద్య

మేనేజ్‌మెంట్ విద్యను అభ్యసించడానికి జాతీయ స్థాయిలో ఎన్నో ప్రవేశ పరీక్షలు ఉన్నాయి. మేటి సంస్థల్లో మేనేజ్‌మెంట్ విద్యను చదవాలనుకునే వారికి క్యాట్ తర్వాత ఉన్న చక్కటి మార్గం.. ఎక్స్‌ఏటీ. ప్రస్తుతం 2023 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎక్స్‌ఏటీ ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఎక్స్‌ఏటీ ప్రత్యేకతలు, పరీక్ష విధానం గురించి తెలుసుకుందాం..

దేశంలోని టాప్-10 బీస్కూల్స్‌లో ఒకటి.. జంషెడ్‌పూర్‌లోని జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎక్స్ఎల్ఆర్ఐ). ఈ విద్యా సంస్థలో ప్రవేశానికి సంబంధించి జేవియర్ అప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) పేరుతో ప్రతి ఏటా జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా ఎక్స్ఎల్ఆర్ఐతోపాటు వందకు పైగా ఇతర ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏలో ప్రవేశం పొందవచ్చు.

మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరాలనుకునే వారికి జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎక్స్ఎల్ఆర్ఐ) మంచి వేదిక. హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లో ఈ సంస్థకు మంచి గుర్తింపు ఉంది. ఇందులో సంబంధిత కోర్సు పూర్తిచేసుకున్న వారు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ ద్వారా కార్పొరేట్ సంస్థల్లో కొలువు సొంతం చేసుకోవచ్చు.



అర్హత

ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఎక్స్‌ఏటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు ఫైనల్ ఇయర్ విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

ప్రవేశం ఇలా

ఎక్స్ఎల్ఆర్ఐలో ప్రవేశం పొందాలంటే.. ఎక్స్‌ఏటీ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితర పరీక్షల్లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

ఎక్స్‌ఏటీ పరీక్ష రెండు సెక్షన్‌లుగా నిర్వహిస్తారు. 100 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష సమయం 180 నిమిషాలు. ఇందులో అభ్యర్థి ఏ సెక్షన్ నుంచి అయినా పరీక్ష రాసుకోవచ్చు. సెక్షన్ వారి నిబంధన లేదు. ఒక సెక్షన్‌లో పరీక్ష రాస్తూ కూడా మరొక సెక్షన్‌లోకి మారే వెసులుబాటు కూడా ఉంటుంది. **సెక్షన్-1:** ఈ విభాగంలో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్-26, డేసిషన్ మేకింగ్-21, క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగాల నుంచి 28 చొప్పున ప్రశ్నలుంటాయి. మొత్తం 75 ప్రశ్నలుంటాయి. 165 నిమిషాల సమయం ఇస్తారు. **సెక్షన్-2:** ఈ విభాగం నుంచి జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన ప్రశ్నలు ఎదురవుతాయి. ఇందులో 25 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం 15 నిమిషాలు.

నెగిటివ్ మార్కులు

ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. తప్పు సమాధానానికి పావు వంతు మార్కు కోత విధిస్తారు. జనరల్ నాలెడ్జ్ విభాగానికి సంబంధించి రుణాత్మక మార్కులు లేవు.

ముఖ్యమైన సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు చివరి తేదీ:** నవంబర్ 30, 2022
- **అడ్మిట్ కార్డ్:** డిసెంబర్ 20, 2022
- **ఎక్స్‌ఏటీ పరీక్ష తేదీ:** జనవరి 08, 2023
- **వెబ్‌సైట్:** https://xatonline.in

డీఏఓ కొలువు కావాలా..!

» డిగ్రీ ఉత్తీర్ణుల ముంగిట మరో ప్రభుత్వ కొలువు
» డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులకు నోటిఫికేషన్
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఎంపిక
» రూ.45,960-రూ.1,24,150తో ప్రారంభ వేతన శ్రేణి



తెలంగాణ రాష్ట్రంలో.. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణుల ముంగిట.. మరో ప్రభుత్వ కొలువు! గెజిటెడ్ హోదాలో.. ప్రారంభంలోనే.. రూ.45,960-రూ.1,24,150 వేతన శ్రేణి అందుకునే అవకాశం! సుస్థిర భవిష్యత్తుకు మార్గం ఈ ఉద్యోగం. ఇటీవల టీఎస్‌పీఎస్సీ డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ గ్రేడ్-2 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ పరిధిలోని పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపడుతుంది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా.. విజేతలను ప్రకటించి కొలువులు ఖరారు చేస్తారు. ఈ నేపథ్యంలో.. డీఏఓ గ్రేడ్-2 నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష విధానం, ప్రిపరేషన్ గైడెన్స్..

టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన తాజా నోటిఫికేషన్ ద్వారా మొత్తం 53 డీఏఓ పోస్టులకు నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. మల్టీ జోన్ విధానంలో పోస్టులను విభజించి.. మల్టీ జోన్-1 పరిధిలో 28, మల్టీ జోన్-2 పరిధిలో 25.. మొత్తం 53 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ప్రారంభ వేతన శ్రేణిని రూ.45,960-రూ.1,24,150గా పేర్కొన్నారు.

అర్హతలు

- గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** 18-44 ఏళ్లు(ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు గరిష్ట వయో పరిమితిలో అయిదేళ్ల సడలింపు)

రాత పరీక్షలో ప్రతిభే కొలమానం

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్ట్‌లను రాత పరీక్షలో మెరిట్ ఆధారంగానే భర్తీ చేయనున్నారు. ఆయా కేటగిరీలకు చెందిన అభ్యర్థులు రాత పరీక్షలో పొందాల్సిన కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 40 శాతం; బీసీ కేటగిరీ అభ్యర్థులు 35 శాతం; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ వర్గాల అభ్యర్థులు కనీసం 30 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

రాత పరీక్ష.. రెండు పేపర్లుగా

డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్ట్‌లకు నిర్వహించే రాత పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్1లో జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ 150 ప్రశ్నలు-150 మార్కులకు; పేపర్ 2లో అర్థమెటిక్ అండ్ మెన్సురేషన్ 150 ప్రశ్నలు-300 మార్కులకు పరీక్ష జరుగుతుంది. రాత పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పరీక్షను ఓఎంఆర్ షీట్ విధానం లేదా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించనున్నట్లు నోటిఫికేన్‌లో పేర్కొన్నారు.

పరీక్షలో విజయానికి ఇలా

- పేపర్-1గా పేర్కొన్న జనరల్ స్టడీస్ అండ్ జనరల్ అవేర్‌నెస్‌లో.. అభ్యర్థులు ప్రాంతీయం నుంచి అంతర్జాతీయ అంశాల వరకూ.. అన్నింటిపైనా అవగాహన పెంచుకోవాలి. తెలంగాణ ప్రాంత ప్రాధాన్యమున్న అంశాలను ఔపోసన పట్టాలి. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ దశలు, తెలంగాణ ఆవిర్భావ దశ, మలి ఉద్యమంలో ముఖ్యమైన ఘట్టాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదే విధంగా తెలంగాణ సామాజిక ముఖ చిత్రాన్ని తెలియజేసే అన్ని అంశాలను చదవాలి. సాహిత్యం, కళలు, కవులు, సంస్థానాలు, భౌగోళిక స్వరూపం,వనరులు, ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ఏర్పాటు తర్వాత అమలు చేస్తున్న కొత్త పథకాలు.. ఇలా అన్ని అంశాలపై దృష్టి పెట్టాలి.
- తెలంగాణ విధానాలపై అవగాహన పెంచుకోవాలి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుకు ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్న నీళ్లు..నిధులు..నియామకాలు.. వంటి అంశాలపై ఎలాంటి విధానాలు తెచ్చారో తెలుసుకోవాలి. రాష్ట్రంలో ఆయా వర్గాల కోసం అమలు చేస్తున్న నూతన పథకాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. వెనుకబడిన తరగతులు, మైనారిటీలు, గిరిజనులకు సంబంధించి ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టారో తెలుసుకోవాలి. పర్యావరణానికి సంబంధించి తెలంగాణకు హరితహారం అమలుచేస్తున్నారు.

జాతీయం

మహిళల సాధికారత కోసం జాతీయస్థాయిలో రకరకాల పథకాలు తెచ్చారు. మైనారిటీలు, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమం కోసం పలు విధానాలు అమలు చేస్తున్నారు. అదే విధంగా పలు నూతన పాలసీలు రూపొందుతున్నాయి. వాటి గురించి కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఉదాహరణకు నూతన విద్యా విధానాన్నే పరిగణనలోకి తీసుకుంటే.. నూతన విద్యా విధానం ముఖ్యాంశాలతోపాటు ఇప్పటి వరకు తీసుకొచ్చిన విద్యా విధానాలు, ప్రస్తుత విధానానికి, వాటికి మధ్య ఉన్న వ్యత్యాసం, ఉద్దేశం, ప్రధానాంశాలు, లక్ష్యాలు.. ఇలా అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి. వీటితోపాటు కోర్ జాగ్రఫీ, హిస్టరీ, పాలిటీకి సంబంధించిన అంశాలను కూడా ఔపోసన పట్టాలి. ఆయా సబ్జెక్ట్‌లను ప్రాంతీయ ప్రాధాన్యతల వారీగా అభ్యసించడం ఉపయుక్తంగా ఉంటుంది.

అంతర్జాతీయ అంశాలు

అభ్యర్థులు అంతర్జాతీయ అంశాలకు కూడా తగినంత ప్రాధాన్యం ఇవ్వాలి. సమకాలీన పరిణామాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలి. ప్రస్తుతం రష్యా-ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధం, చైనా-తైవాన్, అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్ వంటి దేశాల అంతర్జాతీయ విధానాలు; జీ-8 సదస్సు, కామన్వెల్త్ క్రీడలు-భారత క్రీడాకారుల ప్రతిభ, బ్రిటన్ ప్రధాని ఎంపిక ప్రక్రియ వంటి వాటిపై అవగాహన అవసరం.

పేపర్-2.. ప్రాక్టీస్+కాన్సెప్ట్‌లు

- పేపర్-2(అర్థమెటిక్ అండ్ మెన్సురేషన్)లో అభ్యర్థులు కాన్సెప్చువల్ ప్రిపరేషన్‌తోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి.
- అర్థమెటిక్‌కు సంబంధించి నంబర్ సిస్టమ్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి. రేషనల్ నెంబర్స్, రియల్ నంబర్స్, సర్ఢ్స్ అండ్ లాగారిథమ్స్‌పై అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలి.
- రేషియోస్ అండ్ ప్రపోర్షన్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. యావరేజెస్,ప్రాఫిట్ అండ్ లాస్, డిస్కౌంట్, సింపుల్-కాంపౌండ్ ఇంట్రస్ట్, పార్ట్‌నర్‌షిప్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, క్లాక్, క్యాలెండర్ వంటి అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- అదే విధంగా బహుపదులు, శ్రేఢులు వంటి అంశాలను అధ్యయనం చేయాలి.
- సమితులు, లీనియర్ ఈక్వేషన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- స్టాటిస్టిక్స్ అండ్ ప్రాబబిలిటీపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. సగటు, మధ్యగతం, బాహుళకాలకు సంబంధించి అన్ని సిద్ధాంతాలను, సూత్రాలను అధ్యయనం చేసి.. వాటికి సంబంధించి సమస్యలను ప్రాక్టీస్ చేయాలి.
- మెన్సురేషన్‌కు సంబంధించి కొలతలు,స్క్వేర్స్, ట్రయాంగిల్, రెక్టాంగిల్, క్వాడ్రిలేటర్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి.
- రేఖా గణిత అంశాలను కూడా ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా.. 2-డి ప్లేన్స్, స్ట్రెయిట్ లైన్స్, అప్లికేషన్స్, ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్, ట్రిగ్నోమెట్రిక్ అప్లికేషన్స్ తదితర అంశాలపై సంపూర్ణ పట్టు సాధించాలి.

ప్రాక్టీస్‌తోనే సాధ్యం

డీఏఓ పరీక్షలో విజయానికి ప్రాక్టీస్ కీలకం. ముఖ్యంగా పూర్తిగా లెక్కలు, అంకగణిత అంశాలతో ఉండే పేపర్-2లో మంచి మార్కులు సాధించాలంటే.. ప్రాక్టీస్ తప్పనిసరి అని అభ్యర్థులు గుర్తించాలి. పేపర్-2లో ప్రతి టాపిక్‌ను చదువుతూ వాటికి సంబంధించిన సిద్ధాంతాలను, సూత్రాలను, అప్లికేషన్స్‌ను, నిర్వచనాలను అవగాహన చేసుకోవాలి. వాటిని షార్ట్ నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. ఇలా ఇప్పటి నుంచి పక్కా ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. డీఏఓ పరీక్షలో మంచి మార్కులు సాధించి.. విజయావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:**సెప్టెంబర్6, 2022
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబర్‌లో నిర్వహించే అవకాశం
- **రాత పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ నిజామాబాద్
- **వెబ్‌సైట్:** www.tspsc.gov.in

క్లుప్తంగా

నేడు భారత ప్రధాన న్యాయమూర్తి తిరుపతి రాక



తిరుపతి అర్బన్: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఈనెల 18, 19 తేదీల్లో తిరుపతి జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న సీజేఐ హైదరాబాద్ నుంచి రాత్రి 7.20 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారని చెప్పారు. రాత్రి తిరుపతిలో బస చేస్తారన్నారు. 19వ తేదీ తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ హాల్‌లో సత్యశోధన మహాత్ముని ఆత్మకథ అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్తారన్నారు.

ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీకి ఐఎస్‌వో సర్టిఫికెట్



లబ్బీపేట (విజయవాడ తూర్పు): పారదర్శకమైన సేవలు అందిస్తున్నందుకుగాను విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి ఐఎస్‌వో సర్టిఫికెట్ లభించింది. వర్సిటీలో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఐఎస్‌వో ఏపీ, తెలంగాణ ఇన్‌చార్జి శివయ్య చేతుల మీదుగా వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందుకోనున్నారు. నెల రోజుల కిందట శివయ్య బృందం వర్సిటీని సందర్శించి మెడికల్, ఆయుష్, పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుపుతున్న తీరు, అకడమిక్ విభాగంలో పారదర్శక సేవలు, పరీక్షల నిర్వహణ వంటి అన్ని విషయాలను పరిశీలించింది. వర్సిటీలో పారదర్శకంగా నాణ్యమైన సేవలు అందిస్తున్నట్లు గుర్తించి ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందించనున్నారు. కాగా ఇప్పటివరకు దేశంలోని ఏ ఆరోగ్య వర్సిటీ ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను పొంద లేదని, దీన్ని తొలిసారిగా ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ అందుకుంటున్నందుకు సంతోషంగా ఉన్నట్లు వర్సిటీ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రారంభమైన ఏపీపీసెట్ ప్రవేశ పరీక్షలు



దేహ దారుఢ్య పరీక్షల్లో భాగంగా లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థులు

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా బీపీఈడీ, యూజీడీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పీసెట్–2022లో భాగంగా ప్రవేశ పరీక్షలు బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రవేశ పరీక్షలకు 441 మందికిగాను 310 మంది హాజరయ్యారు. అభ్యర్థులకు దేహ దారుఢ్య, క్రీడా నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ సుధీర్ ప్రేమ్‌కుమార్ పరీక్షలు జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. గురువారం హాల్‌టికెట్ నంబర్ 10,442 నుంచి 10,883 వరకు గల అభ్యర్థులకు పరీక్షలు జరుగుతాయని పీసెట్ కన్వీనర్ డాక్టర్ జాన్సన్ తెలిపారు

బంగారం ఇస్తామని చెప్పి రూ.45 లక్షలకు టోకరా

బాధితురాలి ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు

కావలి: చౌకగా బంగారం ఇస్తామని నమ్మించి రూ.45 లక్షలు తీసుకుని మోసగించారని విశాఖలో ఉంటున్న మహిళ బుధవారం నెల్లూరు జిల్లా కావలి రెండోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు.. తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురానికి చెందిన కొత్తపల్లి ప్రీతిసృజన ప్రస్తుతం విశాఖలో నివసిస్తున్నారు. కావలికి చెందిన దేవరకొండ సుధీర్ అలియాస్ అజయ్‌రెడ్డి, కాకినాడకు చెందిన జోగినాథం, విజయవాడకు చెందిన రియాజ్, రాము, మనోహర్‌రెడ్డి కలిసి గత ఏడాది జూలై 27వ తేదీన తక్కువ రేటుకే కిలో బంగారం ఇస్తామని చెప్పి ఆమె వద్ద రూ.30 లక్షలు తీసుకున్నారు. బంగారం ఒంగోలులో తమకు తెలిసిన వారివద్ద ఉంచామని, అక్కడికి వెళితే తాము ఫోన్‌లో చెబుతామని ఆమెకు తెలిపారు. దీంతో ఆమె ఒంగోలు వెళ్లినా బంగారం ఇవ్వకుండా కాలం గడుపుతుండటంతో కావలి వచ్చి బంగారం అడిగింది. మరో రూ.20 లక్షలు ఇస్తే 2 కిలోల బంగారం ఇస్తామని వారు చెప్పారు. దీంతో ఆమె రూ.15 లక్షలు ఇచ్చింది. ఇలా రూ.45 లక్షలు తీసుకుని బంగారం ఇవ్వకపోవడంతో వారు తనను మోసం చేసినట్లు ప్రీతిసృజన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.



5జీ హుజూర్

(ఎం.విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

మనిషి జీవితంలోకి వేగం ప్రవేశించి చాలా కాలమే అయింది. మానవుడి జీవన గమనాన్ని సాంకేతిక పరిజ్ఞానం ఎన్నో మేలి మలుపులు తిప్పింది. సెల్యులార్ టెక్నాలజీ విప్లవంతో అందరి చేతుల్లోకి సెల్‌ఫోన్లు వచ్చాయి. సాధారణ వాయిస్ కాల్స్‌కే జనం మురిసిపోగా.. అసాధారణ అవసరాలు సైతం సెల్‌ఫోన్‌లో చేరుతున్నాయి. 1990లలో 2జీ నెట్‌వర్క్‌తో మొదలైన మనిషి సెల్‌ఫోన్ ప్రయాణం.. 3జీ, 4జీని దాటుకొని ఇప్పుడు 5జీ మెరుపు వేగాన్ని అందుకొంటోంది. మనిషి జీవనాన్ని మరో మేలి మలుపు తిప్పడానికి ఇది దోహదం చేయనుంది.

5జీ అంటే..: సెల్యులార్ టెక్నాలజీలో ఐదో జనరేషన్‌ను సింపుల్‌గా 5జీ అంటున్నారు.

1జీ: 1980లో తొలి తరం(1జీ) మొబైల్ సేవలు మొదలయ్యాయి. బ్రీఫ్‌కేస్ సైజ్ ఉన్న ఫోన్లు, అది కూడా పరిమిత సంఖ్యలో ఉన్న గ్రూపు సభ్యుల మధ్య కమ్యూనికేషన్‌కు మాత్రమే ఉపయోగపడేవి.

2జీ: 1990లో రెండో తరం సాంకేతిక పరిజ్ఞానం ప్రారంభమైంది. పర్సనల్ హ్యాండ్ సెట్‌లు వచ్చాయి. ఇవే సెల్‌ఫోన్లు. వీటితో వాయిస్ కాల్స్ చేయడం, రిసీవ్ చేసుకోవడం సాధ్యమైంది. క్రమేణా ఎస్ఎంఎస్‌లు కూడా వచ్చాయి. 2జీ కాలంలో మొదలయిన సెల్‌ఫోన్.. మనిషి జీవితంలో భాగమైంది.

3జీ: 2000 సంవత్సరానికి సెల్‌ఫోన్ జేబులో ఇమిడిపోయింది. ఇంటర్‌నెట్ యాక్సెస్ సాధ్యమైంది. సెల్‌ఫోను లేనిదే అడుగు వేయలేని స్థితికి వచ్చింది.

4జీ: 2010కి సెల్‌ఫోన్ స్మార్ట్‌ఫోన్‌గా మారిపోయింది. డేటా స్పీడ్ అనూహ్యంగా పెరిగింది. ఫోన్‌లో యాప్ స్టోర్లు చేరాయి. సోషల్ మీడియా ఉవ్వెత్తున ఎగిసింది.

5జీ ఉపయోగాలను ఊహించలేం

2జీ వచ్చినప్పుడు డిజిటల్ వాయిస్ కాలింగ్ 1990 దశాబ్దంలో అత్యంత ఉపయోగకరమైన అంశంగా అందరూ భావించారు. ఎస్ఎంఎస్ అప్పుడు ఓ అద్భుతం. 3జీ ప్రవేశంతో 'ఇంటర్నెట్ యాక్సెస్' అద్భుతమైన అంశంగా నిలుస్తుందని అనుకున్నారు. అయితే సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ యాప్‌ల దశాబ్దంగా మారింది. 4జీతో రైడ్ షేరింగ్, ఫుడ్ డెలివరీ లాంటి క్లౌడ్ కంప్యూటింగ్ సేవలు వస్తాయని భావించారు. వాటితో పాటు యూట్యూబ్, నెట్‌ఫ్లిక్స్ లాంటి వీడియో స్ట్రీమింగ్ సౌకర్యాలు, వీడియో కాలింగ్ వచ్చి అంతులేని వినోదాన్ని పంచుతున్నాయి. 5జీ ఇంకేమి సౌకర్యాలను తెస్తుందో కచ్చితంగా చెప్పలేం. కానీ మెరుపువేగంతో డేటా ట్రాన్స్‌ఫర్ మానవ జీవితాన్ని మరింతగా మారుస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 4జీ కంటే 5జీలో డేటా ట్రాన్స్‌ఫర్ వేగం 20 రెట్లు పెరుగుతుంది. ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న సాధారణ నెట్ 100 ఎంబీపీఎస్. 5జీలో సాధారణ వేగం 4–5 జీబీపీఎస్‌కు చేరే అవకాశం ఉంటుంది. ఇప్పుడు గంట పాటు డౌన్‌లోడ్ చేస్తున్న గేమ్స్ లాంటి వాటిని సెకన్ల వ్యవధిలో చేయచ్చు.

- సాధారణ వాయిస్ కాల్స్‌కే మురిసిన జనం
- ఇప్పుడు అసాధారణ అంశాలూ సెల్‌ఫోన్లోకి
- 4జీ గరిష్ట వేగం 1 జీబీపీఎస్.. 5జీ గరిష్ట వేగం 20 జీబీపీఎస్
- ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాధారణ నెట్ 100 ఎంబీపీఎస్
- 5జీ వస్తే సాధారణ వేగం 4–5 జీబీపీఎస్‌కు చేరే అవకాశం
- విద్య, వైద్యం, రవాణా, పరిశ్రమలు, సేవా రంగాల్లో మార్పులు
- ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగంలో మనది రెండోస్థానం
- 2025కి 5జీ స్మార్ట్ ఫోన్లలోనూ రెండో స్థానంలో ఉండొచ్చని అంచనా

5జీ మనిషి జీవనంలో 'మెరుపు వేగం'

ఏ రంగాల్లో మార్పులు వస్తాయి?

- వినోద రంగంలో వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్‌మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఎక్స్‌ఆర్) సౌకర్యాలు మొబైల్ ఫోన్లలోకి వస్తాయి.
- విద్యా రంగంలో అనూహ్య మార్పులు వస్తాయి. ఆన్‌లైన్ టీచింగ్‌లో విద్యార్థులకు క్లాస్‌రూమ్‌లో ఉన్న అనుభూతి కలుగుతుంది. కంటెంట్ సులభంగా అర్థమయ్యేలా బోధించడానికి సహాయపడుతుంది.
- వైద్య రంగంలోనూ అనూహ్య మార్పులు వస్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తి 108 (అంబులెన్స్)కు కాల్ చేసిన వెంటనే అంబులెన్స్‌తో పాటు సమీపంలోని ఆసుపత్రికి కూడా సమాచారం వెళుతుంది. డాక్టర్‌ను అలెర్ట్ చేస్తుంది. వేగంగా ఆసుపత్రికి చేరే మార్గాన్ని సూచించడంతో పాటు, ప్రత్యామ్నాయ ఆసుపత్రుల వివరాలను తెలియజేస్తుంది.
- టెలి మెడిసిన్‌లో ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రాలు ఇప్పటికే దూసుకెళుతున్నాయి. 5జీ అందుబాటులోకి వస్తే డాక్టర్, రోగి ఒక దగ్గర లేకుండా కేవలం మొబైల్‌లో రియల్‌టైమ్ వీడియో ద్వారా చికిత్స లభిస్తుంది.
- రోబోటిక్ సర్జరీల్లో మరిన్ని సంచలనాలకు దోహదం చేస్తుంది. ఆఫీసులో ఎదురుబొదురు కూర్చొన్నట్లుగా ఉండే వర్చువల్ మీటింగ్స్‌కు అవకాశం కల్పిస్తుంది. ఫలితంగా సిబ్బంది మొత్తం ఆఫీసుకే వచ్చి పనిచేయాల్సిన అవసరం ఉండదు. 'రిమోట్ టీమ్ ప్రొడక్టివిటీ'ని పెంచుతుంది.
- వాణిజ్య, పారిశ్రామిక రంగాల్లో వినూత్న మార్పులు వస్తాయి. ఫ్లెక్సిబుల్, నమ్మకమైన, సమర్థవంతమైన వ్యాపారానికి భూమికగా నిలుస్తుంది. డిమాండ్, సప్లైని బట్టి ఉత్పత్తి సంస్థలు ఆటోమేటిక్‌గా స్పందించే రోజు వస్తుంది.
- పరిశ్రమల్లో సమస్యలను 'డిజిటల్ నమూనా'ల్లో ముందుగానే గుర్తించొచ్చు. ఫలితంగా సమస్య రాకుండా ముందు జాగ్రత్త తీసుకోవడానికి, ఒకవేళ సమస్య తలెత్తినా వేగంగా పరిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది.
- వస్తు రవాణాను రియల్ టైమ్‌లో పరిశీలించొచ్చు. గోదాములు, పోర్టుల్లో ప్రతి వస్తువును ట్రాక్ చేయొచ్చు.
- డ్రైవర్ లేని కార్ల వినియోగం గణనీయంగా పెరుగుతుంది. ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణకు ఉపయోగపడుతుంది.
- 'స్మార్ట్ గ్రిడ్ కాన్సెప్ట్ మరింత బలోపేతం అవుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది.
- వ్యవసాయంలోనూ సూపర్ ఫాస్ట్ నెట్‌వర్క్ ఉపయోగపడుతుంది. మోటార్లను ఆన్/ఆఫ్ చేయడానికే కాకుండా, పొలం తడిసిన వెంటనే అలర్ట్ చేసే రియల్‌టైం మెకానిజం చౌకగా లభిస్తుంది.
- డ్రోన్ల వినియోగం అత్యంత వేగంగా పెరుగుతుంది. వ్యవసాయం మొదలు అన్ని రంగాల్లో డ్రోన్ల వాడకం సులభం, చౌక అవుతుంది.

4జీ ఫోన్లు 5జీ నెట్‌వర్క్‌కు ఉపయోగపడతాయా?

4జీ ఫోన్లలోని ప్రాసెసర్ 5జీ నెట్‌వర్క్‌కు ఉపయోగపడదు.. ప్రాసెసర్ అప్‌గ్రెడేషన్‌కు కంపెనీలు అవకాశం ఇస్తే, ఇప్పుడున్న ఫోన్లను చౌకగా మార్చుకోవచ్చు. సాఫ్ట్‌వేర్ కూడా మార్చుకోవాలి. లేదంటే 5జీ ఫోన్లు కొనుక్కోవాలి. సిమ్ కార్డు కూడా 5జీకి మార్చాలి. స్మార్ట్ ఫోన్ల వినియోగంలో ప్రపంచంలో చైనా తొలి స్థానంలో ఉంటే, మనం రెండో స్థానంలో ఉన్నాం. ఈ డిమాండ్ మరింత పెరుగుతుంది. 2025 నాటికి గ్లోబల్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోనూ మన దేశం రెండోస్థానంలో కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

2025 నాటికి ప్రపంచంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం ఇలా

ర్యాంకు	దేశం	స్మార్ట్‌ఫోన్ కనెక్షన్లు (మిలియన్లలో)
1.	చైనా	1,458
2.	భారత్	983
3.	ఇండోనేషియా	410
4.	అమెరికా	346
5.	బ్రెజిల్	204
6.	రష్యా	190
7.	జపాన్	176
8.	పాకిస్తాన్	146
9.	నైజీరియా	143
10.	బంగ్లాదేశ్	133

(ఆధారం: జీఎస్ఎంఏ ఇంటెలిజెన్స్)

నెట్‌వర్క్ స్పీడ్

2జీ	50 కేబీపీఎస్ లోపు
3జీ	1.8 ఎంబీపీఎస్ నుంచి 42 ఎంబీపీఎస్
4జీ	100ఎంబీపీఎస్ నుంచి 1 జీబీపీఎస్
5జీ	5 జీబీపీఎస్ నుంచి 20 జీబీపీఎస్

తొలి మేసేజ్ ఎవరు వాడారు?

మెర్రీ క్రిస్మస్ (యూకేలో 1992లో పంపించారు)

- 2006 నాటికి 18–29 ఏళ్ల మధ్య యువతలో 28 శాతం మొబైల్ ఇంటర్నెట్ వాడారు
- 2011 నాటికి నమ్మకమైన నెట్ స్పీడ్ వచ్చింది. సీఎన్ఎన్ న్యూస్ ఛానల్ తొలిసారి స్ట్రీమింగ్ చేసింది
- దేశంలో 983 మిలియన్ యూజర్లు ఉంటారని అంచనా.

బెంగళూరుకు జంబో జెట్



సాక్షి, బెంగళూరు: అతిపెద్ద ప్రయాణికుల విమానం ఎమిరేట్స్ ఎయిర్‌బస్–ఏ380 బెంగళూరుకు నేరుగా సేవలను అందించనుంది. అక్టోబర్ 30న దుబాయ్ నుంచి వచ్చి బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగనుంది. 2014 నుంచి ముంబైకి సర్వీసులను అందిస్తోంది. 72.75 మీటర్ల పొడవు, 24.45 మీటర్ల ఎత్తు కలిగిన ఈ విమానంలో గరిష్టంగా 853 మంది ప్రయాణించవచ్చు. ఒకసారి 3 వేల సూట్‌కేసులను తరలించే సామర్థ్యం ఈ విమానానికి ఉంది. అక్టోబర్ 30 నుంచి ప్రతి రోజూ బెంగళూరు నుంచి దుబాయ్‌కి విమానం రాకపోకలు సాగిస్తుందని ఎమిరేట్స్ సంస్థ వెల్లడించింది. ఈ విమానంలో మూడు తరగతుల (ఎకానమీ, బిజినెస్, ఫస్ట్‌క్లాస్) ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. బోయింగ్–777తో పోలిస్తే 45 శాతం అధిక మంది ప్రయాణించవచ్చు. ప్రపంచంలోని 30 విమానాశ్రయాలకు ఎయిర్‌బస్–ఏ380 తన సేవలను అందిస్తుంది.

ఆకు కాదు.. మిడత!



కంకిపాడు: ఆకుకు మీసాలు, కాళ్లు ఉన్నాయి అనుకుంటున్నారా? అయితే మీరు పొరబడినట్లే. ఇది పొడుగు మీసాల మిడత. దీన్ని వాడుక భాషలో బుష్ క్రికెట్ అని పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం టెట్టిగోనిడే. కెమోఫ్లాజింగ్ విధానం మాదిరి ఆకుల్లో ఆకులా, మంచులో మంచులా ఉండి శత్రువు నుంచి ఆర్మీ ఎలా దారి మళ్లిస్తుందో, ఊసరవెల్లి రంగు మార్చుతుందో ఈ మిడత కూడా అలాగే. పంటపై ఆశించి ఆకులను తిని పక్షుల నుంచి తనను కాపాడుకుంటుంది. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లులో బుధవారం సాయంత్రం కనిపించిన ఈ పొడుగు మీసాల మిడతను 'సాక్షి' కెమెరాలో బంధించింది.

తత్కాల్ టికెట్ల బల్క్ బుకింగ్‌లకు చెక్

- ఫేక్ ఐడీలతో జరుగుతున్న అక్రమాల కట్టడికి సంస్కరణలు
- పోర్టల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించిన ఐఆర్‌సీటీసీ



సాక్షి, అమరావతి: ఈ–టికెట్ల బుకింగ్ విధానంలో సమూల మార్పులు చేయాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ప్రధానంగా తత్కాల్ టికెట్లలో బల్క్ బుకింగ్‌ల పేరిట సాగుతున్న అక్రమాలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. దీనిపై సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌తో కలసి రూపొందించిన నివేదికను రైల్వే శాఖకు ఐఆర్‌సీటీసీ సమర్పించింది. రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే ఐఆర్‌సీటీసీ పోర్టల్‌లో సమూల సంస్కరణలు తీసుకువస్తూ.. అప్‌గ్రేడ్ చేయనున్నారు.

దారి మళ్లుతున్న 35 శాతం తత్కాల్ టికెట్లు..

రైల్వే శాఖ ఈ–టికెటింగ్ విధానంలో ప్రవేశపెట్టిన తత్కాల్ టికెట్లను కొన్ని ట్రావెల్ ఏజెన్సీలు దుర్వినియోగం చేస్తున్నాయి. ఫేక్ ఐడీలతో అక్రమంగా బల్క్ బుకింగ్ చేస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ నియమించిన గ్రాంట్ థాంటన్ కన్సల్టెన్సీ నివేదికలో వెల్లడైంది. తత్కాల్ కోటాలోని దాదాపు 35 శాతం టికెట్లు ఇలా దారిమళ్లుతున్నట్టు తేలింది. దీంతో బల్క్ బుకింగ్‌ల దందాకు అడ్డుకట్ట వేయాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. ఇందుకోసం ఈ–టికెటింగ్ పోర్టల్‌లో సంస్కరణలు తీసుకువచ్చి అప్‌గ్రేడ్ చేయనుంది. అలాగే ఈ–టికెట్లకు పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా ఐఆర్‌సీటీసీ పోర్టల్ సామర్థ్యాన్ని కూడా పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 2021 డిసెంబర్ నాటి గణాంకాల ప్రకారం 80.5 శాతం రైల్వే టికెట్లు ఈ–టికెటింగ్ విధానంలోనే బుక్ చేస్తున్నారు. ప్రయాణికులు రైల్వేస్టేషన్లలోని కౌంటర్ల వద్ద కంటే ఐఆర్‌సీటీసీ పోర్టల్ ద్వారా మూడు రెట్లు అధికంగా టికెట్లు కొనుగోలు చేస్తున్నారు. ఐఆర్‌సీటీసీ పోర్టల్‌లో ఇప్పటివరకు 10 కోట్ల మంది నమోదు చేసుకోగా.. వారిలో 7.50 కోట్ల మంది ఈ–టికెట్ల కొనుగోలులో క్రియాశీలకంగా ఉంటున్నారు. 2014లో అప్‌గ్రేడ్ చేసిన ఐఆర్‌సీటీసీ పోర్టల్‌కు సగటున నిమిషానికి 28 వేల లావాదేవీలు సాగించే సామర్థ్యముంది. కానీ గత ఎనిమిదేళ్లలో డిమాండ్ అమాంతం పెరిగింది. దీనికి తగ్గట్టుగా సేవలు అందించేందుకు పోర్టల్ సామర్థ్యం సరిపోవడం లేదు. దీంతో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. అందుకే పోర్టల్‌సామర్థ్యాన్ని కూడా పెంచాలని ఐఆర్‌సీటీసీ నిర్ణయించింది. నిమిషానికి 40 వేల వరకు లావాదేవీలు సాగించే సామర్థ్యంతో పోర్టల్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ ఏడాది నవంబర్ కల్లా అప్‌గ్రేడ్ చేసిన పోర్టల్ సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని భావిస్తున్నామని ఐఆర్‌సీటీసీ వర్గాలు తెలిపాయి.

ఏపీఈఏపీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

22 నుంచి ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇంజనీరింగ్‌తో పాటు ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు (ఏపీఈఏపీ సెట్–2022) బుధవారం వెబ్ కౌన్సెలింగ్‌కు షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఏడాది మొత్తం 1,94,752 మంది విద్యార్థులు ఏపీఈఏపీ సెట్‌కు హాజరవ్వగా 1,73,572 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ క్రమంలో 22 నుంచి 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, 23 నుంచి 31 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 2 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, సెప్టెంబర్ 3న ఆప్షన్లలో మార్పులకు అవకాశం కల్పించారు. 6వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. అదే రోజు నుంచి 12వ తేదీలోగా సంబంధిత కళాశాలలో విద్యార్థులు రిపోర్టు చేయాలి. ఎట్టిపరిస్థితుల్లోనూ 12వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని అడ్మిషన్ల కన్వీనర్ పోలా భాస్కర్ తెలిపారు. వెబ్ కౌన్సెలింగ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా 25 హెల్ప్ లైన్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు సమస్యలు తలెత్తితే కన్వీనర్ కార్యాలయాన్ని convenorapeapcet 2022@gmail. com హెల్ప్ సెంటర్ 79956 81678, 79958 65456 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పీపీపీ విధానంతో పోర్టుల్లో భారీ పెట్టుబడులు

- త్వరలో ల్యాండ్‌లార్డ్ పోర్టుగా వీపీఏ
- మారిటైమ్ సదస్సులో విశాఖ పోర్టు చైర్మన్ రామ్మోహనరావు



ప్రసంగిస్తున్న వీపీఏ చైర్మన్ రామ్మోహనరావు

సాక్షి, విశాఖపట్నం: ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంతో పోర్టుల్లో భారీగా పెట్టుబడులకు ఆస్కారం కలుగుతోందని విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) చైర్మన్ కె.రామ్మోహనరావు చెప్పారు. పోర్టు సెక్టారులో పీపీపీ విధానంలో మొదటి ప్రాజెక్టు నిర్మించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వీపీఏ ఆధ్వర్యంలో విశాఖలో ఏర్పాటు చేసిన రెండురోజుల మారిటైమ్ ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య సదస్సు–2022ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం పీపీపీ విధానంలో రూ.55 వేలకోట్ల విలువైన 86 ప్రాజెక్టులకు అనుమతులిచ్చిందని చెప్పారు. వీపీఏ కూడా పీపీపీ విధానంలో ముందుకెళుతోందని, కొన్నేళ్లలో ల్యాండ్‌లార్డ్ పోర్టుగా మారనుందని తెలిపారు. వీపీఏ ప్రస్తుతం ఆరు బీవోటీ/పీపీపీ టెర్మినళ్లను నిర్వహిస్తోందని, ఈ ఏడాది మరో నాలుగు పీపీపీ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. దేశ వాణిజ్య పురోగతిలో ప్రైవేటు పెట్టుబడులను ఆకట్టుకునేందుకు పీపీపీ విధానం ఎంతో దోహదపడుతోందన్నారు. దేశంలో సుమారు 20 వేల కిలోమీటర్ల మేర అంతర్గత జలమార్గాలున్నాయని, ఇవి రోడ్డు, రైలు రవాణా మార్గాలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ప్రపంచంలో సముద్రమార్గాల ద్వారా జరిగే సరకు రవాణాలో భారతదేశం 19వ స్థానంలో ఉందని ఆయన తెలిపారు.

పోర్టు ఆధారిత అభివృద్ధికి కృషి..

తొలుత వర్చువల్‌గా కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా శాఖ సహాయ మంత్రి యశోనాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోర్టు ఆధారిత అభివృద్ధికి కృతనిశ్చయంతో ఉందన్నారు. సాగరమాల ప్రాజెక్టులో భాగంగా అనేక ప్రాజెక్టులను ప్రారంభిస్తోందని, అంతర్గత జల రవాణా, స్మార్ట్ పోర్టు సిటీలు, పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంలోనే వినియోగంలోకి తీసుకురాగలుగుతామని చెప్పారు. సాగరమాల డెవలప్‌మెంట్ కంపెనీ, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, టారిఫ్ అథారిటీ, మార్ష్ ఇండియా లిమిటెడ్ ప్రతినిధులు వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విశాఖ కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజినీర్, విశాఖ రైల్వే డీఆర్ఎం అనూప్ శతపతి, పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ దుబే, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, పోర్టు భాగస్వాములు పాల్గొన్నారు.



శ్రీకాకుళం జిల్లా సవరపేటలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



అన్నమయ్యజిల్లా సిద్దవటం మండలం వంతాటిపల్లెలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

గడప గడపకూ భరోసా

సాక్షి, నెట్‌వర్క్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. అన్ని జిల్లాల్లోనూ ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లగా వారికి ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు అండగా నిలుస్తున్నాయని, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు. వైఎస్ జగన్ పాలనలో తామంతా చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారు. సీఎం వైఎస్ జగన్‌కు తమ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని ఆనందంగా తెలియజేశారు.



ప్రకాశం జిల్లా ఉయ్యాలవాడలో మహిళకు ప్రభుత్వ పథకాల లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మావోయిస్టు కోటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వాగులు, గెడ్డలు దాటి వెళ్లిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న మారుమూల గిరిజన గ్రామాలైన అల్లూరి సీతారామరాజు జిల్లా దేవరాపల్లి పంచాయతీలోని గూనలంక, మంగళపాలెం, రామగెడ్డ గ్రామాల్లో ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిసారిగా తమ గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకి ఆయా గ్రామాల గిరిజనులు సాదర స్వాగతం పలికారు. ఆయా గ్రామాలకు కాలి నడకన కొండలు, వాగులు, గెడ్డలు దాటుకుంటూ ఎమ్మెల్యే వెళ్లారు. ప్రతి గడపకూ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోన్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. 270 గడపలకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని చెప్పారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించేందుకు జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని కానీ, సీఎం వైఎస్ జగన్ పోడు భూములకు హక్కు పత్రాలు కల్పించారని గుర్తు చేశారు.



గూనలంక గ్రామానికి వెళ్లేందుకు కాలినడకన వాగు దాటుతున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: డిప్లొమా కోర్సులకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సీపెట్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ సీపెట్ స్కిల్లింగ్ అండ్ టెక్నికల్ సపోర్ట్ సెంటర్ జేడీ సీహెచ్ శేఖర్ బుధవారం తెలిపారు. మూడేళ్ల కాల పరిమితితో పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి డీపీటీ, డీపీఎంటీ కోర్సులు, రెండేళ్ల వ్యవధితో బీఎస్సీ ఉత్తీర్ణులైన వారికి ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీ డిప్లొమా ఇన్ పీపీటీ) కోర్సులో అడ్మిషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. ఆగస్టు 22 లోగా దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. ఏపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పిస్తుండగా, విద్యార్థిని విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ సదుపాయాన్ని సీపెట్ అందిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు 7893586494 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.